ఏప్రిల్
2019

156

సంపుటి : 13 సంచిక : 12 వెల రు. 10/-

## ఈ సంచికలో........

చరిత్రను వక్రీకరిస్తున్న ఆర్ఎస్ఎస్
దేశభక్తి ముసుగులో దేశద్రోహం
ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి-ప్రజల కర్తవ్యాలు
బిజెపిని ఓడించాలి
మానసిక రుగ్మతలను పెంచుతున్న పెట్టుబడిదారీ విధానం
కనీస వేతనాలు - సామాజిక న్యాయం
'రైనిష్ జీటుంగ్' పత్రిక సంపాదకుడుగా కారల్ మార్క్స్
పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా అస్సాంలో నిరసనలు
అటవీ హక్కుల చట్టం రద్దుకు కుట్ర
సాయుధ పోరాట వీరుడు శ్రీనివాస రెడ్డి

నివాళి

# సాయుధ పోరాట వీరుడు శ్రీనివాస రెడ్డి

జూలకంటి రంగారెడ్డి

శ్రీనివాసరెడ్డి భూస్వామ్య కుటుంబానికి చెందినవారు. ఆయన చిన్నతనంలో వారి 'ఉమ్మడి' కుటుంబానికి 900 ఎకరాల భూమి ఉండేది. వారి గ్రామంతో పాటు, పక్కనున్న ఉప్పలపహాడ్‌లో కూడా పటేల్, పట్వారీ గిరీలు వారివే. మొదట వారి కుటుంబంలోని పెద్దలు సాగిస్తున్న పటేల్ గిరిపైన ఎక్కుపెట్టి తమ ఉమ్మడి ఆస్తి అయిన వందల ఎకరాల భూముల్ని పేదలకు పంపిణీ చేయించి ఇంట్లో ధాన్యాన్ని పేదలకు పంచి, కూలీలకు, పాలేర్లకు వేతనాలు పెంచి ఇక నుంచి వెట్టిచాకిరీ చేయొద్దని పేదల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేస్తూ నాటి వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సభ్యుడిగా చేరి దళ కమాండర్‌గా, జోనల్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి అనేక మిలిటెంట్ ఉద్యమాలు నడిపిస్తూ అలుపెరగని పోరాట యోధుడిగా పేరు పొందిన నంద్యాల శ్రీనివాస రెడ్డి (ఎన్ఎస్ఆర్).

**భూస్వామ్య ధనిక కుటుంబంలో పుట్టినా..**

నల్లగొండజిల్లా కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి చెందిన నంద్యాల అప్పా రెడ్డి, లక్ష్మీనర్సమ్మలకు 1918లో శ్రీనివాసరెడ్డి జన్మించారు. భూస్వామ్య కుటుంబం కావడంతో బాగా చదివించాలని వారి కుటుంబ పెద్దలు గట్టి పట్టుదలతో ఉండి చదివించారు. ఏడో తరగతి వరకూ సూర్యాపేటలో, 10వ తరగతి వరకూ ఖమ్మంలో, ఇంటర్మీడియట్ వరంగల్‌లో చదువుకుంటూ ఆనాటి ఉద్యమాలకు ఆకర్షితులై మధ్యలోనే చదువు మానుకొని కమ్యూనిస్టు పార్టీలో సభ్యుడిగా చేరారు.

**ఉద్యమాల వైపు ఆకర్షితులై**

సూర్యాపేటలో చదువుతున్నప్పుడు తన స్నేహితుడిగా ఉన్న ధర్మభిక్షంతో ఎక్కువ కాలం గడిపేవారు. అప్పటికే ధర్మభిక్షానికి ఆర్యసమాజ కార్యక్రమాలతో సంబంధం ఉండి చురుగ్గా పాల్గొంటున్నారు. ఆ కార్యక్రమాలకు వారితో పాటు, శ్రీనివాసరెడ్డి కూడా క్రమం తప్పకుండా హాజరయ్యేవారు. అలీఘడ్ మ్యాట్రిక్స్ అనే పరీక్ష కు సన్నద్ధంలో ఉండగా ఒకసారి దేవులపల్లి



వెంకటేశ్వర్‌రావు(డీవీ) శ్రీనివాసరెడ్డిని కలిశారు. అంతకుముందే ధర్మభిక్షానికి డీవీతో బలమైన సంబంధాలుండేవి. ధర్మభిక్షమే డీవీని శ్రీనివాస రెడ్డికి పరిచయం చేశారు. ఆ క్రమంలో శ్రీని వాస రెడ్డికి కమ్యూనిస్టుపార్టీతో సంబంధం ఏర్పడింది. 1940లో మల్కాపూర్‌లో జరిగిన ఆంధ్ర మహాసభకు శ్రీనివాసరెడ్డిని వాలంటీర్‌గా ఎంపిక చేశారు. సూర్యాపేట నుంచి 30మందిని వాలంటీర్లుగా పంపగా అందులో శ్రీనివాసరెడ్డి ఒకరు. ఆ తర్వాత చిలుకూరు ఆంధ్ర మహా సభకు వాలంటీర్‌గా, భువనగిరి, ధర్మాపురం, ఖమ్మం ఆంధ్ర మహాసభలకు ప్రతినిధిగా హాజరయ్యారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకొని వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, లెవీ-గల్లా రద్దు కావా లని, దున్నేవారికే భూమి కావాలని, గ్రామ స్వరాజ్యాలు ఏర్పడాలని నకిరేకల్ ప్రాంతంలో అనేక గ్రామాల్లో తిరిగి ప్రజలను సమీకరించి పోరాటాలకు సన్నద్ధం చేసి నడిపించారు.

**రజాకార్ల దాడులను తిప్పికొట్టిన ధీరుడు**

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల్లో శ్రీనివాస్‌రెడ్డి ఉద్యమాన్ని విస్తరింపజేశారు. దళాల ఏర్పాటు సమయంలో ఆయుధాలు సేకరించాల్సిన బాధ్యత ఎన్ఎస్ఆర్‌కు పార్టీ అప్పజెప్పింది. ఆయన చిన్నాయన లక్ష్మీనర్సింహారెడ్డి వద్ద ఉన్న తొమ్మిది తుపాకులు, కత్తులను పథకం ప్రకారం బలవంతంగా తీసుకెళ్లి దళ సభ్యులకు అందించారు. 30-40మందిగా ఉన్న దళ సభ్యుల్లో దళకమాండర్‌గా శ్రీనివాసరెడ్డి వ్యవహరించారు. వెట్టిచాకిరీ లెవీ-గల్లాకు వ్యతిరేకంగా భూస్వాములపై దాడులకు పూనుకున్నారు. రజాకార్లు గ్రామాలపై దాడి చేయడానికి పూనుకున్నప్పుడు ఆ గ్రామ ప్రజలను చైతన్యపరిచి దళసభ్యులతో కలిసి తిరుగుబాటు చేయడంతో రజాకార్లు గ్రామాలను విడిచి పారిపోయారు. ఆ క్రమం లోనే రజాకార్లు జరిపిన కాల్పుల్లో ముగ్గురి ప్రాణాలు పోయినా.. ప్రజలు వెనుదిరగకుండా రజాకార్లను తరిమికొట్టారు. తుంగతుర్తి, కొప్పోలు గడీలపై కూడా దాడిచేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. కొప్పోలు గ్రామంలో ప్రజల నుంచి అరబ్బు పోలీసులు బలవంతంగా డబ్బులు వసూలు చేసి వాటిని బస్తాల్లో నింపి ఎడ్లబండ్లపై తరలిస్తుండగా దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకొని ప్రజలకు పంచిపెట్టారు. రావి నారాయణరెడ్డి హైదరాబాద్ వెళ్లిన అనంతరం రామన్నపేట, భువనగిరి ప్రాంతాల్లో కూడా శ్రీనివాసరెడ్డి అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. మునుగోడు, భువనగిరి, రామన్నపేట, నకిరేకల్, మిర్యాలగూడ, హాలి యా, దేవరకొండ ప్రాంతాల్లో వెట్టిచాకిరీ లెవీ-గల్లాను నిర్మూలించేందుకు అనేక పోరాటాలు నిర్వహించారు.

**జైలు నుంచి తప్పించుకుని..**

మిలిట్రీ యాక్షన్ అనంతరం పార్టీపై తీవ్రమైన నిర్బంధం పెరగడంతో శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్‌కు రావాలని కమ్యూనిస్టు పార్టీ సూచించింది. సికింద్రాబాద్ రైల్వే వర్క్‌షాపు నుంచి వస్తుండగా పోలీసులు వీరిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిని అనేక చిత్రహింసలకు గురిచేశారు. ఆ సందర్భం గా మిలటరీ ట్రిబ్యునల్ వారు 1949లో ఉరిశిక్ష విధించారు. అది ఏకపక్షంగా జరిగిన తీర్పు కావడంతో సాక్ష్యాలు నిర్ధారణ కాకపోవడంతో కేసు కొట్టివేశారు. దీంతో ఉరిశిక్ష రద్దయ్యింది. మరోసారి అరెస్టు చేసి 1950 మే 3న హైకోర్టు ట్రయల్ ఉండగా ఉరిశిక్ష ఖాయం చేస్తారని, ఎలాగైనా తప్పించుకొని బయటపడాలని పార్టీ సూచించింది. ఆ ప్రకారం ఎస్కార్ట్‌గా ఉన్న పోలీసుల కన్నుగప్పి శ్రీనివాసరెడ్డితో పాటు, నల్లా నర్సింహులు చాకచక్యంగా వెంటిలేటర్స్ తొలగించుకొని ధైర్యసాహసాలతో తప్పించుకొని బయటపడ్డారని పుచ్చలపల్లి సుందరయ్య రాసిన వీరతెలంగాణ సాయుధ పోరాటగాథ పుస్తకాల్లో మనం చూస్తున్నాం. ఆనాటి ఆ సంఘటన సంచ లనం కల్గించింది. తర్వాత కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ జోన్లకు దానికి శ్రీనివాసరెడ్డి కార్యదర్శిగా వ్యవహరించారు.

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. సాయుధ పోరాట వీరుడు శ్రీనివాస రెడ్డి

2. చరిత్రను వక్రీకరిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్
ఎంవిఎస్ శర్మ .................... 4

3. దేశభక్తి ముసుగులో దేశద్రోహం
ఎ కోటిరెడ్డి...................... 7

4. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి-ప్రజల కర్తవ్యాలు

5. బిజెపిని ఓడించాలి
జె జగదీష్ ...................... 14

6. మానసిక రుగ్మతలను పెంచుతున్న పెట్టుబడిదారీ విధానం
డేవిడ్ మాథ్యూస్ ................ 18

7. కనీస వేతనాలు - సామాజిక న్యాయం
టికె రాజాలక్ష్మీ ................. 24

8. 'రైనిష్ జీటుంగ్' పత్రిక సంపాదకుడుగా కారల్ మార్క్స్
ఎం శివరామకృష్ణన్ ........ 26

9. పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా అస్సాంలో నిరసనలు
సుశాంత్ తాలుక్‌దార్ ............. 30

10. అటవీ హక్కుల చట్టం రద్దుకు కుట్ర
వి వెంకటేశన్ .................... 33



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

పాటూరు రామయ్య

బి.వి. రాఘవులు

తమ్మినేని వీరభద్రం

ఎస్. వీరయ్య

తెలకపల్లి రవి

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ:** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్ : కె.హరికిషోర్: 9490098977**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# సంక్షేమ పథకాలు

ఇకనుండి నగదు బదిలీ ద్వారా ప్రజలకు సామాజిక సహాయం అందించాలి. ఉద్యోగాలు లేనివారికీ, ఉద్యోగం చేస్తున్న వారిలో కూడా మెటర్నిటీ అవసరాలు, అంగవైకల్యం, పనిలో దెబ్బలు తగలడం వంటి పరిస్థితులు ఎదుర్కొంటున్న వారికీ, వృద్ధులకు పెన్షన్లు ఇవన్నీ కూడా నగదు బదిలీ ద్వారా అందించాలి..... "పేదరికం, సంపద పంపిణీ 2018" అన్న పత్రంలో గతేడాది ప్రపంచ బ్యాంకు చేసిన సూచన ఇది.

ఇప్పుడు మన ఎన్నికల ప్రచారాల్లో కేంద్రం నుండి రాష్ట్రాల వరకు బూర్జువా పార్టీల ఎన్నికల హామీలు, ఎన్నికల ప్రణాళికలు చూడండి, ప్రపంచ బ్యాంకు నివేదికను అచ్చుగుద్దినట్లుంటాయి. చౌక బియ్యం, చౌక వస్త్రాలు, ప్రజలకు ప్రభుత్వ విద్య, వైద్యం, రైతుకు సబ్సిడీలు మొదలైన వాటి స్థానంలో నేరుగా డబ్బు చెల్లించేస్తున్నట్లు ఈ పార్టీలన్నీ కోరస్ అందుకున్నాయి. మహిళలకు పసుపుకుంకుమ కింద ఏడాదికి రూ 20 వేలు అని ఒక పార్టీ అంటే కాదు, కాదు 45 సం॥లు నిండిన అక్కలకు ఏడాదికి రూ 75 వేలు ఇస్తానని ఇంకో పార్టీ ప్రకటిస్తుంది. రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు వేసేస్తామని అన్ని పార్టీలు ప్రకటిస్తున్నాయి. నిరుద్యోగులకు భృతి, వృద్ధాప్య పెన్షన్ల పెంపు...ఒక టేమిటి ఎన్నికల హామీలన్నీ నగదు బదిలీ మీదనే నడుస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు అన్ని దేశాలకూ ఇచ్చిన ఆదేశాలనే మన దేశంలో ఈ పార్టీలూ పూర్తిస్థాయిలో అమలుచేయడానికి పూనుకున్నట్లు కనిపిస్తోంది. ప్రపంచ బ్యాంకు ఆదేశాలుగానీ, బూర్జువా పార్టీలు వాటిని శిరసావహించడం గానీ ప్రజల పట్ల, వారి పేదరికం పట్ల ఆందోళనతో కాదు నయా-ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థను రక్షించుకోవడానికే.

ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో, 2030 నాటికి పేదరికాన్ని భూగోళం నుండి నిర్మూలించాలన్న లక్ష్యం, నెరవేరటం లేదు. ఒక వైపు సంపద పెరుగుతుంటే మరోవైపు పేదరికం పెరుగుతోంది. ప్రజల కొనుగోలు శక్తి పడిపోతోంది. ఇది పెట్టుబడిరీ విధానాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతోంది. ప్రజలలో పెరిగే అసంతృప్తి రాజకీయంగా ప్రపంచబ్యాంకు అనుకూల పార్టీలకు ఎన్నికలలో ఇబ్బందులు కలిగిస్తోంది. దానికి తరుణోపాయంగా ప్రపంచబ్యాంకు నగదు బదిలీ మంత్రాన్ని సిఫార్సు చేసింది.

కానీ సంక్షోభాన్ని నివారించే మంత్రం ఇది కాదని చరిత్ర రుజువు చేసింది. లాటిన్ అమెరికాలో నగదు బదిలీ పథకాలు కొంతకాలం పనిచేసినా ఆర్థిక సంక్షోభాలను నివారించలేకపోయాయి. ఆ పథకాలనే నేడు మన దేశంలో, ఆసియా, ఆఫ్రికాల్లోని అనేక దేశాల్లో ప్రవేశపెడుతున్నారు. జరగాల్సిందేమిటి? ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే వారి నిజ ఆదాయాలు పెరగాలి. కార్మికులకు కనీస వేతనాలు పెరగాలి. రైతులకు గిట్టుబాటు ధరలు రావాలి. యువతకు ఉపాధి లభించాలి. అందరికీ ప్రభుత్వ విద్య, వైద్యం అందాలి. మన దేశంలో 20 శాతం పేదరికం పెరుగుదలకు కార్పొరేట్ వైద్య ఖర్చులు కారణమవుతున్నాయని ఒక సర్వే తెలిపింది. ఇవన్నీ జరిగితే ప్రజల కొనుగోలు శక్తి పెరిగి పరిశ్రమల అభివృద్ధికి నిజమైన పునాది ఏర్పడుతుంది. అప్పుడు పెట్టుబడి పెట్టడానికి కూడా పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తారు. పరిశ్రమలు పెరిగితే యువతకు ఉద్యోగాలు వస్తాయి, నిరుద్యోగం తగ్గుతుంది.

మరి ప్రభుత్వాలు ప్రజల నిజ ఆదాయాలు పెంచే మార్గం ఎందుకు అనుసరించడం లేదు? ఎందుకంటే నయా-ఉదారవాదం ఇందుకు అనుమతివ్వదు. అలా చేస్తే మార్కెట్లో ప్రభుత్వ జోక్యం పెరుగుతుందని దాని భయం. అందుకనే నయా-ఉదారవాద విధానాలనుసరించే ఏ ప్రభుత్వాలూ ప్రజల నిజ ఆదాయాలు పెంచే, వారి ఉపాధికి భద్రత కల్పించే విధానాలు చేపట్టలేవు. ఈ విధానాలకు వ్యతిరేకంగా నికరంగా పోరాడుతున్న వామపక్షాల వల్ల, వాటితో కలిసిన నడిచే శక్తుల వల్ల మాత్రమే అది సాధ్యమవుతుంది. అందుకే బిజెపి తరహా నయా ఉదారవాదానికి కాంగ్రెస్ తరహా నయా ఉదారవాదం ప్రత్యామ్నాయం కాదు. టిడిపి తరహా విధానాలకు వైసిపి విధానాలు ప్రత్యామ్నాయం కావు. ఈ విధానాలను మొత్తంగా విడనాడడమే ప్రత్యామ్నాయం. ఈ వైపుగా మార్పులు జరిగేలోపు దేశంలో మతతత్వ శక్తులను ఓడించడం తక్షణ అవసరం.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి.విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

చరిత్ర

# చరిత్రను వక్రీకరిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్

ఎంవిఎస్ శర్మ



రచయిత
ప్రజాశక్తి సంపాదకులు

23 కోట్ల సంవత్సరాల క్రితం భూగోళం



అటు పశ్చిమాన ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఇటు తూర్పున బర్మా (మయన్మార్) దాకా, ఉత్తరాన టిబెట్టు నుంచి దక్షిణాన సింహళం దాకా అంతా ఒక్కటే దేశం అని, దీనినే ఆర్యావర్తం అని పిలుస్తారని ఆరెస్సెస్ సిద్ధాంతకర్తలు చెప్తుంటారు. ఈ ప్రాంతమంతా ఒకప్పుడు ఒకే రాజ్యంగా ఉండేదని, ఇదంతా ఆర్యుల ఏలుబడిలో ఉండేదని, ఆర్యులు ఇక్కడి వారే తప్ప వేరే ఎక్కడి నుంచో రాలేదని, ఇలా చాలా చాలా కథనాలు ప్రచారంలో పెట్టిస్తున్నారు. దీనినే చరిత్ర అంటున్నారు. శాస్త్రీయంగా చరిత్రకారులు పరిశోధించి ధృవ పరిచిన చరిత్ర ఇందుకు భిన్నంగా ఉంది. అందుచేత ఆరెస్సెస్ వారు ఈ చరిత్ర పుస్తకాలనే తిరగరాసేస్తున్నారు. పుక్కిటి పురాణాలను చరిత్రగా బోధించే పనిలో పడ్డారు.

మన చుట్టూ ఉన్న సమాజం, ప్రకృతి గతిశీలమైనవి. అంటే నిరంతరం మారుతూ వుండే స్వభావం కలిగినట్టివి. ఈ మార్పు జరిగే క్రమాన్ని మనకు వివరించి చెప్పేది చరిత్ర. కేవలం ఊహాగానాల చుట్టూ అల్లిన కల్పిత గాథలను ముందుకు తెచ్చి, వాటికి ఏ ఆధారాలు లేకపోయినా అవే చరిత్ర అని మనపై రుద్దడం అంటే మన గతం యొక్క నిజమైన వారసత్వాన్ని మనకు లేకుండా చేయడమే. సుదీర్ఘ కాలంలో మనుషుల జీవన సరళి మారుతూ వస్తోంది. దాంతో బాటు మనుషుల ఆలోచనా సరళి, విశ్వాసాలు, ఆచారాలు, భాష అన్నీ మారుతూ వస్తున్నాయి. నూట ఏభై సంవత్సరాల క్రితం చార్లెస్ డార్విన్ అన్ని రకాల జీవ జాతులు – మనుషులతో సహా ఏ విధంగా ఒక పరిణామ క్రమంలో ఆవిర్భవించాయో వివరించారు. ఈ జీవరాశులు ఆవిర్భవించడానికి ముందే ఈ భూమండలం, దాని ఉపరితలం ఏ విధంగా మారుతూ వచ్చిందో శాస్త్రవేత్తలు అంతకు ముందే తెలియజేశారు.

ఈ భూమి ఉపరితలం పొరలు పొరలుగా ఏర్పడి ఉంది. ఒక్కోపొరలో ఆ కాలంనాటి అవశేషాలు– రాళ్ళు, శిలాజాలు, మొక్కలు, జంతువుల అవశేషాలు లభిస్తాయి. ఒకానొక పద్ధతి ద్వారా (దీనినే పొటాషియం–ఆర్గాన్ పద్ధతి లేదా కె ఆర్ పద్ధతి అంటారు) ఏరాయి ఏనాటిదో నిర్ధారించగలగడం శాస్త్రవిజ్ఞానం సాధించిన ఒక గొప్ప విజయం. భూ అయస్కాం త క్షేత్రం యొక్క ప్రస్తుత దశ మొదటి నుంచీ ఇలాగే ఉందనుకోరాదు. అది కూడా మారుతూ వస్తోంది. ఈ విషయాన్ని ప్రాతిపదిక గా చేసుకుని 'పాలియో మాగ్నెటిజం' అనే శాస్త్రీయ విధానాన్ని రూపొందించారు. దీనిని బట్టి ఒక రాయి అయస్కాంత దశను బట్టి అది ఏ కాలం నాడు ఏర్పడిందో అంచనా వేయవచ్చు.

ఇలా శాస్త్రీయ ప్రాతిపదికన భూగర్భ శాస్త్రవేత్తలువేసిన అంచనాల ఆధారంగా భూమి, జీవపరిణామాన్ని కింది విధంగా కొన్ని దశలుగా విభజించారు.

మానవుల చరిత్రలోకి పోయే ముందు భూమి చరిత్రకు సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలు తెలుసుకుందాం.

460 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడిన భూమి మొదట్లో ఇప్పుడున్నంత సైజులో లేదు. మొదట్లో ఇంతకన్నా చిన్నగా ఉండేది. క్రమంగా దానిసైజు పెరుగుతోంది. అంటే భూమి లోపల


కొంత బోలుగా మారుతూ పరిమాణం పెరుగుతోందన్నమాట. తొలుత ఉన్న సైజు కన్నా 5/3 రెట్లు పెరిగిందని అంచనా వేశారు. ఇందుకు 350 కోట్ల సంవత్సరాలు పట్టిందని గమనించాలి. భూమి ఉపరితలం ఒకప్పుడు దగ్గరగా అతుక్కుని వుండేది కాస్తా ఈ సైజు పెరిగే క్రమంలో ముక్కలుగా విడిపోయి ఒకదానికొకటి దూరంగా జరుగుతూ వచ్చింది.

ఒకప్పుడు ఇండియా, ఆస్ట్రేలియా, అంటార్కిటికా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా అంతా కలిపి ఒకే భూఖండంగా ఉండేదని తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది కదా! ఐతే ఇది ఎప్పటిమాట? 23 కోట్ల సంవత్సరాల క్రితం సంగతి ఇది. ఈ అయిదు భాగాలూ కలిసి వుండిన భూభాగానికి శాస్త్రవేత్తలు 'గోండ్వానా ల్యాండ్" అని నామకరణం చేశారు. ఈ అయిదు భాగాలూ ఒకదానికొకటి దూరంగా జరుగుతూ పోయాయి. 6 కోట్ల 50 లక్షల సంవత్సరాల క్రితం నాటికి భారత ఉపఖండం నెమ్మదిగా జరిగి, యూరేషియా భూ ఖండానికి సమీపంగా వచ్చి దానిని తాకింది. ఈ క్రమంలోనే హిమాలయ పర్వతాలు ఏర్పడ్డాయి. సముద్ర గర్భంలో ఉండే మట్టినుంచి హిమాలయ పర్వతాలు ఏర్పడ్డాయి. ఆశ్చర్యంగా ఉంది కదా! కాని ఇది వాస్తవం. ఇప్పుడు హిమాలయాలు ఉన్న చోట ఒకప్పుడు సముద్రం ఉండేది. అందుకే సముద్ర జీవుల (ఆరున్నరకోట్ల సంవత్సరాల క్రితపు జీవుల) శిలాజాలు హిమాలయ ప్రాంతాల్లో లభ్యం అవుతున్నాయి. భారత ఉపఖండం వాయువ్య భాగాన ఉన్న ఆరావళి పర్వతాల సమీపంలో (రాజస్థాన్, కచ్ ప్రాంతాలలో) డైనోసార్ల కాలంనాటి సముద్రజీవుల శిలాజాలు (14 నుంచి 21 కోట్ల సంవత్సరాల నాటివి) లభించాయి. దీనిని బట్టి ఆఫ్రికాఖండం నుండి విడగొట్టుకుని జరుగుతూ పోయిన భారత ఉపఖండం ముందు యూరేషియా భూభాగానికి (ఇరాన్ సమీపంలో) గుద్దుకున్నది. ఆ తర్వాత తక్కిన భాగం చైనా ఉన్న భూఖండానికి గుద్దుకుందని అర్థం అవుతుంది. దక్కను భూభాగంలో లభించిన ఆధారాలను బట్టి ఆ ప్రాంతం అంతా ఒకప్పుడు సముద్రం కింద ఉండేదని తేలుతోంది. భారత ఉపఖండం యూరేషియన్ భూభాగానికి గుద్దుకునే కాలంలోనే పెద్దఎత్తున అగ్నిపర్వతాలు బద్దలై పెల్లుబికిన లావా, బూడిద దక్కను ప్రాంతంలో దాదాపు 5లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించాయి. ఈ ప్రక్రియ దాదాపు పదిలక్షల సంవత్సరాల పాటు జరిగిఉంటుంది. ఇదే కాలంలో రెండోపక్క హిమాలయాలు పెరగడం

**"ఒకప్పుడు ఇండియా, ఆస్ట్రేలియా, అంటార్కిటికా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా అంతా కలిపి ఒకే భూఖండంగా ఉండేదని తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది కదా! ఐతే ఇది ఎప్పటిమాట? 23 కోట్ల సంవత్సరాల క్రితం సంగతి ఇది. ఈ అయిదు భాగాలూ కలిసి వుండిన భూభాగానికి శాస్త్రవేత్తలు 'గోండ్వానా ల్యాండ్" అని నామకరణం చేశారు. ఈ అయిదు భాగాలూ ఒకదానికొకటి దూరంగా జరుగుతూ పోయాయి."**


| కాలం (కోట్ల సం॥లలో) | ఆవిర్భవించిన జీవరాశులు |
|---|---|
| 460 | భూమి ఏర్పడింది (జీవం మొదలు కాలేదు) |
| 400 | ఆల్గేవంటి వృక్షజాతి సూక్ష్మరూపాలు, బాక్టీరియా వంటి సూక్ష్మజీవులు |
| 250 | ఆల్గేలోని ఉన్నత స్థాయి జాతులు, జెల్లీ మాదిరిగా ఉండే జీవరాశులు |
| 57 | చేపలు |
| 50.5 | పగడపు జాతులు |
| 43.8 | నేలపై మొక్కలు, పురుగులు |
| 40.8 | ఫెర్న్ జాతి మొక్కలు, నాచు జాతులు, ఉభయచరాలు |
| 36 | రెక్కలున్న పురుగులు |
| 32 | పాకే జీవులు (బల్లి, పాము వంటివి) |
| 24.8 | డైనోసార్లు |
| 21.3 | పక్షులు, స్థన్యజీవులు |
| 14.4 | పుష్పించే మొక్కలు |
| 9.8 | డైనోసార్ల చివరి కాలం |
| 6.5 | భారీ స్థన్యజీవులు |
| 5.5 | గడ్డిజాతులు |
| 2.5 | నరవానరులు (ఏప్స్) |
| .5 | రెండు కాళ్లపై నిలిచే నరవానరాలు |
| .18 | పురాతన మానవులు, ఏనుగులు, గుర్రాలు, పశువులు |

**6 కోట్ల 50 లక్షల ఏళ్ళక్రితం భారత ఉపఖండం**



**అప్పటి హద్దులు**

> ❝ సముద్రం కింద ఉండే భూభాగాలు కొన్నిచోట్ల పైకి తేలాయి. అలా తేలిన చోట్ల వేర్వేరు భూభాగాల మధ్య భూమార్గాలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు శ్రీలంకకు, భారత్‌కు మధ్య అలా ఏర్పడినదే ఆడమ్స్ బ్రిడ్జ్. ఈ మార్గాల ద్వారా జంతువులు, నరవానరా లు, ఒక చోటి నుండి ఇంకోచోటికి పోగలిగారు. మంచు యుగం ముగిసేసరికి తిరిగి భూమిమీద ఉష్ణోగ్రత పెరగటంతో మళ్లీ నీరుకరిగి సముద్ర మట్టాలు పెరిగాయి.❞




కూడా సంభవించింది. అక్కడి నుండి రాళ్లూ, నీరూ ప్రవాహాలుగా దిగువకు వచ్చిన క్రమంలోనే హిమాలయాలకు దిగువన ద్వితీయ పర్వతశ్రేణి – శివాలిక్ కొండలు ఏర్పడ్డాయి. చైనాకు, భారత భూభాగానికి మధ్య ఉండిన సముద్ర భాగం పూర్తిగా మూసుకుపోయింది. ఈ క్రమంలోనే బ్రహ్మాండమైన సింధు, గంగ, బ్రహ్మపుత్ర నదులు ఏర్పడ్డాయి.

ఈ అద్భుతమైన భౌగోళిక మార్పులు కొన్ని చోట్ల వేల సంవత్సరాల పాటు జరిగాయి. ఈ క్రమంలోనే ఈ ప్రాంతంలో (2.5 కోట్ల సంవత్సరాల – 50 లక్షల సంవత్సరాల మధ్య యుగంలో) నరవానరాలు ప్రత్యక్షం అయ్యాయి. తొలినాటి (పురాతన) మానవాకారం గల జంతువులు ప్రత్యక్షం అయ్యారు.

మంచుయుగాలు–ప్రభావం: 20 లక్షల సంవత్సరాల క్రితం నుండి దాదాపు 10 వేల సంవత్సరాల క్రితం వరకు ఈ భూభాగం చాలా మార్పులకు లోనైంది. మంచుయుగం ఏర్పడడం, మరలా ఉష్ణోగ్రతలు పెరిగి ఆ మంచు కరగడం, తిరిగి మరో మంచుయుగం – ఇలా దఫ దఫాలుగా జరిగింది. 20 లక్షల సంవత్సరాల క్రితం సముద్ర మట్టం ఇప్పటి ఇప్పుడున్న పాకిస్తాన్ – రాజస్థాన్ మధ్యప్రాంతంలో 20 లక్షల సంవత్సరాల క్రితం సముద్రమట్టం కన్నా 100 నుంచి 150 మీటర్లు దిగువకు ఉండేది. సముద్రంలోని నీరు గడ్డ కట్టుకుపోయి ధృవప్రాంతాలదగ్గర ఘనీభవించినందున సముద్రమట్టాలు పడిపోయాయి.

అందువలన సముద్రం కింద ఉండే భూభాగాలు కొన్నిచోట్ల పైకి తేలాయి. అలా తేలిన చోట్ల వేర్వేరు భూభాగాల మధ్య భూమార్గాలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు శ్రీలంకకు, భారత్‌కు మధ్య అలా ఏర్పడినదే ఆడమ్స్ బ్రిడ్జ్. ఈ మార్గాల ద్వారా జంతువులు, నరవానరాలు, ఒక చోటి నుండి ఇంకోచోటికి పోగలిగారు. మంచు యుగం ముగిసేసరికి తిరిగి భూమిమీద ఉష్ణోగ్రత పెరగటంతో మళ్లీ నీరుకరిగి సముద్ర మట్టాలు పెరిగాయి. అప్పుడు భూ ఖండాల మధ్య లింకు తెగిపోయింది. మరొక మంచుయుగం మొదలవగ్గానే మళ్లీ ఇదే పద్ధతిని జీవరాసులు, ముఖ్యంగా వివిధ జంతువులు, నరవానరాలు ఒకవైపునుండి ఇంకొకవైపుకు తరలిపోవడం సంభవించింది. ఇలా సుమారు 10 వేల సంతవ్సరాల క్రితం వరకు జరుగుతూనే ఉంది. గత మంచుయుగం 30 వేల సంవత్సరాల క్రితం సంభవించింది. అంతకుముందు మంచు యుగం లక్షా ఇరవై వేల సంవత్సరాల క్రితం వచ్చింది. 5000 సంవత్సరాల క్రితం సముద్రమట్టం ఇప్పటికన్నా 3 మీటర్లు ఎత్తు ఉండేది. అందువలన ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు కొన్ని భూభాగాలు మునిగిపోవడం, తగ్గినప్పుడు బైటపడడం జరుగుతూ వచ్చిందని గ్రహించాలి. అలా మునిగిపోయిన ప్రాంతాలలో సౌరాష్ట్ర తీరంలోని ద్వారక పట్టణం కూడా ఒకటి. తరచూ సంభవించే భూకంపాలు నదుల పరీవాహక దిశను, ప్రాంతాన్ని కూడా మార్చివేస్తాయి. కొండలు కూడా ఎత్తు తగ్గడం గాని, పెరగడం కాని జరుగుతుంది. ఉత్తరభారత ప్రాంతంలో నదుల పరీవాహక దిశలు మారిన దాఖలాలున్నాయి. సట్లైజ్‌నది (సింధునదికి ఉపనది) యమునానది ఈ రెండింటిలోనూ ఒకే జాతి డాల్ఫిన్ చేపలు సంచరించడాన్ని బట్టి సట్లైజ్‌నది తూర్పుగా ప్రవహించి యమునతో కలవడంగాని, లేదా యమున పశ్చిమంగా ప్రవహించి సట్లైజ్‌లో కలవడం గాని జరిగి ఉండాలి. ఒకప్పుడు తూర్పువైపు ప్రవహించిన బ్రహ్మపుత్ర తనదిశను మార్చుకుని దక్షిణం వైపు తిరిగి గంగలో కలుస్తుంది. బీహార్‌లోని కోసినది పలుమార్లు దిశలు మార్చుకుని ప్రవహించడం జరిగింది.

భారత ఉపఖండం భౌగోళిక స్వరూపం ఇప్పుడు మనం చూస్తున్న దానికి, పదివేల సంవత్సరాల క్రితం నాటికి పెద్ద తేడాలేదనే చెప్పాలి. ఈ ప్రాంతంలోని వాతావరణం, నదులు, వర్షపాతం, ఉష్ణోగ్రతలు విస్తార భూభాగంలో అడవులు విస్తరించడానికి దోహదం చేశాయి. వాయవ్య ప్రాంతంలో మాత్రం అంతగా అడవులు లేవు. తక్కువ ప్రాంతంలో విస్తరించిన అడవులు పలురకాల జీవజాలం, జంతువులు ఇక్కడ మనగలిగేందుకు దోహద పడ్డాయి. ఇదీ క్లుప్తంగా మనదేశ భూభాగ చరిత్ర. ఇక ఈ ప్రాంతంలో మానవజాతి ప్రస్థానం ఎలా మొదలైందీ వచ్చే నెల తెలుసుకుందాం. ❊

ఈ మాసం ప్రత్యేకం

# దేశభక్తి ముసుగులో దేశద్రోహం

ఎ కోటిరెడ్డి



రచయిత
ప్రజాశక్తి సహాయ సంపాదకులు

**పు**ల్వామాలో తీవ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది సైనికులు చనిపోయిన ఘటనను తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకోవటానికి బిజెపి, సంఘ్ పరివార్ అనుబంధ సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఘటనకు బాధ్యులైన తీవ్రవాదులను కాశ్మీర్ ప్రజల నుండి దూరం చేయటం, అంతర్జాతీయ సమాజపు మద్దతును కూడగట్టుకొని తీవ్రవాద సంస్థలను, వాటిని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌ను ఏకాకులను చేయటం, దేశప్రజల సంఘీభావాన్ని కూడగట్టటం వంటి చర్యలు చేపట్టి ఉంటే మనసులను గెలుచుకొనే అవకాశం ఉండేది. కాని దీనిని మోడీ ప్రభుత్వం వమ్ము చేసింది. ఘటన జరిగిన వెంటనే పాక్ వ్యతిరేక, కాశ్మీరీ ముస్లీం వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రం చేశారు. ప్రధాని నరేంద్రమోడి, కేంద్రమంత్రులు, బిజెపి నాయకులు ఈ ప్రచారంలో ముందున్నారు. "ఈ ఘటనతో దేశ ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారని, వారి రక్తం మరుగుతున్నదని, దానిని తాను అర్థం చేసుకున్నానని," ఘటన జరిగిన మరుచటి రోజు ప్రధాని ప్రకటించటం ద్వారా దేశ ప్రజలను రెచ్చగొట్టి, కాశ్మీరీయులపై, ముస్లిం పై దాడులకు ప్రోత్సహించాడు. కేంద్రమంత్రులు, బిజెపి నాయకులు, ఆ పార్టీ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు ఇదే విధంగా వ్యవహరించాయి. సంఘ్ పరివార్ అనుయాయి, మేఘాలయ గవర్నర్ తథాగతరాయ్ కాశ్మీరీయులను ఆర్థికంగా బహిష్కరించాలని పిలుపునిచ్చాడు. దేశంలోని వివిధ ప్రాంతాలలో, ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో నివసిస్తున్న కాశ్మీరీయులకు వ్యతిరేకంగా సంఘ్ పరివార్ సంస్థల నాయకత్వంలో ప్రదర్శనలు జరిగాయి. వివిధ పట్టణాలు, నగరాలలో నివసిస్తూ చిన్న వృత్తులు, వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న కాశ్మీరీయులను లక్ష్యంగా చేసుకొని దాడులు, దౌర్జన్యాలు చేశారు. వారు నివసిస్తున్న ప్రాంతాలను వదిలి కాశ్మీర్ లేదా పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలని ముస్లింలను బెదిరించారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో విద్యాభ్యాసం చేస్తున్న కాశ్మీరీ విద్యార్థులను పట్టణాలను, కాలేజీలను వదిలిపోవాలని బెదిరించారు. కాలేజీల్లో,విద్యా సంస్థలలో కాశ్మీరీ విద్యార్థులను చేర్చుకోరాదని యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు. డెహ్రాడూన్‌లోని కాలేజీలలో కాశ్మీరీ విద్యార్థులను చేర్చుకోరాదని మొదట ఆందోళన ప్రారంభించారు. తర్వాత కాలేజీలలో చదువుతున్న కాశ్మీరీ విద్యార్థులను పంపివేయాలని యాజమాన్యంపై వత్తిడి తెచ్చారు. ఆల్‌పైన్ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ సంస్థ 340 మంది కాశ్మీరీ విద్యార్థులను, డీన్‌ను తొలగించాలన్న ఒత్తిడికి లొంగిపోయింది. ఇతర చోట్ల కూడా ఇటువంటి పరిణామాలు జరిగాయి. ఈ విధంగా వారం రోజుల పాటు కాశ్మీర్ ప్రజలపై తీవ్రమైన దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నా ప్రభుత్వం జోక్యం చేసుకోలేదు. ప్రధాని, మంత్రులు, బిజెపి నాయకులు ఎవ్వరూ కాశ్మీరీయులపై జరుగుతున్న దాడులు తప్పని చెప్పటం గాని, దాడులు చేస్తున్న వారిని అడ్డుకోవటం కాని చేయలేదు.

ఈ దాడులను నిరోధించాలని కోరుతూ న్యాయవాది తారిక్ అదీబ్ దాఖలు చేసిన పిటీషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు కాశ్మీరీయులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, వారిని సామాజిక బహిష్కరణ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, దాడులకు గురవుతున్న వారికి రక్షణ కల్పించాలని ఉత్తర భారతదేశంలోని 10 రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు, డిజిపిలకు, ఢిల్లీ డిజిపికి ఫిబ్రవరి 22వ తేదీన ఆదేశాలు జారీచేసింది. సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసిన తర్వాత మాత్రమే కాశ్మీరీయులకు రక్షణ కల్పించాలని కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇది జరిగిన మరుచటి రోజు, అంటే ఫిబ్రవరి 23వ తేదీన కాశ్మీరీయులపై దాడులు చేయటం అంటే తీవ్రవాదులను బల పర్చటమే అవుతుందని, గత వారం రోజులలో జరిగిన ఘటనలు పునరావృతం కారాదని ప్రధాని చెప్పాడు. కాశ్మీరీయులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు ప్రతిరోజూ ప్రసార సాధనాలలో వస్తుంటే ఈ మాట చెప్పటానికి ప్రధాని 10 రోజుల సమయం ఎందుకు తీసుకున్నాడు? 15వ తేదీన దాడులకు ఉసిగొలుపుతూ మాట్లాడి, వారం రోజుల పాటు కాశ్మీరీయులపై దాడులు జరుగుతున్నా నోరెత్తకుండా కూర్చుని మొక్కుబడిగా చెప్పిన ప్రధాని సుభాషితాల మర్మమేమిటో సంఘ్ పరివార్‌కు బాగా తెలుసు. అందువల్లనే ప్రధాని ప్రకటన తర్వాత కూడా పరివార్ వైఖరిలో ఏ మాత్రం మార్పు రాలేదు. కాశ్మీరీయులపై ముస్లింలపై యధేచ్ఛగా దాడులు, బెదిరింపులు జరుగుతూనే ఉన్నాయి.

పుల్వామా ఆత్మాహుతి దాడి జరిగిన తర్వాత పాక్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై ప్రభుత్వం వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల అనంతరం పాక్ ప్రతి దాడులు చేయటంతో మన వైమానిక దళం ఒక పాక్ యుద్ధ విమానాన్ని కూల్చివేయగా, పాకిస్థాన్ మనయుద్ధ విమానం ఒకదానిని కూల్చివేసి, పైలట్ అభినందన్‌ను బందీగా పట్టుకుంది. అంతర్జాతీయంగా వస్తున్న ఒత్తిడి, అంతర్గత పరిణామాల వలన పాక్ రెండు రోజుల తర్వాత పైలట్‌ను విడుదల చేసింది. అనంతరం బిజెపి నాయకులు పైలట్ ఫోటోతో ప్రకటనలు విడుదల చేస్తూ, ముస్లింలపై వ్యతిరేకతను పెంచే విధంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. పాక్‌లోని తీవ్రవాద శిబిరాలపై దాడిచేసి, 350 మంది తీవ్రవాదులను మట్టుబెట్టామని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. వైమా

**❝జమ్మూకాశ్మీర్‌లో తీవ్రవాదులను అణచి వేయటం కోసమంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "ఆపరేషన్ ఆల్ అవుట్" వైఫల్యాన్ని ఈ అంశాలు రుజువు చేస్తున్నాయి. కాశ్మీర్‌లో తీవ్రవాద కార్యకలాపాలను అదుపు చేయటం కోసం గతంలో ప్రభుత్వాలు వేర్పాటువాద నాయ కులతో, గ్రూపులతో చర్చలు జరపటం, వివిధ సంస్థలతో సంబంధాలు కొనసాగిం చటం,కాశ్మీర్ ప్రజలలో విశ్వాసాన్ని పెంచటం కోసం అపుడపు డు కొన్ని చర్యలు తీసుకోవటం జరిగేది.❞**

నిక దళం జరిపిన దాడిలో తీవ్రవాదులెవరూ చనిపోలేదని కేంద్రమంత్రి చెప్పాడు. పాక్‌లోని తీవ్రవాదుల స్థావరాలపై దాడులు చేసిన అనంతరం తీవ్రవాద దాడులు తగ్గకపోగా మరింత పెరగటం గమనార్హం.

**మూడు దశాబ్దాల్లో కాలంలోనే తీవ్రదాడి**

ఫిబ్రవరి 14వ తేదీన పుల్వామాలో జరిగినంతటి తీవ్రమైన దాడి కాశ్మీర్‌లోని భద్రతాదళాలపై గత మూడు దశాబ్దాలలో జరగలేదు. దేశరక్షణ విషయంలో బిజెపి ప్రభుత్వ వైఫల్యాన్ని ఈ దాడి వెల్లడించింది. ఆర్‌డిఎక్స్‌ను కాశ్మీర్‌లోకి రహస్యంగా తరలించటం, బిఎస్ఎఫ్ దళాలు పయనిస్తున్న మార్గంలో ఆర్‌డిఎక్స్‌తో ఉన్న వాహనం దూసుకురావటం, ఒక్కసారిగా 2,500 మంది రక్షకదళాలను రోడ్డుమార్గంలో తరలించటం తదితరాలు సైనికదళాల రక్షణ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తున్నాయి. జమ్మూశ్రీనగర్ మధ్య సైనికదళాలను విమానాల ద్వారా తరలించాలని గతంలో సైనికాధికారులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం అంగీకరించలేదు.

మోడి అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఐదు సంవత్సరాలలో జమ్మూకాశ్మీర్‌లో తీవ్ర వాదం గణనీయంగా తగ్గిందని, తీవ్రవాద దాడు లు తగ్గాయని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. కానీ వాస్తవాలు ప్రభుత్వ వాదనలకు భిన్నంగా ఉన్నాయి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి తీవ్రవాద సంస్థల్లో చేరుతున్న స్థానికుల సంఖ్యపెరిగింది. 2016-18 మధ్య 400 మంది టెర్రరిస్టులు దేశంలోకి ప్రవేశిం చారని ప్రభుత్వం రాజ్యసభలో ప్రకటించింది. టెర్రరిస్టు దాడులు 2014లో 222, 2015లో 208, 2016లో 322, 2017లో 342, 2018లో 614కు పెరిగాయి. 2018లో ప్రతి నెలా 51 దాడులు జరిగాయి. 2014లో 18 నుండి 2018లో 191కి వీరి సంఖ్యపెరిగింది. ఈ కాలంలో తీవ్రవాదుల దాడులలో 1315 మంది మరణించగా వారిలో 138 మంది సాధారణ పౌరులు, 339 మంది సైనికులు, 838 మంది టెర్రరిస్టులు ఉన్నారు. పౌరుల మరణాలు 35.71 శాతం, రక్షణ సిబ్బంది మర ణాలు 93 శాతం, టెర్రరిస్టుల మరణాలు 133.63 శాతం పెరిగాయి. ఇంతపెద్దసంఖ్యలో తీవ్రవాదులు కాశ్మీర్‌లోకి చొరబడి, దాడులు, హత్యలు చేస్తుండగా తీవ్రవాదం తగ్గిందని ప్రభు త్వం ప్రచారం చేయటం హాస్యాస్పదం. కాశ్మీర్ లో తీవ్రవాదులను అదుపు చేయటంలో శాంతి భద్రతలను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఇవన్నీ స్పష్టం చేస్తున్నాయి.

జమ్మూకాశ్మీర్ లో తీవ్రవాదాన్ని అణచి వేశామని, నోట్లరద్దుతో వారి ఆర్థిక మూలాల్ని దెబ్బతీశామని, పెద్దనోట్లను రద్దు చేసినపుడు, తర్వాతా మోడి ప్రచారం చేశాడు. నోట్లరద్దుతో తీవ్రవాదం తగ్గుతుందని ప్రధాని చేసిన ప్రచారం పచ్చి అబద్ధమని ఈ పరిణామాలు స్పష్టం చేస్తు న్నాయి. నోట్లరద్దు తర్వాత తీవ్రవాదం తగ్గక పోగా అనేక రెట్లు పెరిగిందని ప్రభుత్వం పార్ల మెంటులోప్రకటించిన వివరాలు వెల్లడిస్తున్నాయి.

**ఆపరేషన్ ఆల్ అవుట్ విఫలం**

జమ్మూకాశ్మీర్‌లో తీవ్రవాదులను అణచి వేయటం కోసమంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటిం చిన " ఆపరేషన్ ఆల్ అవుట్" వైఫల్యాన్ని ఈ అంశాలు రుజువు చేస్తున్నాయి. కాశ్మీర్‌లో తీవ్రవాద కార్యకలాపాలను అదుపు చేయటం కోసం గతంలో ప్రభుత్వాలు వేర్పాటువాద నాయ కులతో, గ్రూపులతో చర్చలు జరపటం, వివిధ సంస్థలతో సంబంధాలు కొనసాగించటం,కాశ్మీర్ ప్రజలలో విశ్వాసాన్ని పెంచటం కోసం అపుడపు డు కొన్ని చర్యలు తీసుకోవటం జరిగేది. తద్వారా కొంతమేరకు ప్రజలతో సంబంధాలు కొనసాగిం చటానికి, తీవ్రవాద కార్యకలాపాలను అదుపు చేయటానికి అవకాశం ఉండేది. ఇది తీవ్ర వాదుల పట్ల మెతకగా వ్యవహరించటం అని, ఈ విధానం వలన తీవ్రవాదులు, వారి కార్య కలాపాలు పెరిగిపోతున్నారని బిజెపి ప్రభుత్వం భావిస్తున్నది. తీవ్రవాదుల పెరుగుదలను, వారి కార్యకలాపాలను అదుపు చేయాలంటే వారిని భౌతికంగా నిర్మూలించటమేమార్గమని ప్రచారం చేస్తున్నది. చర్చలు, సంప్రదింపుల విధానాన్ని పక్కన పెట్టింది. తీవ్రవాదులను భౌతికంగా నిర్మూలించటం కోసమంటూ "ఆపరేషన్ ఆల్ అవుట్" కార్యక్రమాన్ని 2017 జనవరిలో ప్రారంభించింది. ఈ కార్యక్రమం ప్రారంభించిన తర్వాత తీవ్రవాదుల సంఖ్య తగ్గటానికి బదులు పెరిగిందని ప్రభుత్వం వెల్లడిస్తున్న అంకెలే స్పష్టం చేస్తున్నాయి. తీవ్రవాదుల సంఖ్య పెరగటం కన్నా మరింత ఆందోళన కలిగించే అంశం ఈ కాలం లో తీవ్రవాదులలో చేరుతున్న స్థానిక యువకుల సంఖ్య పెరగటం. గత దశాబ్ద కాలంకన్నా బిజెపి పాలనలోనే ఎక్కువగా స్థానిక యువకులు తీవ్రవాదులలో చేరారు. గతంలో ఏనాడూ లేని విధంగా స్థానిక తీవ్రవాదుల సంఖ్య 300కు పెరిగింది.

**ప్రజాస్వామ్యానికి విఘాతం**

రాష్ట్రంలో పిడిపి, బిజెపి ప్రభుత్వం పతనమైన తర్వాత స్థానికంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి ప్రయ త్నాలు జరుపుతున్న క్రమంలో దానిని నిరోధిం చటం కోసం గవర్నర్ నిరంకుశంగా శాసనసభను రద్దు చేశాడు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికలతో పాటు కాల పరిమితి ముగిసిన రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరుపుతున్నారు. కానీ జమ్మూకాశ్మీర్ శాసనసభకు మాత్రం ఎన్నికలు జరపటం లేదు. శాసనసభ ఎన్నికలు జరపటానికి రక్షణ బలగాలను సమకూర్చటం సాధ్యం కాదని, అందువలన పార్లమెంటు ఎన్నికలతో పాటు శాసనసభ ఎన్నికలు జరపటం లేదని, ఈ ఎన్నికలు పూర్తయిన తర్వాత తిరిగి శాసనసభ ఎన్నికలు జరుపుతామని కేంద్రం చెబుతున్నది. రెండు మాసాల క్రితం కాశ్మీర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిపారు. అపుడు భద్రతా సమస్యలు ఎదురుకాలేదు. ఇపుడు పార్లమెంటు ఎన్నికలు జరుపుతున్నారు. ఇపుడూ భద్రతా సమస్యలు ఎదురు కావటం లేదు. శాసనసభ ఎన్నికలు జరపటానికి మాత్రం భద్రతా సమస్యలు ఎదురవుతున్నాయి! ఎంత హాస్యా స్పదమైన వాదన! భద్రతా సమస్యలు ఎదురవు తాయనుకుంటే అక్కడ పార్లమెంటు ఎన్నికలను ఎలా జరుపుతున్నారు? నిజంగా భద్రతా సమస్యలు ఉన్నాయనుకుంటే దేశంలో ఏడు దశలలో జరుపుతున్న ఎన్నికలను మరో దశ పొడిగించి, భద్రతా దళాలన్నింటినీ కాశ్మీర్‌లో

మోహరించి ఎన్నికలు జరపవచ్చు. అసలు సమస్య ఆ రాష్ట్రంలో బిజెపి గెలిచే అవకాశం లేదు. అక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం ఏర్పడటం సంఘ్ పరివార్‌కు ఇష్టం లేదు. అందువల్లనే అక్కడ శాసనసభ ఎన్నికలను వాయిదా వేశారు. ఈ సంకుచిత ధోరణే కాశ్మీర్ ప్రజలను దేశానికి దూరం చేస్తున్నది.

**హిందూత్వ తీవ్రవాదులకు సంఘ్ ప్రోత్సాహం**

బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాపితంగా, ప్రత్యేకంగా జమ్మూలో మైనారిటీగా ఉన్న ముస్లింలపై హిందు తీవ్రవాద శక్తుల దాడులు పెరిగిపోయాయి. తమ హింసాత్మక కార్యకలాపాల ద్వారా ముస్లింలను భయభ్రాంతులను చేయటానికి, హిందువులను రెచ్చగొట్టటానికి పూనుకున్నారు. ఈ పరిస్థితులలో 2018 జనవరిలో ముస్లిం సంచార తెగలకు చెందిన ఎనిమిది సంవత్సరాల బాలిక అసిఫా బానోను సంఘ్ పరివార్ అనుయాయులు అపహరించి, సామూహిక మానభంగం చేసి, దారుణంగా హత్యచేయటం, హంతకులకు మద్దతుగా హిందూత్వ శక్తులు ప్రదర్శనలు చేయటం, కేంద్ర మంత్రులు, బిజెపి జాతీయ నాయకులు హంతకులను బలపరచటం, హత్యకు గురైన బాలిక తరపున వాదించటానికి పూనుకున్న న్యాయవాదులను బెదిరించటం తదితరాలు కాశ్మీర్‌లోయలో తీవ్రవాదశక్తులకు ఊతమిచ్చి, వేర్పాటువాద, జిహాదీల పెరుగుదలకు తోడ్పడ్డాయి. కాశ్మీరీయులపై జరుగుతున్న దాడుల విషయంలో ప్రభుత్వం నుండి స్పందన లేకపోవటం ప్రజల ఆగ్రహాన్ని పెంచింది.

రాష్ట్రానికున్న ప్రత్యేక ప్రతిపత్తిని హరించటం, ఆర్టికల్ 370, 35ఎ లను రద్దుచేయటానికి పూనుకోవటం, ఈ అంశంపై సుప్రీం కోర్టులో జరుగుతున్న విచారణలో ఈ ఆర్టికల్స్‌కు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం వాదించక పోవటాన్ని తమ హక్కులను హరించటంగా రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారు. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని వ్యతిరేకిస్తున్న సంఘ్ పరివార్ వాస్తవాలను వక్రీకరిస్తున్నది. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి ఉండటం వలననే వేర్పాటు వాదం పెరిగిపోతున్నదని ఉద్దేశ్యపూర్వకంగానే పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తూ, దేశ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు జమ్మూకాశ్మీర్ భారత్‌లో భాగంగా లేదు. అపుడు జమ్మూ కాశ్మీర్ పాలకుడుగా ఉన్న ఆర్ఎస్ఎస్ మద్దతుదారుడైన రాజు కాశ్మీర్‌ను స్వతంత్ర దేశంగా ఉంచాలని భావించగా, పాకిస్థాన్‌లో భాగంగా

**“ జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని వ్యతిరేకిస్తున్న సంఘ్ పరివార్ వాస్తవాలను వక్రీకరిస్తున్నది. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి ఉండటం వలననే వేర్పాటు వాదం పెరిగిపోతున్నదని ఉద్దేశ్యపూర్వకంగానే పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తూ, దేశ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు జమ్మూకాశ్మీర్ భారత్‌లో భాగంగా లేదు. ”**



జమ్మూలో హిందూ మతోన్మాదులు
హత్యచేసిన అసిఫా బానో

చేసుకోవాలని ఆ దేశం ప్రయత్నించింది. అందుకోసం దురాక్రమణకు పూనుకుంది. భారత సైన్యంతో కలిసి షేక్ అబ్దుల్లా నాయకత్వంలో దురాక్రమణదారులను తిప్పికొట్టిన కాశ్మీర్ ప్రజలు లౌకిక భారతదేశంలో చేరటానికి అంగీకరించారు. కాని మత ప్రాతిపదికన దేశం భారత్ పాకిస్థాన్‌లుగా చీలిపోయి ఉన్న పరిస్థితులలో హిందువులు మెజారిటీగా ఉన్న భారత్‌లో చేరటానికి కొన్ని రక్షణలను కోరారు. వారి కోరిక న్యాయమైనదేనని ఆనాటి ప్రభుత్వం, రాజ్యాంగ సభ అంగీకరించాయి. జమ్ము-కాశ్మీర్‌కు కొన్ని రక్షణలు కల్పించి వాటిని రాజ్యాంగంలో పొందుపరిచారు. వాటిలో ప్రధానమైనవిగా ఆర్టికల్ 370, 35ఎ ఉన్నాయి. వాటిని రద్దు చేయాలని సంఘ్ పరివార్, బిజెపి ప్రచారం చేస్తున్నాయి. వారి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందుకనుగుణంగా వ్యవహరిస్తున్నది. ఈ సంకుచిత దృక్పథం కాశ్మీర్‌లోని వేర్పాటు వాద శక్తులకు మరింత బలం కలిగిస్తున్నది. రాష్ట్రంలోని ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సాధారణ సమస్యలపై చేస్తున్న ఆందోళనలను కూడా సైన్యం నిరంకుశంగా అణిచివేయటం, పెల్లెట్లు ప్రయోగించటం, ఆందోళనకారులను చంపటం మార్పులను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరపటం వంటివి కేంద్ర ప్రభుత్వానికి, సైన్యానికి వ్యతిరేకంగా పోరాడటం మినహా మరోమార్గం లేదనే భావాన్ని కాశ్మీరీ యువతకు కలిగించాయి. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడితేనే ఆత్మ గౌరవంతో బత కగలమనే భావనలు యువతలో బలపడుతున్నాయి.

**తీవ్రవాదులకు మార్గం సుగమం చేస్తున్న ప్రభుత్వం**

ఇటువంటి పరిణామాలనేపథ్యంలో కాశ్మీర్‌లో మధ్యేవాదులుగా ఉండి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని భావిస్తున్న సంస్థలను, ప్రభుత్వ విధానాలతో విసిగిపోయి స్వతంత్ర కాశ్మీర్ కోసం ఆందోళన చేస్తున్న సంస్థలను ప్రభుత్వం అణచివేస్తున్నది. దాడి జరిగిన తర్వాత జమ్మూకాశ్మీర్‌లో పనిచేస్తున్న జమాత్ ఇ ఇస్లామీ సంస్థను కేంద్రం నిషేధించింది. ఈ సంస్థ ఎక్కువగా సామాజిక, మతపరమైన కార్యకలాపా లలో పాల్గొంటుంది. ఈ సంస్థ పాకిస్థాన్‌ను బలపరిచేది కాదు. అదేవిధంగా జమ్మూకాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్-జెకెఎల్ఎఫ్‌ను కూడా నిషేధిం చింది. జెకెఎల్ఎఫ్ కూడా పాకిస్థాన్‌ను బలపరిచే సంస్థ కాదు. కాశ్మీర్ స్వతంత్రంగా ఉండాలని కోరే సంస్థలు ఇవి. ఇటువంటి సంస్థలు కాశ్మీర్ హక్కులు, స్వయం ప్రతిపత్తిని గురించి ప్రచారం చేస్తుండటంతో యువత ఎక్కువ భాగం పాకిస్థాన్ అనుకూల తీవ్రవాదుల వైపు మొగ్గటం లేదు. ఇపుడు మధ్యస్థంగా ఉండే ఇటువంటి సంస్థలను నిషేధించటంతో కాశ్మీర్‌లోని అసంతృప్తి చెందిన ప్రజలకు, యువతకు పాక్ అనుకూల తీవ్రవాదులతో కలవటం మినహా గత్యంతరం లేని పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం సృష్టిస్తున్నది. పాకిస్థాన్

“దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనే జైషె ఇ మొహమ్మద్ లాంటి తీవ్రవాద సంస్థలు, కాశ్మీర్ ప్రజల సమస్యల కోసం వివిధ రూపాలలో ఆందోళనలు చేస్తున్న సంస్థలు, కడుపు మండి భద్రతా దళాలపై రాళ్ళు విసురుతున్న అసంతృప్తి చెందిన యువతఈ మూడూ మూడు విభిన్న తరహాలకు చెందినవి. కాని ప్రభుత్వం వీరి మధ్య ప్రభుత్వం ఎటువంటి వ్యత్యాసం చూయించటం లేదు.”



పుల్వామాలో ఆత్మాహుతి దాడికి పాల్పడిన అదిల్ అహ్మద్ దార్

మద్దతుతో పనిచేస్తున్న తీవ్రవాద సంస్థలు కూడా కోరుతున్నది ఇదే. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకుంటున్న శక్తులు కోరుకుంటున్న దే సంఘ్ పరివార్, వారి నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్నది. ఆహా! ఏమి దేశభక్తి!! దేశ విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తున్న శత్రువుల పనిని మరింత తేలిక చేసే విధానాలను సంఘ్ పరివార్ ''దేశభక్తులు'' అనుసరిస్తున్నారు! మధ్యే వాద సంస్థలు నిర్వీర్యమై పాక్ అనుకూల తీవ్ర వాద సంస్థలు పై చేయి సాధిస్తే వారితోనే పరిమితం కాకుండా ఐసిస్, తాలిబన్ లాంటి సంస్థలు కాశ్మీర్‌లోయలో తిష్ఠ వేయటానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది కాశ్మీర్‌తో పాటు దేశం మొత్తాన్ని ప్రమాదంలోకి నెడుతుంది. జమ్మూతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలలో సంఘ్ పరివార్ అనుబంధ సంస్థలు ముస్లింలపై దాడులు చేయటం, కొట్టి చంపటం ఉగ్రవాద సంస్థలు దేశవ్యాపితంగా విస్తరించటానికి అనుకూల పరిస్థితులను సృష్టిస్తాయి. ఒకవైపున ఇటువంటి సంస్థలు, రెండోవైపున సంఝౌతా కేసు, కల్బుర్గి, గౌరిలంకేశ్, గోవిందపన్సారే, నరేంద్ర దబోల్కర్‌లాంటి హేతువాద మేధావులను హత్యలు చేస్తున్న మతోన్మాద సంస్థలు, గుజరాత్ నరమేధంలో భాగస్వాములైన శక్తులు విస్తరించటంతో దేశం నిప్పుల కొలిమిగా మారుతుంది. పశ్చిమాసియా, ఆఫ్ఘనిస్థాన్ తదితర దేశాలలో తీవ్రవాద సంస్థలు ప్రబలిన తర్వాత ఆ సంస్థల మధ్య నిరంతరం సాయుధ ఘర్షణలు జరుగుతున్నాయి. వీటిని ఆసరా చేసుకొని అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు తమ స్వప్రయోజనాలను నెరవేర్చుకోవటం కోసం ఆయా గ్రూపులను ప్రోత్సహిన్నాయి. సంవత్సరాల తరబడి జరుగుతున్న దాడుల లో లక్షలాది మంది ప్రజలు బలికావటం, లక్షల మంది తమ స్వదేశాలను వదలి వలసలు పోవటం తదితర ప్రమాదాలు మనకూ ఎదురవుతాయి. అటువంటి పరిస్థితులు ఒకసారి నెలకొంటే వాటిని అదుపుచేయటం ఎవరి చేతుల్లోనూ ఉండదు.

దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనే జైషె ఇ మొహమ్మద్ లాంటి తీవ్రవాద సంస్థలు, కాశ్మీర్ ప్రజల సమస్యల కోసం వివిధ రూపాలలో ఆందోళనలు చేస్తున్న సంస్థలు, కడుపు మండి భద్రతా దళాలపై రాళ్ళు విసురుతున్న అసంతృప్తి చెందిన యువతఈ మూడూ మూడు విభిన్న తరహాలకు చెందినవి. కాని ప్రభుత్వం వీరి మధ్య ప్రభుత్వం ఎటువంటి వ్యత్యాసం చూయించటం లేదు. సైనికదళాలు విచక్షణారహితంగా జరుపుతున్న కాల్పులలో 2018లో 180 మంది పౌరులు చనిపోయారు. గత రెండున్నర సంవత్సరాల కాలంలో 1000 మందికి పెల్లెట్ గాయాలు కాగా, వారిలో 100 మందికి పైగా అంధులయారు. బిజెపికి ముందు కేంద్రంలో అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం కొద్ది మేరకు అనుసరించిన సానుకూల విధానాల వలన కాశ్మీర్‌లో గత దశాబ్దకాలంలో జైషే మొహమ్మద్ సంస్థ నిస్తేజంగా ఉంది. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తి, ఆగ్రహం ఆ సంస్థ తిరిగి పుంజుకోవటానికి దోహదం చేశాయి.

**అదిల్‌దార్ తీవ్రవాదిగా మారిన క్రమం**

పుల్వామా ఆత్మాహుతి దాడిలో పాల్గొన్న ఆదిల్ అహ్మద్‌దార్ 19 సంవత్సరాల విద్యార్థి. భారత క్రికెట్ జట్టుపై అభిమానం కలవాడు. భారత్‌పై అభిమానం చూయిస్తున్నందుకు కొందరు స్నేహితులు అతనిని ఎగతాళి చేస్తున్నా పట్టించుకొనేవాడు కాదు. 2016లో జరిగిన ఒక సంఘటనలో రాళ్ళు విసురుతున్నారనే పేరుతో సైన్యం దార్‌ను, అతని మిత్రులను కొట్టి, వేధింపులకు గురిచేసింది.

ఆ సంఘటన అనంతరం అతను తీవ్రవాదం వైపు మొగ్గాడు. సైన్యం చేతుల్లో అవమానాలకు గురవుతున్నానన్న భావన పెరగటం, ఎంతకూ పరిష్కారం కాని కాశ్మీర్ సమస్య అతనిని తీవ్రవాదంవైపు నెట్టాయి. మోడి నాయకత్వంలోని బిజెపి ప్రభు త్వం తీవ్రవాదంపై యుద్ధం ప్రకటించామని, జమ్మూకాశ్మీర్‌లో తీవ్రవాదాన్ని సమూలంగా నిర్మూలిస్తామని ప్రచారం చేస్తున్నది. కాని ఈకాలంలో ఆ రాష్ట్రంలో గతంలో ఏనాడూ లేని విధంగా టెర్రరిజం పెరిగింది. మోడి ప్రభు త్వ వైఫల్యాలే కాశ్మీర్‌లో తీవ్రవాదుల పెరగటా నికి కారణమని స్పష్టమౌతున్నది.

కాశ్మీర్ ప్రజలపై దాడులను తీవ్రం చేయటం, మత విభజనలను పెంచటం, దేశంలోని వివిధ ప్రాం తాలలో కాశ్మీరీయులపై దాడులు, ఆ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటం, కాశ్మీర్ ప్రజలను వేర్పాటువాదులకు సన్నిహితం చేస్తున్నాయి. ప్రభుత్వం కాశ్మీరీయులను అణచివేసే విధానాలను విడనాడేలా దేశప్రజలు ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలి. కాశ్మీర్ ప్రజలకు మద్దతుగా, వారి హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాపిత ఉద్యమం జరగాలి. భారత దేశ ప్రజలంతా తమకు అండగా ఉన్నారనే భావన కాశ్మీర్ ప్రజలలో కలిగిస్తేనే కాశ్మీర్‌ను రక్షించుకోవటం సాధ్యమౌతుంది. ❊

# ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి ప్రజల కర్తవ్యాలు

**సిపిఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆమోదించిన ఎన్నికల ప్రణాళికలోని కొన్ని భాగాలను మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం. – సంపాదకులు**

**2014** ఎన్నికల్లో గెలిచి కేంద్రంలో అధికారపీఠం ఎక్కిన బిజెపి, రాష్ట్రంలో తెలుగు దేశం హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయి.

తెలుగు ప్రజలకు బిజెపి, కాంగ్రెస్ తీవ్ర ద్రోహం చేశాయి. వాటితో కలిసి తెలుగు దేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తున్నాయి. ఈ మోసాలకూ, ప్రజావ్యతిరేక విధానాలకూ చరమగీతం పాడాలి. ప్రజానుకూల విధానాలతో ముందుకు వస్తున్న సిపిఐ(యం), సిపిఐ, జనసేన, బహుజన సమాజ్‌వాదీ పార్టీ (బిఎస్‌పి)లను గెలిపించాలి.

రాష్ట్ర విభజన అనంతరం కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తేనే విభజన హామీల అమలుతో పాటు నవ్యాంధ్ర ప్రదేశ్‌లో అభివృద్ధి సాధ్యమని నమ్మించి అధికారాన్ని చేపట్టాయి. ఈ నాలుగున్నరేళ్లలో ప్రజల ఆశలు ఫలించ లేదు. రాష్ట్రం కొత్తదైనా విధానాలు మాత్రం పాతవైనందునే మార్పు సాధ్యం కాలేదు. అందుకే నేడు రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం, ఉద్యోగ – ఉపాధి కోసం పోరాడే సిపిఐ, సిపిఐ(యం)లను వారు మద్దతునిస్తున్న జనసేన, బిఎస్‌పి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నది. నూతన శాసనసభలో వామపక్ష ప్రతినిధులుంటేనే ప్రజల హక్కులకు మద్దతు లభిస్తుంది.

గత నాలుగున్నరేళ్ల కాలంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం విభజన హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను దారుణంగా వంచించింది. ఈ వంచనా వ్యూహంలో తెలుగు దేశం ప్రభుత్వం కూడా భాగస్వామి అయ్యింది. ప్రత్యేక హోదాకు మోడీ ప్రభుత్వం ఎగనామం పెడితే చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని వెనకేసుకు వచ్చారు. ప్రత్యేక హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తుందని రాష్ట్ర ప్రజలను మభ్యపుచ్చారు. వామపక్షాలు, జనసేన, ఇతర ప్రజాతంత్ర శక్తులు విభజన హామీలు నెరవేర్చాలనీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి తీరాలనీ పోరాడుతుతుంటే లాఠీ ఛార్జీలు చేయించారు. జైళ్లలో పెట్టారు. విద్రోహి బిజెపీ, నయవంచక తెలుగుదేశం పార్టీలపై రాష్ట్ర ప్రజలు తీవ్ర అగ్రహంతో ఉన్నారు. దీన్ని గమనించిన తెలుగుదేశం రాత్రికి రాత్రి బోర్డు తిప్పి బిజెపీకి వ్యతిరేకంగా హోదా కోసం పోరాడుతున్నట్లు సరికొత్త నాటకం మొదలు పెట్టింది. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం తీవ్ర ద్రోహం చేస్తుంటే రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బిజెపితో స్నేహం చేస్తోంది. ఆ పార్టీ అభ్యర్థిని రాష్ట్ర పతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో నేరుగా బలపరిచింది. రాజ్యసభ డిప్యూటీ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో పరోక్షంగా సహకరించింది. అవిశ్వాస తీర్మానం ఇచ్చి చర్చకు వచ్చే సరికి పార్లమెంటు సభ్యత్వాలకు రాజీనామా చేసి చర్చనుండి నిష్క్రమించారు. బిజెపితో దోస్తీకి ఇబ్బంది లేకుండా జాగ్రత్త పడ్డారు. విద్రోహి బిజెపీపై ఒక్క విమర్శ చేయడం లేదు. పైగా వారిపై ఈడ వాలనీయడం లేదు. అందుకే రాష్ట్రాన్ని విభజించి, విభజన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు అన్యాయం చేసిన బిజెపి, కాంగ్రెస్, తెలుగు దేశం పార్టీలను, వాటి బాటలోనే పోతున్న వైఎస్ఆర్‌సిపిని ప్రజలు వ్యతిరేకించాలి. విభజన హామీల అమలు కోసం నికరంగా పోరాడుతున్న వామ పక్షాలు, జనసేన, బిఎస్‌పి లకు మద్దతివ్వడం ద్వారా మాత్రమే కేంద్రాన్ని దారికి తేగలం.

### మోడీ ముదనష్టపు పాలన

ఐదేండ్ల మోడీ పాలనలో వ్యవసాయ సంక్షోభం ముదిరి రైతాంగం దివాళా తీసింది. యువతకు ఉపాధి లేదు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని మభ్య పెట్టి ఆఖరికి తుస్సు మనిపించారు. ఉద్యోగాలడిగిన యువతను పకోడీలను అమ్ముకోమని ఎకసెక్కాలాడారు. కార్మిక వర్గ హక్కులపై తీవ్రదాడికి పాల్పడ్డారు. విదేశాల్లోని నల్లడబ్బును దేశానికి తీసుకువస్తానని గద్దెనెక్కిన మోడీ నల్లడబ్బు తేకపోగా విజయ్ మాల్యా, నీరవ్ మోడీ వంటి కార్పొరేట్‌లు బ్యాంకులకు వేలు కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోవడానికి సహకరించారు. నీతికి మారు పేరని గద్దెనెక్కి నాలుగేళ్లు కూడా తిరక్కుండానే వేల కోట్ల రాఫెల్ కుంభకోణంలో ఇరుక్కుపోయింది మోడీ ప్రభుత్వం. మోడీ పాలనలో ఉగ్రవాదం జడలు విప్పి నాట్యం చేస్తోంది. దేశ భద్రతను ఫణంగా పెట్టి కీలకమైన రక్షణ, ఫైనాన్స్ రంగాలను కూడా ప్రయివేటు పరం చేస్తున్నారు. నోట్ల రద్దు, జిఎస్‌టిల వల్ల అసంఘటిత రంగం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిని ప్రజల ఉపాధి హరించుకుపోయింది.

మోడీ అధికారంలోకి వచ్చాక దళితులు, మహిళలు, మైనారిటీలపైనా, దేశంలోని లౌకిక వ్యవస్థలపైనా దాడులు పెరిగాయి. ప్రజల అసంతృప్తిని దారిమళ్లించేందుకు మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రగిల్చారు. గోరక్షణ, లౌ జిహాద్ పేరుతో మైనారిటీలపైనా, దళితుల పైనా దాడులు జరిగాయి. రాష్ట్రపతి, గవర్నర్ల నుండి విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ల వరకు న్యాయ, రక్షణ రంగానుండి విద్యా, వైద్య వ్యవస్థల వరకు అన్నింటినీ ఆర్ఎస్ఎస్ వ్యక్తులతో నింపేస్తున్నది. ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులే సైన్సుపై దాడి చేశారు. హేతువాదులు, అభ్యుదయ వాదులను మతోన్మాద శక్తులు పట్టపగలు హత్యలు గావించారు. పలువురు బిజెపి ప్రజా ప్రతినిధులు అత్యాచారాల కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారు. దేశంలోని అన్ని ప్రజాస్వామిక వ్యవస్థలను మోడీ ప్రభుత్వం నాశనం చేస్తున్న క్రమం మన కళ్లముందు కనబడుతోంది.

మోడీ ప్రభుత్వం నిరంకుశంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై దాడులు చేస్తోంది. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ నిధుల ప్రవాహానికి ఎలక్టోరల్ బాండ్ల చట్టం చేసింది. జమిలి

**"బాబు అధికారం చేపట్టినప్పటినుండి రాష్ట్రంలోకి పెట్టుబడుల వరద వస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. పారిశ్రామిక వేత్తలతో భాగస్వామ్య సదస్సులు నిర్వహిస్తూ లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నట్లు పత్రికల్లో ప్రకటనలు ఇస్తున్నారు. పెట్టుబడులు రాలేదు. ఉద్యోగాలు ఇవ్వలేదు. వచ్చిన కొద్దిపాటి పరిశ్రమలు కూడా అత్యధిక కాలుష్య కారకాలైనవి వస్తున్నాయి. వాటివల్ల జనావాసాలు విషపూరితమై ప్రజల ఆరోగ్యాలు, పర్యావరణం దెబ్బ తింటున్నాయి."**

ఎన్నికల పేరుతో రాష్ట్రాల శాసన సభలను నిర్ణీత కాలంలో ఎన్నుకునే ప్రజల హక్కులను హరించ పూనుకుంటుంది. విశ్వ విద్యాలయాల్లో భిన్నాభిప్రాయాల నోరు నొక్కేస్తున్నది. విద్యార్థి సంఘాలను అణచివేయడానికి ప్రయత్నిస్తోంది.

మన స్వతంత్ర విదేశాంగ విధానానికి తూట్లు పొడిచి అమెరికా పెత్తనానికి తలవొగ్గు తోంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం భారత దేశాన్ని అమెరికా యుద్ధ వ్యూహంలో జూనియర్ భాగస్వామిగా మార్చే విధానాలు చేపట్టగా, ఎన్డీఏ ప్రభుత్వం మరింత ముందుకు వెళ్లి అమెరికా యుద్ధ నౌకలకు, విమానాలకు మన దేశంలో ఆశ్రయం కల్పించే ఒప్పందం చేసు కుంది. మన రక్షణ రంగంలోకి అమెరికా ఏజెంట్లు నేరుగా ప్రవేశిస్తున్నారు.

**తెలుగు దేశం ప్రజావ్యతిరేక పాలన**

తెలుగు దేశం, బిజెపి కూటమిని గెలిపిస్తే కేంద్రం నుండి రాష్ట్రానికి భారీగా నిధులు వస్తాయని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని గత ఎన్నికల్లో నమ్మించారు. లక్షల ఉద్యోగాలు వస్తా యని ప్రచారం చేశారు. నాలుగేళ్లపాటు రాష్ట్రం లోని తెలుగు దేశం ప్రభుత్వంలో బిజెపి భాగ స్వామిగా ఉంది. కానీ ఈ కాలంలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు లేవు, పరిశ్రమలు లేవు. రాష్ట్రాభివృద్ధి పేరుతో ముఖ్యమంత్రి విదేశీ పెట్టు బడుల కోసం ఆరాట పడుతుంటే మరోవైపు రాష్ట్రంలోని సంపదపరులంతా లాభాల కోసం వారి పెట్టుబడులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**ఉద్యోగం - ఉపాధి:-** బాబు వస్తే జాబు వస్తుందని ప్రజలను ఎన్నికల ముందు ఊరిం చారు. నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. కానీ బాబు అధికారంలోకి వచ్చాక కొత్త ఉద్యోగాలు రాకపోగా అనేక చిన్నా పెద్ద పరిశ్రమలు మూత పడి లక్షల మంది నిరుద్యోగులైనారు. ఫెర్రో ఎల్లాయిస్, జనపనార, చక్కెర వగైరా అనేక సంప్రదాయ పరిశ్రమలు మూతపడ్డాయి. బాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ డైరీ పుంజుకుంది కానీ సహకార రంగంలోని చిత్తూరు డైరీ మూత పడింది. ప్రకాశం డైరీ సంక్షోభంలో పడింది.

బాబు అధికారం చేపట్టినప్పటినుండి రాష్ట్రంలోకి పెట్టుబడుల వరద వస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. పారిశ్రామిక వేత్తలతో భాగస్వామ్య సదస్సులు నిర్వహిస్తూ లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నట్లు పత్రికల్లో ప్రకటనలు ఇస్తున్నారు. పెట్టుబడులు రాలేదు. ఉద్యోగాలు ఇవ్వలేదు. వచ్చిన కొద్దిపాటి పరిశ్రమలు కూడా అత్యధిక కాలుష్య కారకాలై నవి వస్తున్నాయి. వాటివల్ల జనావా సాలు విషపూరితమై ప్రజల ఆరోగ్యాలు, పర్యావరణం దెబ్బ తింటున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగాల్లో 2 లక్షలకు పైగా ఖాళీలున్నాయి. బ్యాక్ లాగ్ పోస్టులను నింప లేదు. చేస్తున్న నియామకాలను కూడా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతికి మార్చారు. కనీస వేతనం అమలు పరచడం లేదు. పని భద్రత ఉండడం లేదు. సమానపనికి సమాన వేతనం అనే సహజన్యాయాన్ని చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా ఉల్లంఘిస్తోంది. అంగన్ వాడీలు, ఆశాలు వంటి వారితో వెట్టి చాకిరీ చేయించుకుని నామమాత్రపు వేతనాలు ఇస్తున్నారు.

**రైతు వ్యతిరేక చర్యలు:-** కార్పొరేట్‌లకు పందేరం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం రైతుల భూములను, దళితుల అసైన్డ్ భూములను బలవంతంగా గుంజుకుంటోంది. దీనికోసం 2013 భూసేకరణ చట్టాన్ని సవరించింది. కార్పొరేట్ కంపెనీలకు లక్షల ఎకరాలు ఇచ్చేస్తున్న బాబు ప్రభుత్వం పేదల ఇళ్ళ స్థలాలకు మాత్రం ఒక్క ఎకరా కూడా కేటాయించడం లేదు. కరువు ప్రాంతాలకు, వెనుకబడ్డ ప్రాంతాలకు సాగునీరు, త్రాగునీరు అందించే సమగ్ర విధానమూ లేదు. రాష్ట్రంలో నికర సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. వ్యవసాయపంటల ధరలు పడిపోతున్నాయి. రుణ భారం పెరిగి రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. కూలీలు, వృత్తిదారులు ఉపాధిలేక వలసబాట పట్టారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు.

**ఆదివాసీలకు అన్యాయం :-** బాక్సైట్ త్రవ్వకాలకు జి.వో.97 ఇచ్చి చంద్రబాబు ఆదివాసీలను మరోసారి మోసం చేశారు. విద్య, వైద్యం రెండింటినీ నిర్వీర్యం చేసి ఆదివాసీల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారు. అటవీ హక్కుల చట్టం అమలు చేయడం లేదు. పోల వరం ప్రాజెక్టు నిర్వాసిత ఆదివాసీలకు ద్రోహం చేస్తున్నారు. చట్టబద్ధమైన ట్రైబల్ అడ్వయిజరీ కమిటీని నియమించలేదు. మూడేళ్ళపాటు ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులను తన ఇష్టమొచ్చినట్లు దారి మళ్ళిస్తున్నారు. ఏజెన్సీ ఆసుపత్రుల్లో మందులు, డాక్టర్లు, సిబ్బంది కరువు.

**దళితులపై దాడులు పెరిగాయి:-** ఈ కాలంలో ఆధిపత్య కుల దురహంకారం పెరి గింది. దళిత, ఆదివాసీ, మహిళలపై పెరిగిన దాడులు, బలహీనవర్గాలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. మహిళలపై అత్యాచారాల్లో రాష్ట్రం దేశంలోనే ముందంజకు చేరుకుంది. మహిళా సాధికారత మాటలకే పరిమితం అయింది. మద్యం ఏరులై పారుతోంది. పేదల కొంపలు కొల్లేరు అవుతున్నా ఖజానా నింపుకోడానికే ప్రభుత్వం తాపత్రయ పడుతోంది.

**వెనుకబడిన ప్రాంతాలపై నిర్లక్ష్యం:-** ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ నగరం చుట్టూ అభివృద్ధి కేంద్రీకరించబడింది. పరిశ్రమలు, ఆధునిక ప్రాజెక్టులన్నింటినీ ఒకేచోట కేంద్రీకరించినందున రాష్ట్రం తీవ్ర అసమానత లకు లోనయింది. వెనుకబడిన ప్రాంతాలు, వర్గాలు, తరగతులు నిర్లక్ష్యానికి గురయ్యాయి.

ఆ అనుభవం తరువాత కూడా చంద్రబాబు ప్రభుత్వం గుణపాఠాలు నేర్వలేదు. ఈ నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలోని వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలపట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించింది. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వల్ల ఇప్పటికీ పెండింగులో ఉన్న ప్రాజెక్టులలో ఒక్కటి కూడా పూర్తి కాలేదు. అనంతపురంలో కరువు విలయతాండవం చేస్తున్నది.

వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు ఈ కాలంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. జంఝావతి ప్రోజెక్టు 40 ఏళ్ళు దాటినా పూర్తి కాలేదు. 2003లో ప్రారంభమైన తోటపల్లి, తారకరామా, వంశధార, ఫేజ్-2, ఆఫ్-షోర్ ప్రాజెక్టులు నేటికీ పూర్తికాలేదు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 8 లక్షల

ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి త్రాగునీరిచ్చే ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి 2009లో శంకుస్థాపన చేసినా ఇంత వరకు ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదు.

2016 నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, రామాయపట్నం పోర్టు, దొనకొండ పారిశ్రామిక కారిడార్ వంటి హామీలు గాలిలో కలిసిపోయాయి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి వెలుగొండ ప్రాజెక్టులో 11.5 కి.మీటర్ల టన్నెల్ త్రవ్వగా, ఈ నాలుగేళ్ళలో 2.5 కి.మీ.కూడా పూర్తి చేయకపోవడం నిర్లక్ష్యానికి పరాకాష్ట. జిల్లాలో పెండింగ్‌లోవున్న 6 నీటిప్రాజెక్టులలో ఒక్కటి కూడా పూర్తికాలేదు.

**విద్య, వైద్యం:–** విద్యా, వైద్యంలో మానవాభివృద్ధి సూచికలలో రాష్ట్రం చాలా వెనకబడింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలం దరికీ విద్య, వైద్యం అందే విధానాలు చేపట్టా ల్సిన ప్రభుత్వం దానికి భిన్నంగా కార్పొరేట్ల లాభాలకు దాసోహమైంది. సామాన్యులపై భారాల్ని పెంచుతోంది. రేషనలైజేషన్ పేరుతో వేలాది పాఠశాలలు మూసేసింది. ఉన్నత విద్య బాధ్యతల నుండి ప్రభుత్వం తప్పుకున్నది. ప్రభుత్వ వైద్యశాలల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పేదలకు ఆరోగ్య భద్రత లేకుండా పోయింది.

**అవినీతి:–** అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం అవినీతిలో నిండా కూరుకుపోయాయి. ప్రభుత్వంలో ఏ పని కావాలన్నా లంచాలు లేనిదే జరగడం లేదు. ఇసుక, మైనింగు, నీరు, భూమి, అడవులు లాంటి ప్రకృతి వనరులను అక్రమ మార్గాల్లో కొల్లగొట్టుతున్నారు. ప్రతిపక్ష ఎంఎల్ఎలను డబ్బు, అధికార పదవుల ఎరచూపి కొనుగోలు చేసే దుష్ట సంస్కృతిని తెలుగు దేశం ప్రభుత్వం మరింతగా పెంచి పోషించింది. జన్మభూమి కమిటీలు అవినీతికి ఆలవాలంగా మారాయి.

**నిరంకుశ పోకడలు:–** ప్రజా ఉద్యమాలను చంద్రబాబు ప్రభుత్వం అణచివేస్తున్నది. ప్రతిపక్ష పార్టీల పట్ల, ఉద్యమాల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోంది. 144 సెక్షన్, పోలీసు యాక్ట్ 30ని నిరంతరం ప్రయోగిస్తున్నది. ముందస్తు అరెస్టులు, అక్రమ కేసులు, గృహ నిర్భంధాలు మితిమీరాయి. జన్మభూమి కమిటీల పేరుతో గ్రామాల్లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులను పక్కనబెట్ట తెలుగు దేశం నాయకులు పెత్తనం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరపకుండా వాయిదా వేసింది.

**స్థానిక సంస్థలు:–** స్థానిక సంస్థలకు 73వ రాజ్యాంగ సవరణకు విరుద్ధంగా పంచాయితీలను ప్రత్యేక అధికారులతో నడుపుతున్నారు. ఎన్నికలు నిర్వహించకుండా వాయిదా వేశారు. ఎంఎల్ఎలు, జన్మభూమి కమిటీల పెత్తన్నాన్ని వాటిపై రుద్దుతోంది.

**"అన్ని రంగాల్లో విఫలమైన చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ప్రజలను మభ్య పుచ్చేందుకు అనేక ఫీట్లు చేస్తున్నది. పెన్షన్లు పెంపుదల, అన్నదాతా సుఖీభవ, నిరుద్యోగ భృతి, అన్న క్యాంటీన్లు, ఇళ్ల నిర్మాణం, బలహీనవర్గాలకు రుణాలు అంటూ మరోసారి మోసం చేయడానికి సిద్ధపడుతున్నారు. భవన నిర్మాణ కార్మికుల రక్షణ నిధినుండి వందల కోట్ల రూపాయలు చంద్రన్న భీమా ప్రచారం కోసం ప్రభుత్వం ఉపయోగించుకుంటున్నది."**

### ఎన్నికల ముందు ఫీట్లు

అన్ని రంగాల్లో విఫలమైన చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ప్రజలను మభ్య పుచ్చేందుకు అనేక ఫీట్లు చేస్తున్నది. పెన్షన్లు పెంపుదల, అన్నదాతా సుఖీభవ, నిరుద్యోగ భృతి, అన్న క్యాంటీన్లు, ఇళ్ల నిర్మాణం, బలహీనవర్గాలకు రుణాలు అంటూ మరోసారి మోసం చేయడానికి సిద్ధపడుతున్నారు. భవన నిర్మాణ కార్మికుల రక్షణ నిధినుండి వందల కోట్ల రూపాయలు చంద్రన్న భీమా ప్రచారం కోసం ప్రభుత్వం ఉపయోగించుకుంటున్నది. విద్యార్థుల నుండి వసూలు చేస్తున్న ఫీజులతో యూనివర్శిటీలలో రాజకీయ ప్రచారం చేసుకుంటున్నది. రాజధాని, పోలవరం నిర్మాణాలపై ఆర్భాటం చేస్తున్నారు. ఇంతకాలం అణచివేసిన అంగన్‌వాడీ, ఆశా, విఆర్ఏలకు జీతాలు పెంచి సన్మానాలు చేయించుకుంటున్నారు. రాయలసీమను రాజధానితో కలిపే రహదారులు, పోర్టులు, విమానాశ్రయాలు, మెట్రోలు అన్నీ కాగితాలమీదనే ఉన్నాయి. అయినా తాను ఏదో చేస్తున్నట్లు కోట్ల రూపాయలతో పెద్ద ఎత్తున ప్రచారార్భాటం నిర్వహిస్తున్నారు. ఈ నాలుగేళ్ళలో ఒక్క అభివృద్ధి కార్యక్రమమూ జరగలేదు. ఉద్యోగాలు అంతకన్నా లేవు.

### విఫలమైన వైసీపి

పాలకపక్షం విధానాలను ఎదిరించి ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సిపి రాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపిని బలపర్చడానికి పోటీపడింది. బిజేపీ, దాని మూల విరాట్టు ఆర్‌యస్‌యస్ దాని అనుబంధ సంఘాలు నిత్యం దళితులపై, ఆదివాసీలపై, మైనారిటీలపై ఉన్మాదపూరితంగా దాడులు చేస్తున్నా స్పందించడం లేదు. 2013 భూసేకరణ చట్టానికి, కార్మికుల చట్టాలకు చేసిన సవరణలను అడ్డుకోలేదు. భూములు కోల్పోయిన రైతులు, దళితుల, ఆదివాసీల రక్షణకు ముందుకు రావడం లేదు. మహిళల హక్కుల విషయంలో కూడా ఇదే వైఖరి. అసెంబ్లీని బహిష్కరించడం ద్వారా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో ఘోరంగా విఫలమైంది. నవరత్నాల పేరుతో విద్యా, వైద్యంలో ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించడానికే పూనుకుంటున్నది. మౌలిక విధానాలలో వైఎస్సార్‌సిపికి, టిడిపికి తేడా లేదు. ప్రధాన ప్రతిపక్షంగా సంపూర్ణంగా విఫలమైన వైయస్సార్ కాంగ్రెసు పార్టీకి ఓట్లేయడమంటే రాష్ట్రాన్ని కేంద్రానికి తాకట్టు పెట్టడమే. రాష్ట్రం అరాచకం పాలవుతుంది. అవినీతికి అడ్డాగా మారుతుంది. ఈ పార్టీని పూర్తిగా తిరస్కరించాలి.

### అసెంబ్లీలో వామపక్షాలుంటేనే ప్రజలకు అండ

అందుకనే ప్రజలకు అండగా నిలిచి, అభ్యుదయ, ప్రజానుకూల, లౌకిక విధానాలతో ప్రజలకు ఊరట కలిగించగలిగే శక్తులు బలపడాలి. వికేంద్రీకరణ విధానాలు కావాలి. అసెంబ్లీలో ప్రాతినిధ్యం లేకున్నా నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పోరాడుతూ అనేక హక్కుల్ని సాధించేందుకు కారణం వామపక్షాలే. వామపక్ష ఉద్యమాలే లేకుంటే ఈ రోజు పేదలు, కష్టజీవులు, రైతులు, కార్మికు లు, మహిళలు, దళితులు, గిరిజనుల పరిస్థితి ఇంకా దారుణాతి దారుణంగా ఉండేది. ఈ పార్టీలు అసెంబ్లీలో ఉంటే ఇంకా సమర్ధవంతం గా ప్రజల కోసం పోరాడుతాయి. వైయస్సార్ కాంగ్రెసు లాగా బాధ్యతల నుండి పారిపోవు. అధికారపార్టీలాగా అవినీతికి పాల్పడవు. నీతికి. నిజాయితీకి, నిస్వార్ధసేవకు మారుపేరుగా నిలబడతాయి.

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రగతిశీల ప్రత్యామ్నాయానికి ఓట్లు వేయడం ద్వారా మన నియోజక వర్గం అభివృద్ధికి నడుం బిగిద్దాం. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ పాలనలో మార్పుకు నాంది పలుకుదాం. మన నియోజక వర్గ అభివృద్ధికి సమగ్రమైన, ప్రజానుకూలమైన ప్రణాళికతో ముందుకొస్తున్న సిపిఐ(యం), సిపిఐ, జనసేన, బిఎస్‌పిలకు ఓట్లేసి గెలిపిద్దాం. ❋

**విశ్లేషణ**

# బిజెపిని ఓడించాలి

**జె జగదీష్**



రచయిత
ప్రజాశక్తి, న్యూఢిల్లీ ప్రతినిధి

కేంద్ర ఎన్నికల సంఘం 17వ లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను మార్చి 10న విడుదల చేసింది. ఏడు దశల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తొలి దశ పోలింగ్ ఏప్రిల్ 11న జరగనున్నది. మే 19న చివరి దశ(ఏడో) పోలింగ్ జరుగుతుంది. 2014లో తొమ్మిది దశల్లో ఎన్నికలు జరిగాయి. ఈసారి రెండు దశలు తగ్గించి, ఏడు దశల్లో ఎన్నికల నిర్వహణకు ఈసి షెడ్యూల్ విడుదల చేసింది. కాని కొన్ని రాష్ట్రాల్లో పోలింగ్ దశలు పెంచింది. సమస్యాత్మకం కానీ రాష్ట్రాల్లో సైతం పోలింగ్ దశలు పెంచటంతో బిజెపికి అనుకూలంగా ఈసి వ్యవహరించిందని ఆరోపణలు వెల్లువెత్తా యి. గత ఎన్నికల షెడ్యూల్‌ను ఈసి మార్చి 5న విడుదల చేసింది. కానీ ఈసారి షెడ్యూల్ విడుదలలో కాస్త జాప్యం చేసింది. ప్రధాని మోడీ ప్రచారం, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, పర్యటనలు వంటి కార్యక్రమాలు ముగిసిన తరువాత షెడ్యూల్ విడుదల చేసిందని విమర్శలు వస్తున్నాయి. ఈ ఐదేళ్లలో ఇలా జరగడం ఇది తొలిసారి కాదు. గతంలో రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలలో కూడా ఇలానే జరిగింది. ఉదయం 11 గంటలకు షెడ్యూల్ విడుదల చేస్తామని ఈసి మీడియాకు ఆహ్వానం పంపింది. కానీ అదే సమయంలో రాజస్థాన్‌లో ప్రధాని మోడీ సభలో పాల్గొనడంతో, అది కాస్తా మధ్యాహ్నం మూడు గంటలకు వాయిదా వేసింది. ఒకవేళ ఉదయం షెడ్యూల్ విడుదల చేస్తే, మోడీ సభ ఎన్నికల కోడ్ కిందకు వస్తుంది. ఆ సభ ఎన్నికల కోడ్‌కు లోబడి నిర్వహించాలి. అప్పటికే అక్కడ బిజెపికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ఎన్నికల్లో ఏదో విధంగా గట్టెక్కేందుకు మోడీ పరివారం తీవ్ర ప్రయత్నాలు చేసింది. అందులో భాగంగానే సభలో ప్రజలకు వరాల జల్లు కురిపించేందుకు బిజెపి నిర్ణయిం చింది. కనుక ఎన్నికల కోడ్ అడ్డు రాకుండా, ఏకంగా షెడ్యూల్ విడుదలనే వాయిదా వేయించారు. అయితే ఆ ఎన్నికల్లో బిజెపి ఎన్ని చేసినా, చివరికి ఓటమి చెందింది. ఇలా గడిచిన ఐదేళ్లలో ఈసిపై విమర్శలు పెరిగాయి. ఇలాంటి వాస్తవాలు చూస్తుంటే కేంద్ర ఎన్నికల సంఘం విశ్వసనీయత జవాబుదారీ తనం కోల్పోయిందని పిస్తుంది.

### హిందుత్వ దాడి

దేశంలో గత ఐదేళ్ల బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్ పాలనలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. నోట్ల రద్దు, జీఎస్టీ, ఎన్ఆర్సీ, రాజ్యాంగ సంస్థలపై దాడి, విద్యా వ్యవస్థలో హిందుత్వను చొప్పించడం, విశ్వ విద్యాలయాలపైన, మానవ హక్కులపైన, న్యాయ వ్యవస్థపైన, దళిత, మైనార్టీలపై దాడి, దేశంలో పెరిగిన రైతు ఆత్మహత్యలు, నిరుద్యోగం వంటి అంశాలు ఈ కాలంలో చోటు చేసుకున్నాయి. 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే మోడీ సర్కార్ తొలుత విద్యా వ్యవస్థపై దాడి ప్రారంభిం చింది. విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ఒక పథకం ప్రకారం నాలుగు రకాల దాడులకు పూనుకుంది. 1. హిందుత్వ భావాలను రెచ్చ గొట్టే వారిని విద్యా రంగానికి సంబంధించిన కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ(ఎంహెచ్ ఆర్డీ) మంత్రులుగా ఎంపిక చేయడం. 2. పాఠ్యాంశాల్లో హిందుత్వ భావాలు చొప్పిం చడం. లౌకిక పునాదులపై నడిచే శాస్త్రీయ విద్యా విధానాన్ని ధ్వంసం చేయడం. 3. ఐసిహెచ్ఆర్, యుజిసి వంటి వ్యవస్థలతో పాటు అనేక విద్యా సంస్థల అధిపతులుగా ఆరెస్సెస్, హిందుత్వ భావాలు పుణికిపుచ్చుకున్న వ్యక్తులను నియమించింది. 4. విశ్వ విద్యాలయాలపై దాడి చేస్తూ అక్కడి భావ ప్రకటన స్వేచ్ఛను హరి చేందుకు కుట్ర పన్నింది. అందులో భాగంగానే యూనివర్శిటీ వైస్ చాన్సలర్లుగా ఆర్ఎస్ఎస్ అనుయాయులను నియమించింది. వారంతా అక్కడ హిందుత్వ భావజాలాన్ని వ్యాప్తి చేయటానికి కృషి చేస్తున్నారు. ప్రగతిశీల, లౌకిక, అభ్యుదయ భావాలపై కత్తికట్టారు. ఐదేళ్ల కాలంలో ఈ నాలుగు రకాల దాడులు మనకు స్పష్టంగా కనబడ్డాయి. అంతటితో ఆగకుండా వివిధ రాష్ట్రాల గవర్నర్లుగా ఆరెస్సెస్‌కు చెందిన వ్యక్తులను నియమించింది. వారు రాజ్యాంగ బద్ధ మైన పదవుల్లో ఉండి, రాజ్యాంగ స్ఫూర్తికి విఘా తం కలిగించే వ్యాఖ్యలు చేస్తున్నారు. గవర్నర్ల వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారు. విద్వేషాన్ని రెచ్చగొట్టేందుకు వారి వ్యాఖ్యలు దోహదం చేస్తున్నాయి. ప్రజలు స్వేచ్ఛగా తమ భావాలను వ్యక్తం చేసే వాతావరణం కొరవడింది. హింసా యుతంగా వ్యవహరిస్తూ, ఉద్దేశ్యపూర్వకంగా ఒక తరగతి ప్రజానీకాన్ని రెచ్చగొట్టటానికి ప్రయ త్నాలు చేస్తున్నారు. హేతువాదులైన గోవింద పన్సారే, ప్రొఫెసర్ ఎంఎం కల్బుర్గి, నరేంద్ర దబోల్కర్, గౌరి లంకేష్ వంటి వారి వరుస హత్యలు దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టించాయి. అంతేకాకుండా ఆవులను చంపుతు న్నారని, గొడ్డుమాంసం తింటున్నారనే పేరుతో దాడులు చేసి, అమాయకులైన మైనార్టీలు, దళితులను పొట్టనపెట్టుకుంటున్నారు. దేశంలో అసహన వాతావరణం, వివిధ తరగతుల ప్రజలు, మహిళలు, మైనారిటీలలో అభద్రతా భావం పెరుగుతున్నాయి. దేశంలో వ్యక్తిగత స్వేచ్ఛపై ఆంక్షలు, మోరల్ పోలింగ్ పేరుతో దాడులు పెరిగాయి. వీటికి వ్యతిరేకంగా ఆందోళనలు కూడా పెరుగుతున్నాయి. అయితే ప్రభుత్వం, సంఘ్ పరివార్ అనుయాయులు ఆందోళనలు చేస్తున్న వారిని జాతి వ్యతిరేకులుగా చిత్రిస్తున్నారు. దేశంలో పెరుగుతున్న విద్వేష వాతావరణంతో మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ పోరాటరంగంలోకి వస్తున్నారు. వారిపైన కూడా దేశ వ్యతిరేకులనే ముద్ర వేస్తున్నారు. తరువాత మోడీ సర్కార్ ప్రజా ఉద్యమాలలో పనిచేస్తున్న కార్యకర్తలపై దాడులు ప్రారంభించింది. ప్రధానిని హత్య చేసేందుకు కుట్ర పన్నారనే నెపంతో మేధావు లను, ప్రజా ఉద్యమాలకు మద్దతిస్తున్న వారిని,

మానవ హక్కుల నేతలను అరెస్టు చేశారు. హిందూత్వ భావజాలాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, ముస్లింలను విదేశీయులుగా చిత్రీకరిస్తూ రెచ్చగొడుతున్నారు. పాకిస్తాన్‌లో అల్ప సంఖ్యాకులైన హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడిన సమాచార, సాంస్కృతిక శాఖ మంత్రి ఫయాజుల్ హసన్‌ను మంత్రి పదవి నుంచి తొలగించారు. మనదేశంలో అల్ప సంఖ్యాకులైన ముస్లిం, క్రైస్తవులపై దాడులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు చేస్తూ రెచ్చగొడుతున్న వారిని ప్రధాని మోడీ అందలం ఎక్కిస్తున్నారు. ఇటువంటి వారిని ముఖ్య మంత్రులు, కేంద్ర మంత్రులుగా ప్రభుత్వం, పార్టీలో పదోన్నతులు కల్పిస్తున్నారు.

"మరోవైపు రాజ్యాంగ, స్వతంత్ర సంస్థలపైన దాడి పెరుగుతున్నది. దాంతో సిబిఐ, సివిసి, ఈడి, ఐటి, కాగ్ వంటి సంస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. రాజ్యాంగ విలువలు కాపాడటంలో వాటి పాత్ర శూన్యమైంది. అధికారపార్టీకి తొత్తులుగా మారి, ప్రతిపక్షాలపై విరుచు కుపడుతున్నాయి. తప్పు చేసే వారిపై తప్పని సరిగా చర్యలు తీసుకోవాల్సిందే. కానీ కేవలం ప్రతిపక్షాలను మాత్రమే టార్గెట్ చేసి, ఆయా సంస్థలను రాజకీయాలకు వాడుకోవడం హర్షించ దగినది కాదు."

### రాజ్యాంగ వ్యవస్థలపై దాడి

మరోవైపు రాజ్యాంగ, స్వతంత్ర సంస్థలపైన దాడి పెరుగుతున్నది. దాంతో సిబిఐ, సివిసి, ఈడి, ఐటి, కాగ్ వంటి సంస్థలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. రాజ్యాంగ విలువలు కాపాడటంలో వాటి పాత్ర శూన్యమైంది. అధికార పార్టీకి తొత్తులుగా మారి, ప్రతిపక్షాలపై విరుచుకుపడుతున్నాయి. తప్పు చేసే వారిపై తప్పని సరిగా చర్యలు తీసుకోవాల్సిందే. కానీ కేవలం ప్రతిపక్షాలను మాత్రమే టార్గెట్ చేసి, ఆయా సంస్థలను రాజకీయాలకు వాడుకోవడం హర్షించ దగినది కాదు. ఆయా సంస్థలను కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం ప్రజా స్వామ్య వ్యతిరేకం. విచారణను ఎదుర్కొంటున్న ప్రతిపక్ష పార్టీల నేతలు బిజెపిలో చేరితే వారిపై దర్యాప్తు మూలన పడుతున్నది. ప్రతిపక్షంలోనే ఉంటే దాడులు, విచారణ కొనసాగుతున్నాయి. ఇది రాజ్యాంగబద్ధంగా ఏర్పాటై స్వతంత్రంగా పనిచేస్తున్న సంస్థలపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేస్తున్నది. మోడీ సర్కార్ హయంలో ఈ సంస్థలు సర్వ నాశనమయ్యాయి. వాటి స్వతంత్రతను కోల్పోయాయి. ఇక న్యాయ వ్యవస్థ విషయానికొస్తే స్వాతంత్ర్య భారతంలో తొలిసారి నలుగురు న్యాయమూర్తులు న్యాయ వ్యవస్థ పనితీరును బహిరంగంగా ప్రశ్నించారు. జస్టిస్ లోయా హత్యకేసులో న్యాయవ్యవస్థ వ్యవహరించిన తీరు ప్రశ్నార్థకంగా మారింది. అంతేకాకుండా కొలీజియంపై ప్రభుత్వ పెత్తనం పెరిగింది. న్యాయమూర్తులగా కొలీజియం ప్రతిపాదించిన వ్యక్తులను ప్రభుత్వం తిరస్కరించడం, మళ్లీ కొలీజియం ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమోదించడం వంటి పరిణామాలు న్యాయవ్యవస్థకు పొంచి ఉన్న ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. అంతేకాదు సర్వోన్నత న్యాయ స్థానాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టించే విధంగా అఫిడవిట్లు దాఖలు చేయడం, పొరపాటు జరిగిందని తర్వాత చెప్పటం న్యాయ వ్యవస్థకు సవాల్‌గా మారింది. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాపై మోడీ సర్కార్ దాడి పెరిగింది. జర్నలిస్టులపై దాడులు, హత్యలు పెరిగాయి. మీడియా సంస్థలపై దాడి, బ్లాక్ మెయిలింగ్ చేయడంలో మోడీకి మరెవ్వరూ సాటిరారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. చర్చల్లేకుండానే బిల్లులను ఆమోదించు కుంటున్నారు. ఆర్థిక బిల్లు లాంటి ముఖ్యమైన బిల్లులపై కూడా చర్చ జరగటం లేదు. తమకు ఇష్టం వచ్చినట్లు పార్లమెంట్‌ను నడిపారు. పార్లమెంటరీ సాంప్రదాయాన్ని తుంగలో తొక్కి, ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా చేశారు.



పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

### రాష్ట్రాలపై పెత్తనం

మోడీ హయంలో రాష్ట్రాలపై పెత్తనం పెరిగింది. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఆయన పాలన సాగింది. ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్ వంటి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అప్రజాస్వామికంగా పడగొట్టారు. సుప్రీం కోర్టు చీవాట్లు పెట్టడంతో వెనక్కి తగ్గాల్సి వచ్చింది. తమిళనాడులో జయలలిత మరణం తరువాత రాజకీయం చేసి, శశికళను జైలుకు పంపించి, ఆపార్టీని లోబర్చుకున్నారు. ఇలా బిజెపి యేతర రాష్ట్రాల్లో రాజకీయ అనిశ్చితి సృష్టించేందుకు కుట్ర పన్నారు. కేరళలో రాజకీయ హత్యలు, శబరిమల అంశాలను తీసుకొని రచ్చ రచ్చ చేశారు. భయోత్పాతాన్ని సృష్టించారు. కర్ణాటకలో అవినీతి, హత్యా రాజకీయాలతో ఆందోళనకర పరిస్థితులు సృషించారు. నోట్ల రద్దు, జీఎస్టీ, ఎన్ఆర్సీ వంటి ప్రభుత్వ ఏకపక్ష నియంతృత్వ విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నోట్ల రద్దుతో వ్యవసాయ రంగం కుదేలైపోయింది. చిన్న చిన్న వ్యాపారులు తీవ్ర నష్టాల పాల య్యారు. మోడీ పాలనలో ఉద్యోగాలు రాకపోగా నోట్ల రద్దుతో ఉన్న ఉద్యోగాలు ఊడాయి. జీఎస్టీ వంటి చర్యలు దేశానికి రెండో స్వాతంత్ర్యంగా ప్రభుత్వం ప్రచారం చేసింది. అర్థరాత్రి పార్ల మెంట్ తలుపులు తెరిచి, ఆర్భాటం చేశారు. తీరా జీఎస్టీ వల్ల తీవ్ర నష్టం జరిగిందని స్పష్ట మైంది. దేశంలోకి అక్రమ చొరబాట్లు నియంత్రించేందుకు ఎన్ఆర్సీ తీసుకొస్తున్నామని ప్రచారం చేస్తూ బిజెపి మత విభజనలకు పాల్పడింది. సిటిజన్ షిప్ బిల్లు పేరుతో ఈశాన్యంలో అగ్గిరాజేసింది.

### ప్రజలకిచ్చిన హామీల అమలు శూన్యం

ఈ ఐదేళ్ల పాటు అచ్చేదిన్, సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్, క్లీన్ ఇండియా(స్వచ్ఛ భారత్) మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా, టీం ఇండియా, బేటీ పడావో..బేటీ బచావో వంటి నినాదాలతో మోడీ సర్కార్ ప్రజల్ని మోసం చేసింది. నినాదాలు వినసొంపుగా ఉన్నాయి. కానీ అమలు మాత్రం శూన్యం. వాటి పేరుతో వేల కోట్లు ప్రచారానికి వాడుకున్నారు. బిజెపి

“ దేశంలో మోడీ హయంలో రైతాంగ ఆత్మహత్యలు, నిరుద్యోగం పెరిగింది. ఉపాధి కల్పన సవాల్‌గా మారింది. రైతులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. బిజెపి పాలిత మహారాష్ట్రలో నాసిక్ నుంచి ముంబాయి వరకు రైతులు చేపట్టిన చారిత్రాత్మక లాంగ్‌మార్చ్ దేశం మొత్తాన్ని ఆకర్షించింది. ఒక్కసారిగా రైతాంగ సమస్యలు చర్చకు వచ్చాయి. రాజస్థాన్‌లో నెలల తరబడి రైతాంగ పోరాటాలు సాగా యి.”

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించింది. బిజెపి మ్యానిఫెస్టోలో 80 శాతం అంశాలు అమలు కాలేదు. దేశంలో యువతకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని దేశానికి తెప్పించి, ప్రతి కుటుంబ బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షల వేస్తామని, స్వామినాధన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి, రైతాంగానికి మద్దతు ధరలు నిర్ణయించి, అమలు చేస్తామని ప్రకటించాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదిస్తామని హామీ ఇచ్చారు. ఇలాంటి హామీలతో ప్రజల ఓట్లను కొల్లగొట్టారు. కానీ ఈ ఐదేళ్లలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదు. అంతేకాదు అవినీతిపై యుద్ధం చేస్తామని గొప్పలు చెప్పారు. కానీ ఈ ఐదేళ్ల కాలంలో అలాంటి చర్యలు తీసుకోకపోగా బ్యాంకులను లూటీ చేసి విదేశా లకు పారిపోయిన వారికి మాత్రం అండగా నిలిచారు. ఉగ్రవాదాన్ని అంతం చేస్తామని ప్రకటనలు చేశారు. కానీ మోడీ కాలంలోనే ఉగ్రవాద దాడులు మరిన్ని పెరిగాయి. ఈ ఐదేళ్ల కాలంలో 626 ఉగ్రవాద దాడులు జరిగాయి. గత పదేళ్ల కంటే, ఈ ఐదేళ్లలోనే ఎక్కువ మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. 483 మంది సైనికులు అమరులైయ్యారు. 210 మంది జమ్మూకాశ్మీర్ ప్రజలు చనిపోయారు. ఉగ్రవాదులతో నిరంతరం తలపడుతున్న సైనికు లకు మాత్రం సరైన సౌకర్యాలు కల్పించటం లేదు. ఏడో వేతన సంఘంలో సైనికులకు మొండి చెయ్యి చూపించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అత్యంత తక్కువ వేతన పెంపు జరిగింది. “వన్ ర్యాంక్..వన్ పెన్షన్” కోసం సైనికులు సైతం ఉద్యమం ఉధృతం చేశారు. చివరికి సైనికుల త్యాగాలను కూడా రాజకీయం చేస్తున్నారు. దేశంలో తొలిసారి సర్జికల్ స్ట్రైక్స్ జరిగినట్లు ప్రచారం చేస్తున్నారు. గతంలో కూడా చాలా సార్లు సర్జికల్ స్ట్రైక్స్ జరిగాయి. కానీ అవి బయటకు రాలేదు. ఎందుకంటే ఇలాంటి భద్రతకు సంబంధించిన అంశాలు ప్రచారం కాకుడదనే నాడు బయట పెట్టలేదు. కానీ మోడీ వచ్చిన తరువాత తామేదో ఘనకార్యం సాధించినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. సైనికచర్యను పభుత్వం ఇలా రాజకీయం చేయడం పట్ల సైనికాధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ త్యాగాలను రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో బిజెపి ఒక ప్రమాదకర శక్తిగా ఉంది. ఈ నేపథ్యంలో మరోసారి దేశానికి ఎన్నికలు వచ్చాయి. కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు ప్రజలకు వచ్చింది. అధికార పార్టీ మళ్లీ ప్రజల ను మోసం చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నది.

**పెరిగిన నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు**

అవినీతిని అంతం చేస్తామని మోడీ పరివారం ప్రగల్భాలు పలికింది. కానీ మోడీ సర్కార్ హయంలో అవినీతి అనకొండలా పెరిగింది. రాఫెల్ కుంభ కోణంతో వేల కోట్ల రూపాయలు అంబానీ జేబులోకి చేరాయి. ప్రభుత్వ రంగాన్ని ప్రణాళికా బద్ధంగా ధ్వంసం చేశారు. ప్రభుత్వరంగ సంస్థ హెచ్ఎఎల్‌ను పక్కన పెట్టి రాఫెల్ ఒప్పందం కాంట్రాక్ట్‌ను అనుభవం లేని అనిల్ అంబానీ కంపెనీకి కట్టబెట్టడం, ప్రైవేటీకరణ పేరుతో దేశంలో ఆరు ఎయిర్ పోర్టులను గౌతం అదానీ కంపెనీకి ఇవ్వడం వంటి చర్యలతో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్ళారు. ఈ ఐదేళ్లలో నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశాన్ని అంటాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల నడ్డివిరిచారు. దేశంలో మోడీ హయంలో రైతాంగ ఆత్మహత్యలు, నిరుద్యోగం పెరిగింది. ఉపాధి కల్పన సవాల్‌గా మారింది. రైతులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. బిజెపి పాలిత మహారాష్ట్రలో నాసిక్ నుంచి ముంబాయి వరకు రైతులు చేపట్టిన చారిత్రాత్మక లాంగ్‌మార్చ్ దేశం మొత్తాన్ని ఆకర్షించింది. ఒక్కసారిగా రైతాంగ సమస్యలు చర్చకు వచ్చాయి. రాజస్థాన్‌లో నెలల తరబడి రైతాంగ పోరాటాలు సాగా యి. కర్ణాటక, పంజాబ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఏపి, తెలంగాణ, తమిళనాడుల్లో కూడా రైతాంగ ఉద్యమాలు జరిగాయి. రైతు ఘోషతో దేశ రాజధాని దద్దరిల్లింది. నిరుద్యోగ సమస్యపై వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలు సాగాయి. దేశ రాజధానిలో యువజనులు కదం తొక్కారు. వీటితో పాటు వ్యవసాయ కూలీలు, దళితులు, మహిళలు తమ తమ సమస్యలపై కూడా ఉధృత పోరాటాలు చేపట్టారు. బిజెపి పాలిత మధ్యప్రదేశ్‌లో రైతులపైన, దళితులపై జరిపిన కాల్పులలో అనేక మంది మరణించారు. గడిచిన ఐదేళ్లలో తీవ్రస్థాయిలో పోరాటాలు జరిగాయి. కార్మిక పోరాటాలు కూడా పెరిగాయి. ఈ ఐదేళ్ల కాలంలో మూడు జాతీయ సమ్మెలు జరిగాయి. ఒకసారి రవాణా రంగ సమ్మె జరిగింది. ఈ సమ్మెల్లో కోట్లాది మంది కార్మికులు భాగస్వాములయ్యారు. విద్యార్థులు, మహిళలు తమ పోరాటాలతో ప్రభుత్వానికి సవాల్ విసిరారు.

**చౌకీదార్ పేరుతో మరోసారి మోసం**

మోడీ గత ఎన్నికల్లో ఓట్ల కోసం చాయ్ వాలా పేరుతో మోసం చేశాడు. ఈ ఎన్నికల్లో చౌకీదార్ నినాదంతో మళ్లీ దేశ ప్రజలను మోసం చేసేందుకు సన్నద్ధం అవుతున్నాడు. ఇప్పుడో సరికొత్త వాదనను బిజెపి చర్చకు తీసుకొచ్చింది. తమకు ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోడీ ఉన్నారని, ప్రతిపక్షాలకు ఎవరున్నారని ప్రశ్నిస్తు న్నారు. అయితే భారత రాజ్యాంగం ప్రకారం ఎన్నికలకు ముందే ప్రధాని అభ్యర్థిని ప్రకటిం చాలనే నియమమేదీ లేదు. రాజ్యాంగం ప్రకారం ప్రజలు పార్లమెంట్(లోక్‌సభ) సభ్యులను ఎన్నుకుంటారు. కానీ ప్రధాన మంత్రిని ఎన్ను కోరు. ప్రజల ఓట్లతో ఎన్నికైన ఎంపిలు తమ నాయకుడుగా ప్రధాన మంత్రిని ఎన్నుకుంటారు. ఈ కనీస సూత్రాన్ని మరిచి చేసే వాదనలు అర్థరహితమైంది. దేశానికి నేతలు కాదు.. విధానాలు కావాలనేది విస్మరించ కూడని అంశం. 1996లో దేవగౌడ, 1998లో వాజ్‌పేయ్, 2004లో మన్మోహన్ సింగ్ వంటి వారు ఎన్నికల తరువాతే ప్రధానిగా ఎన్నికయ్యారు.

**రాజకీయ పార్టీల ఎత్తుగడలు**

బిజెపి నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలని దేశంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలు బలంగా విశ్వసిస్తున్నాయి. కేంద్రంలోని బిజెపి సర్కార్‌ను ఓడించడమే లక్ష్యంగా సిపిఎం 22వ అఖిల భారత మహాసభల్లో నిర్ణయం తీసుకుంది.

అందుకనుగుణంగా ఎన్నికల ఎత్తుగడలు రూపొందించింది. మూడు ప్రధానమైన అంశాలతో ఈ ఎన్నికల్లో సిపిఎం ఎత్తుగడలను వేస్తుంది. 1. దేశంలో బిజెపి కూటమిని ఓడించడం 2. లోక్‌సభలో సిపిఎం, వామపక్షాల బలాన్ని పెంచుకోవడం 3. కేంద్రంలోని ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వంటి మూడు కీలకమైన లక్ష్యాలతో ఈ ఎన్నికల్లో సిపిఎం పోటీ చేస్తుంది. రాష్ట్ర స్థాయిల్లో బిజెపిని ఎక్కడికక్కడ చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చింది. బిజెపి వ్యతిరేక ఓట్లు చెదిరిపోకుండా లౌకిక, భావ సారూప్యత గల పార్టీలతో కలిసి పోటీ చేసేందుకు సిపిఎం నిర్ణయించింది. కాంగ్రెస్‌తో ఎటువంటి పొత్తులు ఉండవని పేర్కొంది. అంతేకాకుండా ఎన్నికలకు ముందు జాతీయ స్థాయిలో ఎటువంటి కూటమి ఏర్పడదని, కనీస ఉమ్మడి కార్యక్రమం (సిఎంపి) కూడా ఎన్నికలకు ముందు సాధ్యంకాదని పేర్కొంది. గతంలో కూడా ఎన్నికల తరువాతే రాజకీయ పార్టీలు కూటములను ఏర్పాటు చేసి, ప్రభుత్వంలో భాగస్వాములయాయి. 1996లో యునైటెడ్ ఫ్రంట్, 1998లో ఎన్డీయే, 2004లో యుపిఎ ప్రభుత్వాలు కూడా ఎన్నికల తరువాతే ఏర్పడ్డాయి. సిపిఎం అఖిల భారత మహాసభల్లో తీసుకున్న నిర్ణయానికి లోబడి రాష్ట్ర స్థాయిల్లో ఎన్నికల ఎత్తుగడలు రూపొందిస్తున్నది. తమిళనాడులో డిఎంకెతో పొత్తు పెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో సిపిఐ, జనసేన, బిఎస్పీలతో కూటమిగా పోటీ చేస్తున్నది. తెలంగాణలో వామపక్ష కూటమిలో భాగస్వామిగా పోటీ చేస్తుంది. కేరళలో వామపక్ష ప్రజాతంత్ర కూటమిగా పోటీ చేస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష కూటమిలో భాగస్వామిగా పోటీ చేస్తున్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, ఉత్తరాఖండ్, అస్సాం, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో స్థానికపార్టీలతో కలిసి పోటీ చేస్తున్నది. త్రిపురలో వామపక్ష కూటమిగా అక్కడున్న రెండు స్థానాల్లో సిపిఎం పోటీ చేస్తుంది. సిపిఐ కూడా రాష్ట్ర స్థాయిల్లోనే ఎన్నికల ఎత్తుగడలకు నిర్ణయం తీసుకుంది. ఇక కాంగ్రెస్ విషయానికొస్తే మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో కూటమి కట్టాలని ప్రయత్నించింది. కానీ కాంగ్రెస్‌తో ఉన్న విభేదాలతో జాతీయ స్థాయిలో కూటమికి కొన్ని పక్షాలు అంగీకరించలేదు. అందుకనే కాంగ్రెస్ వెనక్కి తగ్గాల్సి వచ్చింది. దానితో రాష్ట్రస్థాయిలోనే పొత్తులు, ఎత్తులు వేయడంలో నిమగ్నమైంది. మధ్యప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ, ఒరిస్సా, రాజస్థాన్, హిమాచల్

> “బిజెపి వ్యతిరేక ఓట్లు చెదిరిపోకుండా లౌకిక, భావ సారూప్యత గల పార్టీలతో కలిసి పోటీ చేసేందుకు సిపిఎం నిర్ణయించింది. కాంగ్రెస్‌తో ఎటువంటి పొత్తులు ఉండవని పేర్కొంది. అంతేకాకుండా ఎన్నికలకు ముందు జాతీయ స్థాయిలో ఎటువంటి కూటమి ఏర్పడదని, కనీస ఉమ్మడి కార్యక్రమం (సిఎంపి) కూడా ఎన్నికలకు ముందు సాధ్యం కాదని పేర్కొంది.”



బిజెపిని ఓడించాలని తీర్మానం చేసిన సిపిఐ(ఎం) 22వ మహాసభ

ప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో ఒంటరిగానే పోటీ చేస్తున్నది. కర్ణాటకలో జెడిఎస్, తమిళనాడులో డిఎంకె, కేరళలో యుడిఎఫ్ కూటమి, మహారాష్ట్రలో ఎన్సీపి, బీహార్‌లో ఆర్జేడి, యుపిలో కూడా చిన్నా చితక పార్టీలతో పొత్తులతో ఎన్నికల బరిలోకి వెళ్తుంది.

బిజెపికి కొన్ని ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు దూరం కాగా, మరికొన్ని కలిసి వచ్చాయి. ఈ ఐదేళ్ల పరిణామాలపై భాగస్వామ్య పక్షాల్లో కూడా వ్యతిరేకత వచ్చింది. చిన్న చిన్న పార్టీలు సైతం మోడీ విధానాలను విమర్శించాయి. కానీ ఆయా పక్షాలకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో తిరిగి అంటకాగుతున్నాయి. మధ్యప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఏపి, తెలంగాణ, ఢిల్లీ, బెంగాల్ రాష్ట్రాల్లో బిజెపి ఒంటరిగా పోటీ చేస్తుంది. మిలిగిన అన్ని రాష్ట్రాల్లో పొత్తులతోనే ఎన్నికల బరిలోకి బిజెపి వెళ్తుంది. మహారాష్ట్రలో శివసేన, బీహార్‌లో జెడియు, ఎల్‌జెపి, తమిళనాడులో అన్నాడిఎంకె కూటమి, అస్సాంలో అస్సాం గణపరిషత్, జార్ఖండ్‌లో ఎజెఎస్‌యు, పంజాబ్‌లో ఎస్ఎడితో పొత్తు పెట్టుకొని బిజెపి పోటీ చేస్తుంది. జాతీయ పార్టీలుగా గుర్తించబడిన బిఎస్పీ, తృణముల్ కాంగ్రెస్, ఎన్సీపి కొన్ని రాష్ట్రాలకు పరిమితం అయ్యాయి. మహారాష్ట్ర కేంద్రంగా ఎన్సీపి, బెంగాల్ కేంద్రంగా టిఎంసి, యుపి కేంద్రంగా బిఎస్పీ ఉన్నాయి. యుపిలో బిఎస్పీ, ఎస్పీ, ఆర్ఎల్‌డి కూటమిగా పోటీ చేస్తున్నాయి. మహారాష్ట్రలో ఎన్సీపి, కాంగ్రెస్ ఇతర పార్టీలు కూటమి కట్టాయి. బెంగాల్‌లో టిఎంసి ఒంటరిగానే పోటీ చేస్తుంది. ప్రాంతీయ పార్టీలైన ఎస్పీ, ఆప్, తెలుగుదేశం, వైసిపి, టిఆర్ఎస్, జెడిఎస్, ఆర్జేడి, డిఎంకె, అన్నాడిఎంకె, ఎస్ఎడి, జెఎంఎం, శివసేన, ఈశాన్యంలో కొన్ని పార్టీలు కీలకంగా ఉన్నాయి. ఇవి ఆయా రాష్ట్రాల్లో కీలక భూమిక పోషిస్తున్నాయి. అయితే ఈ పార్టీల్లో అధికార పక్షం వైపు ఏ పార్టీ ఉందో, ప్రతిపక్షం వైపు ఏపార్టీ ఉందో స్పష్టంగా తెలుస్తుంది. వైసిపి, టిఆర్ఎస్ లాంటి ఒకటి, రెండు పార్టీలు మాత్రం ఊగిసలాటలో ఉన్నాయి.

## ఎన్నికల్లో వామపక్షాల పాత్ర

ప్రస్తుత ఎన్నికల్లో వామపక్షాల పాత్రపై అనేక ప్రశ్నలు వస్తున్నాయి. ఇక వామపక్షాలు పాత్ర నామమాత్రమేనని కొంతమంది అంటున్నారు. “లెఫ్ట్ అవుట్” అని మరికొంత మంది మాట్లాడుతున్నారు. అయితే వాస్తవ పరిస్థితులను, రాజకీయ మార్పులను అర్థం చేసుకోలేని వారు ఇలానే అవాకులు చెవాకులు పేలుతారు. వాస్తవంగా గత రెండు దఫాలుగా లోక్‌సభలో సిపిఎం, వామపక్షాల బలం తగ్గుతూ వచ్చింది. 1999లో 33 స్థానాలను సిపిఎం గెలుచుకోగా, వామపక్షాలు మొత్తం 42 స్థానాలు గెలుచుకున్నాయి. 2004లో సిపిఎం 43

(మిగతా 35వ పేజీలో)

# మానసిక రుగ్మతలను పెంచుతున్న పెట్టుబడిదారీ విధానం

**డేవిడ్ మాథ్యూస్**

రచయిత ఆరోగ్య, సామాజిక అంశాల అధ్యాపకులు

ఈనాడు ప్రపంచాన్నంతటిని మానసిక ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ లెక్కల ప్రకారం ప్రపంచంలో 30 కోట్లమంది ప్రజలు మానసిక కుంగుబాటుకు గురయ్యారు. మరో 2.3 కోట్లమంది ప్రజలు స్కిజోఫ్రేనియాతో బాధపడుతున్నారు. ప్రతి ఏడాది దాదాపు 8,00,000 మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గుత్త పెట్టుబడిదారీ దేశాలలో గుండెపోటు, కాన్సర్‌తో చనిపోయే వారి తరువాతి స్థానం మానసిక వ్యాధులతో చనిపోయే వారిదే.

యూరోపియన్ యూనియన్‌లో 18-65 సంవత్సరాల మధ్య వయసు వారిలో 27 శాతం తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారే. ఒక్క ఇంగ్లాండ్‌లోనే గత రెండు దశాబ్దాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న వారిలో మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నవారు పెరుగుతూ పోతున్నారు. 2014 లో జరిపిన జాతీయ ఆరోగ్య సేవలు, వయసులో ఉన్నవారి మానసిక ఆరోగ్యస్థితి పై చేసిన సర్వేలో జనాభాలో పదహారేళ్లు దాటిన వారిలో 17.5 శాతం మంది వ్యాకులత, కుంగుబాటుకు గురవుతున్నట్టు గుర్తించారు. 1993లో ఈ సంఖ్య 14.1 శాతం ఉండేది. దీనికి తోడు సహాయం అందించవలసిన వారి సంఖ్య 6.9 నుండి 9.3 శాతానికి పెరిగింది.

పెట్టుబడిదారీ సమాజంలో మానసిక ఆరోగ్యానికి కారణం శరీరంలో జరిగే మార్పులుగా మానసిక ఆరోగ్య వృత్తిలో వున్నవారు చెపుతుంటారు. ప్రజలలో కూడా అత్యధికులకు అదే అభిప్రాయం ఉంటుంది. అనారోగ్యానికి కారణం మెదడులోని రసాయనాల అసమతుల్యత కారణమని అనుకుంటుంటారు- సెరొటోనిన్, డోపమైన్ రసాయనాల అసమతుల్యత వల్ల నరాలపని విధానంలో మార్పులు వస్తాయని చెబుతుంటారు. నిజానికి దీనికి సంబంధించిన రుజువులేవీ లేవు. జన్యు సంబంధ కారణాలుగా మరికొందరు భావిస్తుంటారు. కానీ వీటికి సంబంధించి కూడా సరైన రుజువులు లేవు. మానసిక రుగ్మతలకు కారణం శారీరక నిర్మాణంలోని లోపాలేనని సమాజంలోని వివిధ తరగతులలో బలంగా అభిప్రాయం ఏర్పడ్డది మాత్రం నిజం.

సామాజిక పరిస్థితులు మానసిక ఆరోగ్యానికి మధ్య ఉన్న సంబంధాన్ని రకరకాల వైద్యశాస్త్ర పదజాలంతో మరుగుపరుస్తున్నారు. రోగ నిర్ధారణ కూడా వ్యక్తుల వద్దే నిలిచిపోతున్నది. మొత్తం సామాజిక విషయాలను విశ్లేషించే బదులు వ్యక్తులకు పరిమితమవుతున్నారు. కానీ సామాజిక, రాజకీయ, ఆర్థిక కారణాలు మానసిక ఆరోగ్యాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తాయని మనం గుర్తించాలి. కొన్ని సమాజాలలో, మిగిలిన వాటికంటే మానసిక అనారోగ్యాలు ఎక్కువవుతున్నా యన్నది నిజం. సమాజ ఉపరితల నిర్మాణం జరిగే క్రమంలో మానసిక రుగ్మతలకు పెట్టుబడిదారీ విధానం ప్రధానమైన కారణం అవుతుంది. మార్క్సిస్టు సామాజిక కార్యక్రమాలు, విధానాల భోధనాధ్యాపకుడిగా ఇయన్ ఫెర్గుసన్ “మనం నివసిస్తున్న ప్రపంచంలోని ఆర్థిక, రాజకీయ విధానం-పెట్టుబడిదారీ విధానం - ఈనాటి మానసిక రుగ్మతలకు ప్రధాన కారణమని” అంటున్నారు. “సమాజంలో దోపిడీ, అణచివేత లేకపోతే” మానసిక సమస్యలు నివారించడం సాధ్యమవుతుంది.

అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఉన్న దేశాలలో, ముఖ్యంగా బ్రిటన్‌ని ఉదాహరణగా తీసుకుని, అక్కడి మానసిక ఆరోగ్యాన్ని విశ్లేషణ చేస్తాను. ఇందుకు మార్క్సిస్టు అయిన ఎరిక్ ఫ్రామ్ రూపొందించిన నమూనాను ఆధారంగా తీసుకుంటాను. ఎందుకంటే, అతను మనిషి మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి మానవునికి కొన్ని అవసరాలు తప్పనిసరిగా ఉండి తీరాలని అన్నారు. ఫెర్గుసన్ వాదనకు మద్దతుగా, పెట్టుబడిదారీ సమాజంలో మానసిక ఆరోగ్యం సరిగా ఉండేందుకు సరైన పరిస్థితులు ఉండవని నేనంటాను.

మానవ అవసరాలు ఈ వ్యవస్థలో తీరవని నా ఉద్దేశం. ఆర్థిక అసమానతలకి బ్రిటన్లో ఈ మధ్య పెట్టుబడిదారీ విధానమే అసలు కారణం అంటూ వస్తున్న రాజకీయ ఉద్యమాలు నా అభిప్రాయానికి ఊతం ఇస్తున్నాయి.

బారెన్, పాల్ స్వీజీ తాము రాసిన గుత్త పెట్టుబడిదారీ విధానం అనే గ్రంథంలోని చివరి విభాగంలో గుత్తపెట్టుబడిదారీ విధాన పర్యవసానాలను స్పష్టంగా వివరించారు. “సమాజం తన పౌరుల ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పెంపొందించుకోగల మౌలిక అవకాశాలను” అభివృద్ధి చేయడంలో ఈ వ్యవస్థ విఫలమయింది”.

గుత్త పెట్టుబడిదారీ విధానంలో విస్తారంగా ఉన్న హీనస్వభావాన్ని, అవివేకాన్ని ఇందుకు ఉదహరణగా వారు చూపారు. అందులోని చాలా కొద్దిమంది అదృష్టవంతులకి మాత్రమే పని ఆనందదాయకంగా ఉంటుంది కాని అత్యధికులకు అసంతృప్తినే మిగులుస్తుంది. తీరిక అనేది అణగారి ఉన్న ఉత్సాహాన్ని వెలికితెచ్చుకునే అవకాశంగా కాక ఒక వృధా కాలక్షేపంగా మారిపోయిందని బారన్, స్వీజీ అంటున్నారు. ఏమి పనిచేయకుండా కాలక్షేపం చేయడం ఒక సామాన్యమైన సంస్కృతిగా మారిపోయింది. పుస్తకాలు చదవడం, టెలివిజన్ చూడడం, లేదా సినిమాలు చూడడం అన్నవాటిలో మనకు ప్రేక్షక పాత్రే ఉంటుంది గాని అందుకు మన తెలివితేటలుఉపయోగించవలసిన అవసరం ఉండదు.

పనైనా తీరికైనా మరింత వినిమయం పెంచేదిగా ఉండడమే ప్రధానలక్ష్యంగా ఉంటున్నది. ఇదివరకులాగా వినిమయం మన అవసరాలకు అనుగుణంగా, మన అభిరుచులకు వ్యక్తీకరణగా కాక సమాజంలో మన విలువను ప్రతిబింబించేదిగా ఉండవలసి వస్తున్నది. అందువలన సమాజంలో గుర్తింపు కోసం ప్రవేశ పెట్టబడిన కొత్త ఉత్పత్తుల కోసం ఆరాట పడవలసి వస్తున్నది. అవి పొందలేకపోతే అసంతృప్తి కలుగుతున్నది". పనిలోగాని విరామ సమయంలోగాని బతికేందుకు అవసరమైన మౌలిక అవసరాలను సమకూర్చుకోవడం అన్నది పోనుపోను అర్ధవంతం కాదుకదా, అప్రధానమవుతున్నదని" బారన్, స్వీజీ అంటున్నారు. ఫలితంగా సమాజం దిగజారడమే కాదు, సమాజాన్ని శూన్యం ఆవరిస్తున్నది. కార్మిక వర్గం విప్లవ పోరాటాలను సాగించే పరిస్థితులు లేకపోవడంతో అవే దిగజారుడు పరిస్థితులు కొనసాగుతున్నాయి. మనిషి మౌలిక అవసరాలకి, వ్యవస్థ లోని నిర్బంధాలకి మధ్య ఏర్పడుతున్న వైరుధ్యాలను పరిష్కరించటం మరింత కష్టతరమవుతున్నది. ఫలితంగా తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ఈనాటి గుత్తాధిపత్య పెట్టుబడిదారీ విధానంలో ఈ వైరుధ్యం ప్రముఖంగా ఉన్నది. గుత్తాధిపత్య పెట్టుబడిదారీ విధానంలోని ఆధునిక సమాజ స్వరూపంలో, ప్రజల అవసరాలకి, పెట్టుబడి దారుని క్రూరమైన లాభాల వేటకి మధ్య ఉన్న వైరుధ్యానికి పొంతన ఉండదు. ఫలితంగా మానసిక ఆరోగ్యంతో జీవించటానికి అవసరమైన పరిస్థితులు గణనీయంగా కుదించబడతాయి.

**మానసిక ఆరోగ్యం, మానవ నైజం**

మానసిక విశ్లేషణ వలన గుత్తపెట్టుబడి దారీ విధానానికి వ్యక్తికీ ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవడంలో బారన్, స్వీజీ ప్రభావితులయ్యారు. లోపల అంతర్గతంగా ఉన్న శక్తిని వెలికి తీయడంలో కామాతురతను సంతృప్తి పరచుకోవడం ప్రముఖ పాత్ర వహిస్తుందన్నది వారి పరిశోధనలకు కేంద్రంగా ఉన్నది. ఫ్రాయిడ్ లాగా కామాతురతను అణచి ఉంచాలని సమాజం అంగీకరించిన విధానం నుండి బయటికి రావాలని అభిప్రాయ పడ్డారు. సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రాముఖ్యతను గుర్తిస్తూనే, ఫ్రామ్ మార్క్సుకి తాను రుణపడి ఉన్నానని బహిరంగంగా అంగీకరించాడు. అతను అసమాన ప్రతిభాశాలి అని గుర్తించారు.

**"ఫ్రాయిడ్ ప్రతిపాదించిన అచేతనను, అణచివేతను అంగీకరిస్తూనే కొన్ని మార్పులను చేశారు. సాంప్రదాయ ఫ్రాయిడ్ వాదులు వ్యక్తుల సామాజిక అవగాహనను లోతుగా అర్థం చేసుకొని, దానిని తమ విశ్లేషణలలో మమేకం చేయకపోవడాన్ని వారు గుర్తించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో వ్యక్తి చైతన్యం రూపుదిద్దుకుంటుందన్న మార్క్సు విశ్లేషణ ఆధారంగా ఒక సిద్ధాంతాన్ని రూపొందించారు."**

ఫ్రాయిడ్ ప్రతిపాదించిన అచేతనను, అణచివేతను అంగీకరిస్తూనే కొన్ని మార్పులను చేశారు. సాంప్రదాయ ఫ్రాయిడ్ వాదులు వ్యక్తుల సామాజిక అవగాహనను లోతుగా అర్థం చేసుకొని, దానిని తమ విశ్లేషణలలో మమేకం చేయకపోవడాన్ని వారు గుర్తించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో వ్యక్తి చైతన్యం రూపుదిద్దుకుంటుందన్న మార్క్సు విశ్లేషణ ఆధారంగా ఒక సిద్ధాంతాన్ని రూపొందించారు. సమాజానికి అంగీకారమైన దారులలోనే వ్యక్తులు మెలగాలని పైకి కనబడని ఒత్తిడి వ్యక్తులపై ఉంటుంది. నిజానికి మార్క్సు మనస్తత్వ శాస్త్ర గ్రంథం రాయలేదు. కానీ దాని పునాదులు 'మనిషి తన నుండి తాను వేరు పడడం' (పరాయీకరించబడడం) అనే సిద్ధాంతంలో ఇమిడి ఉన్నదని ఫ్రామ్ అభిప్రాయపడ్డారు. మనిషిని భౌతికంగా, మానసికంగా పరాయీకరించడం, పెట్టుబడిదారీ విధానంలో మనిషిని న్యూన పరచడానికి ఒక ఉదాహరణగా మార్క్సు చెప్పారు. మనిషి తన నుంచి, తన చుట్టూ ఉన్న మనుషుల నుంచి కూడా వేరుపడి హృదయ స్పందన కోల్పోతాడు. పరాయీకరణ ప్రత్యేకతను అర్థం చేసుకోవడంలోనే మనిషి మానసిక ఆరోగ్యాన్ని అర్థం చేసుకోవడం ఇమిడి ఉంది. ఉదాహరణకి పెట్టుబడిదారీ విధానంలో మానవ మనుగడకి, జీవిత స్వభావానికి మధ్య ఉన్న తేడాని అర్థం చేసుకోవడం. పెట్టుబడిదారీ విధానం మనుషుల మనుగడను వారి జీవిత స్వభావం నుండి వేరుచేస్తుంది. పెట్టుబడిదారీ సమాజంలో మనుషులు తమ స్వభావాలకు భిన్నంగా బతకవలసి వస్తుందన్న సూత్రాన్ని ఫ్రామ్ తన మానసిక శాస్త్ర విశ్లేషణలో పొందుపరిచారు.

మానవ స్వభావాలు రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి సాధారణ మానవ స్వభావం. .రెండోది చారిత్రక నేపథ్యంలో అతని స్వభావం. కొన్ని అవసరాలు స్థిరమయినవి. ఉదాహరణకు ఆకలి, సంపర్కం వగైరా. కొన్ని కోరికలు మనిషి సాంస్కృతిక, సామాజిక చారిత్రక పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. మార్క్సు ప్రభావంతో ఫ్రామ్ కూడా మౌలికంగా మనిషి కోరికలు ఒకే రకంగా ఉంటాయిగాని వాటిని వ్యక్తపరిచే విధానాలు ఆనాటి సామాజిక, సాంస్కృతిక పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని వాదించారు. మనిషి మెదడు "ఒక తెల్ల కాగితం"లా ఉంటుందని, దానిపై ఏ ప్రత్యేకతలు లేకుండా కేవలం ఆనాటి సామాజిక సాంస్కృతిక విధానాలకు అనుగుణంగా మాత్రమే రాయబడుతుందని అనుకోలేము. అసలైన సమస్య మనిషి శారీరక అవసరాల ప్రాధాన్యత ను గుర్తించి, వాటిని అనంతమైన ఇతర గుణాల నుండి వేరుచేయడమే.

మనిషికి ఆకలి, లైంగిక అవసరాల వంటి తప్పనిసరిగా తీర్చుకోవాల్సిన శారీరక అవసరాలను ఫ్రామ్ గుర్తించారు. కానీ మనిషి పరిణితి చెందే క్రమంలో జంతువుల నుండి వేరుపడ్డాడు. మనుషులు ప్రకృతిపై ఆధిపత్యం సంపాదించిన క్రమంలో తమ శారీరక అవసరాలు తీర్చుకోవడం సులభమైంది. అందువలన వాటి ప్రాధాన్యత తగ్గి పోయింది. తమ ఉద్వేగాలను, మేధోపరమైన ఆశలను సంతుష్టి పరచుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫలితంగా మనిషి తపన ఇక ఇప్పుడు కేవలం శారీరక అవసరాలను తీర్చుకోవడానికి పరిమితమైలేదు. తన చుట్టూ ఉన్న పరిస్థితులపై ఆధారపడి ఉంది.

మనిషి ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి అతని స్వభావాన్ని తెలుసుకోవడం తప్పనిసరని అనుకుంటున్నాము కాబట్టి అది తెలుసుకోడానికి ఐదు ప్రధానమైన పరిస్థితులని గుర్తించవచ్చు. మొదటిది సాపేక్షత. ప్రపంచంలో మనిషి ఒక్కడు గనక ఉంటే తనలాంటి వాళ్లను వెదుక్కొని వారితో సంబంధాలు పెట్టుకునే ప్రయత్నాలు చేసేవాడు. ఆలా కాకుండా ఉండడం అసాధ్యం. రెండోది మనిషి ప్రకృతిపై ఆధిపత్యం చెలాయించడం. దీని వలన శారీరక అవసరాలు తీరడమేకాక మనిషి అభిరుచులను అభివృద్ధి చేసుకోడానికి తద్వారా సృజనాత్మకంగా తయారవడానికి దోహదపడుతుంది. మనుషులు సృజనాత్మక మేధస్సును వ్యక్తీకరించే సమర్థత కలిగి

> "మానసిక ఆరోగ్యానికి వాటిని ఎక్కువగా నొక్కి చెప్పాల్సిన అవసరం లేదు. కానీ మనిషి తన ప్రత్యేకతను గుర్తించే విధంగా ప్రయత్నం చేయడం అంతర్గతంగా అతనికి తృప్తిని స్తుంది. పెట్టుబడిదారీ విధానం మనిషి ఎదుగుదలకి అడ్డం పడు తుంది. మానసిక అనారోగ్యాలకు మూల కారణం సమాజోత్పత్తి విధానంలోను, దానికి సంబంధించిన రాజకీయ సామాజిక నిర్మాణంలోనూ ఉంటుందని ఫ్రామ్ నమ్ముతారు."



మానసిక సమస్యలతో మహిళలు

ఉన్నారు. దానిని మానవ మౌలిక స్వభా వాన్ని సంతుష్టి పరిచేవిధంగా మలుచుకోగలరు. అది వారికీ ఎంతో తృప్తినిస్తుంది.

మూడవది, మనిషి మానసిక స్థితి. ఇందు కు మనిషి తనను మిగిలినవారు తమలో కలుపు కోవాలని అనుకుంటాడు. వారిలో పూర్తిగా భాగస్వాములు కావాలనుకుంటారు. ఈ రకమైన సంపూర్ణ భాగస్వామ్యం కేవలం పరస్పర సంఘీభావంతోనే సాధ్యమవుతుంది. నాల్గవది, మనుషులు ఒక విధమైన గుర్తింపును కోరుకుం టారు. దానికోసం పాటుపడతారు. తమకి ఒకప్రత్యేకత కావాల నుకుంటారు. ఐదవది, తమ అనుభవాలు, ప్రపంచాన్ని చూసే తీరు మిగిలిన వారితో పంచుకోవాలని ప్రతి మనిషి కోరుకోవడం. ఇది మనిషి మానసిక అవసరం కూడా.

మనుషులందరికి సంతృప్తినిచ్చే ఈ అవసరాలు అందరూ కోరుకుంటున్నారని ఫ్రామ్ వాదిస్తున్నారు. 'మనిషి తన స్వభావానికి అనుగు ణంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నప్పుడు అతను మానసికంగా సంతృప్తికరంగా ఉంటాడు. మానసిక అనారోగ్యం కలగడానికి కారణం ఈ అభివృద్ధిని పొందలేకపోవడమే. " ఆకలి, లైంగిక తృప్తి అన్నవి కేవలం సాధారణ మనిషి సహజ సిద్ధమైన అవసరాలు.

మానసిక ఆరోగ్యానికి వాటిని ఎక్కువగా నొక్కి చెప్పాల్సిన అవసరం లేదు. కానీ మనిషి తన ప్రత్యేకతను గుర్తించే విధంగా ప్రయత్నం చేయడం అంతర్గతంగా అతనికి తృప్తినిస్తుంది. పెట్టుబడిదారీ విధానం మనిషి ఎదుగుదలకి అడ్డం పడుతుంది. మానసిక అనారోగ్యాలకు మూల కారణం సమాజోత్పత్తి విధానంలోను, దానికి సంబంధించిన రాజకీయ సామాజిక నిర్మాణంలోనూ ఉంటుందని ఫ్రామ్ నమ్ముతారు. అవి మనిషి కోరికలకు కళ్లాలు వేస్తుంటాయి. ఇదే మనిషి మానసిక కుంగుబాటుకు కారణం అవుతుంది. "మౌలికమైన ఏ ఒక్క మానసిక అవసరం తీరకపోయినా మనిషి మానసిక స్థితి దెబ్బ తింటుంది. ఫలితంగా పిచ్చివాడవుతాడు. నరాల బలహీనతకు గురవుతాడు.

**పని, సృజనాత్మకత అణచివేత**

మార్క్సులాగే ఫ్రామ్ కూడా మనిషి సహజ మైన కోర్కెలను తీర్చుకున్నప్పుడే ఎంతో సంతృప్తిని పొందుతాడని నొక్కి చెప్పారు. మార్క్స్ 1844 లో రాసిన ఆర్థిక తాత్విక నోట్సులో శ్రమ అన్నది మానసికంగా, శారీరకంగా కూడా సంతృప్తిని కలిగించే అనుభవంగా ఉండాలని గట్టిగా వాదించారు. "కార్మికులు వారు ఉత్పత్తి చేసిన వాటితో సంబంధాన్ని కలిగి ఉండగలగాలి, తమ భావా లను స్వేచ్ఛగా అందులో వ్యక్తీకరించ గలగాలి, వారి అంతర్గత సృజనాత్మ కతను వెలికి తీయ గలగాలి. కానీ పెట్టుబడి దారీ వ్యవస్థలో శ్రమ కార్మికుడి నుండి వేరు చేయబడుతుంది. అంటే కార్మికుడు తాను అనుకున్న విధంగా శ్రమ చేయలేడు. శ్రమ శ్రామికుడిని బలపరిచే బదులు అతని నుండి వేరుచేయబడుతుంది. అందువలన శ్రమ తృప్తిని ఇవ్వకపోగా అసంతృప్తినిస్తుంది. "కార్మికుడు తన శారీరక, మానసిక శ్రమను స్వేచ్ఛగా అభివృద్ధి చేసుకోలేడు. తన శరీరాన్ని కుంచింపచేసు కుంటాడు. మనసుని నాశనం చేసుకుంటాడని" మార్క్స్ అంటారు. పెట్టుబడి దారీ వ్యవస్థలో మనిషి శక్తిని మూసపోత శ్రమ గా మార్చేట్టుగా గట్టి ప్రయత్నాలు జరుగు తాయి. ఇది కార్మికుడిని అత్యంత దౌర్భాగ్యమైన పరిస్థితికి నెడుతుంది. వినుగు పుట్టిస్తుంది. తన అంతర్గత సృజనాత్మకతను వెలికి తీసే బదులు తనను తాను అణచుకోవలసిన పరిస్థితి ఏర్పడు తుంది. జీతం కోసం తప్పనిసరిగా కఠినమైన, నచ్చని పని చేయక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది.

బ్రిటన్లో పని పట్ల చాలామందికి అసంతృప్తి ఉంది. 2018 లో శ్రామికులలో జరిపిన ఒక సర్వే లో 47 శాతం కార్మికులు తాము చేస్తున్న పనిని మానుకోవాలనుకుంటున్నామని, పై ఏడాది కొత్త పని వెతుక్కోవాలనుకుంటున్నామని తెలిపారు. పని ఆసక్తికరంగా లేకపోవడం, తమకు ఎటువంటి గుర్తింపు లేకపోవడంతో పాటు ఎటువంటి అభివృద్ధి చెందే అవకాశాలు లేకపోవడం అందుకు ప్రధానమైన కారణంగా చెప్పారు.

బ్రిటన్లో-ఇతర అభివృద్ధి చెందిన గుత్త పెట్టుబడిదారీ దేశాలలో కూడా-శ్రామికులలో అత్యధికులు తమ పని పట్ల అసంతృప్తిగా ఉ న్నారని చెప్పడానికి ఈ అనుభవాన్ని ఒక ఉ దాహరణగా తీసుకోవచ్చు. మనిషి మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి అతని సృజనాత్మకతకు అవకాశాలు ఉండాలని ఫ్రామ్ అంటారు. మనుషులకు సృజనాత్మక శక్తి ఉన్నందువల్ల వారు ఉదాసీనమైన ప్రేక్షకులుగా ఉండలేరు.

కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో మనిషికి ఆ సృజనాత్మకతను బహిర్గతం చేసుకోవడం సాధ్యపడదు. అందువలన పని అన్నది పెట్టుబడి దారీ వ్యవస్థలో మానసిక ఆరోగ్యాన్ని పెంచే బదులు దానికి ఆటంకంగా మారుతుంది. ఈ విషయాన్ని రుజువు చేసేందుకు తగిన గణాం కాలు లేకపోయినప్పటికీ సాధారణ కార్మికులు తాము చేస్తున్న పని పట్ల అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తున్నది. పనిలోని అసంతృప్తి వల్ల వేదన, కుంగుబాటులకు గురవుతున్న వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతున్నది. బ్రిటన్ శ్రామిక శక్తి లో 2017-18లో పనికి సంబంధించిన అనారో గ్యంతో సెలవులు పెట్టినవారు 57 శాతం కాగా, మానసిక రుగ్మతల వలన సెలవులు పెట్టిన వారు 44 శాతం ఉన్నారు. 2017 లో జరిపిన మరొక సర్వేలో బ్రిటన్‌లో పనిచేసేవారి లో 60 శాతం మంది గడచిన ఏడాది కాలంలో పనికి సంబంధించిన మానసిక అనారోగ్యానికి గురయ్యారని తెలిసింది. వేదన ఇందులో అతి ముఖ్యమైన కారణం.

బారన్, స్వీజీ, " కార్మికులు తాము చేసే పనిలో ఏమాత్రం తృప్తి పొందడం లేదని వాదిస్తున్నారు. తదిన్నంగా పని వారి సహజ నైజానికి దూరం చేసి, ఆ క్రమంలో అనేక మానసిక రుగ్మతలకు కారణమవుతున్నది. బ్రిటన్‌లో సగానికి సగం మంది కార్మికులు మానసిక రోగాల బారిన పడుతున్నారంటే అది సామాజిక నిర్మాణంలోని లోపంగానే చూడ వలసి ఉంటుంది. గుత్త పెట్టుబడిదారీ సమాజం లో జీతాలకు పనిచేయడం వల్ల మానసిక ఆరోగ్యాలు దెబ్బ తింటున్నాయనడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. వ్యతిరేక భావనలు కలగడం సర్వ సాధారణంగా మారుతాయి. తరతమ తేడాలతో పని చేసే వారిలో ఈ భావనల స్థాయి సహజంగానే మారతాయి. చాలా సందర్భాలలో మానసిక రుగ్మతలు రావడం ఒక సాధారణ విషయంగా పరిగణించబడుతుంది. కానీ ఒక సమస్యగాచూడబడదు. అంటే మానసిక ఆరోగ్యం దిగజారడం అనేది సాధారణ విషయంగా చూడబడుతుంది.

**అర్థవంతమైన సాంగత్యాలు, ఒంటరితనం**

అర్థవంతమైన వ్యక్తిగత సంబంధాలు, ప్రేమ, స్నేహాలు మనిషి మానసిక ఆరోగ్యానికి ఎంతో సహకరిస్తుందని ఫ్రొమ్ అంటున్నారు. మనుషులు ఈ ప్రపంచంలో వారి "ఒంటరితనం" నుంచి పారిపోడానికి, వారి మానసిక ఏకాంతం నుంచి బయటికి రావడానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థ అలా బయటపడే అవకాశాలను ఇవ్వదు.

> **"అర్థవంతమైన వ్యక్తిగత సంబంధాలు, ప్రేమ, స్నేహాలు మనిషి మానసిక ఆరోగ్యానికి ఎంతో సహకరి స్తుందని ఫ్రొమ్ అంటున్నారు. మనుషులు ఈ ప్రపంచంలో వారి "ఒంటరితనం" నుంచి పారిపో డానికి, వారి మాన సిక ఏకాంతం నుంచి బయటికి రావడానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థ అలా బయటపడే అవకాశాలను ఇవ్వదు."**

సామాజిక సంబంధా లలో అసంపూర్ణతను బారన్, స్వీజీ గుర్తించారు. "అది మనుషులు తమ మధ్య సామాజిక సంబంధాలు అతి తక్కువగా కొనసాగించడం లోనూ, పై పైన మాట్లాడడంలోనూ, మొహమా టానికి పలకరించడంలో, మాట్లాడడంలోనూ వ్యక్తమవుతోందని" వారు వాదిస్తున్నారు. స్నేహానికి, మేధోపర చర్చలకు కావలసిన ఉ ద్విగ్నత, నిబద్ధత కొరవడి, సమాజంలో ఇతరు లతో మాట్లాడడం కేవలం పరిచయాలు నిలుపు కోడానికి,పలకరింపులకి పరిమితమవుతున్నాయి. మనం నివసిస్తున్న ఈనాటి మన చుట్టూ ఉన్న సమాజంలో ఇదెంత మేరకు ఉన్నదని కొలవడం కష్టమే అయినా ప్రస్తుతం ఉన్న పెట్టుబడిదారి సమాజాన్ని ఒంటరితనం అనే సమస్య పట్టి పీడిస్తున్నదని అర్థం చేసుకోవడం కష్టం కాదు. అది రోజు రోజుకి పెరుగుతూ ఎంత పెద్ద ప్రజారోగ్య సమస్యగా మారిందంటే, ఒంటరి తనాన్ని పరిష్కరించేందుకు బ్రిటీష్ ప్రభుత్వం ఒక మంత్రిత్వ శాఖనే ఏర్పరచవలసి వచ్చింది.

ఒంటరితనం మనోవ్యాధిగా మారి మనిషిని దుర్భలుడిని చేస్తుంది. వ్యక్తులు దీని ఫలితంగా తాగుడుకు, మత్తు మందులకు బానిసలవుతారు. వారిపై ఒత్తిడి పెరుగుతుంది. రక్తపోటు అధికం అవుతుంది. గుండెపోటు సంభవిస్తుంది. రోగనిరోధక శక్తి క్షీణిస్తుంది. కుంగుబాటుకి కారణమవుతుంది. 2017 గణాంకాల ప్రకారం బ్రిటన్ లో 13శాతం జనాభాకి కష్ట సుఖాలు పంచుకునే దగ్గరి స్నేహితులు అసలు లేరు. మరో 17 శాతం జనాభాకి చెప్పుకోదగ్గ స్నేహితులు లేరు. 45 శాతం జనాభా గడచిన 15 రోజులలో కనీసం ఒకసారైనా ఒంటరితనాన్ని అనుభవించారు. 18 వలన చాలాసార్లు ఒంటరితనాన్ని అనుభవించిన వారే. మంచి అనుబంధం ఒంటరితనాన్ని దూరం చేస్తుందన్నది నిజమే అయినా అటువంటి బాంధవ్యాలు ఉన్నవారిలో కూడా 47మంది ఏదో ఒక సమయంలో ఒంటరితనాన్ని అనుభవించిన వారే. 16మంది మాటిమాటికి ఒంటరితనానికి గురవుతున్నవారే. మానసిక రుగ్మతలు ఇలా పెరుగుతున్న నేపథ్యంలో ఇందుకు కారణాలు జన్యుపరంగా ఉంటాయా అని, వాతావరణం వలన ఏర్పడతాయా అని పరిశోధనలు చేస్తున్నారు. శారీరక నిర్మాణంపై పరిశోధనలు చేసి నిర్ధారణలకు వచ్చినవారు సహితం పరిస్థితుల ప్రభావం ఎక్కువగా ఉ ంటుందని ఒప్పుకుంటున్నారు. కొంతమంది మాత్రం పెట్టుబడిదారీ వ్యవస్థ దీనికి ఎంతవరకు దోహదపడుతున్నదా అనే విషయం పరిశోధనలు చేస్తున్నారు.

పెట్టుబడిదారీ సమాజంలో వ్యక్తుల ఔన్నత్యం గుర్తించబడుతుంది. వ్యక్తులపై ఎదగడానికి చేసే ప్రయత్నాలు, స్వావలంబన, స్వతంత్రత పెట్టుబడిదారిసమాజ గుర్తింపులు. చరిత్ర గనక పరిశీలిస్తే ఈ వ్యక్తివాదం మూలాలు భూస్వామ్య సమాజంలో ఉన్నాయి. తమ శ్రమను తాము మార్కెట్‌లోకి తీసుకెళ్లి అమ్ముకో వచ్చని – గ్రామం మొత్తంగా గాని, కుటుంబం మొత్తంగా గాని కలిసి పని చేయవలసిన అవసరం లేదని అన్న రోజులవి. పెట్టుబడిదారీ విధానానికి ముందు సమిష్టి తత్త్వం ఉండేది. పెట్టుబడిదారీ వ్యవస్థ వచ్చిన తరువాత వ్యక్తివాదం పెరిగింది. ఈ వ్యక్తి వాదం అంతకు ముందున్న వ్యవస్థలలో కన్నా పెట్టు బడిదారీ వ్యవస్థలో పెరగడంతో, వ్యక్తులు సమాజంలో ఒంటరితనానికి గురయ్యారు. పెట్టుబడిదారీ విధానంలో సామూహిక తత్వానికి, సంఘీభావా నికి తావు లేదు. వారికే ప్రాధాన్యత, ప్రతిఫలం కూడా. వ్యక్తులు తమను తాము అభివృద్ధి చేసుకోడానికి పోటీ పడాలని అనుకుంటారు. మార్కెట్లు పనిచేస్తున్నందువలన ఆర్థికరంగంలో పోటీ పడాలి. సైద్ధాంతికంగా పరిమితమైన వనరులను చేజిక్కించు కోడానికి విజయులు కావడానికి పోటీ పడి తీరాలి. సమాజంలోని ఇతర వ్యక్తులు తమ ఉన్నతికి మద్దతు నిచ్చే వారిగా కాక అడ్డుపడేవారిగా చూడబడతారు. అందువలన

> **"వినిమయ సరుకుల ఉపయోగం కన్నా వాటిని పొందడం తమ స్థాయి పెరగటానికి సూచనగా చూడడం మొదలయింది. ఇవి వినియోగదారుని స్థాయిని సూచించేవి అయ్యాయి. గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థలో వినిమయం భౌతిక మానసిక అవసరాలను తీర్చడం కంటే ఆ ఆలో చనలను జీర్ణించుకోవడం అయింది. "వినిమయం మనిషి శారీరక, ఇంద్రియ, రసాత్మక తృష్ణను సంతృప్తి పరిచేవిగా ఉండాలి అంటారు ఫ్రామ్."**

సామాజిక బంధాలు చాల బలహీ నంగా ఉంటాయి. అందువలన మనిషికి అదిచ్చే విలువ పెట్టుబడిదారీ వ్యవస్థలోనే, వ్యక్తుల ఒంటరితనం ఇమిడి ఉంది.

పెట్టుబడిదారీ సిద్ధాంతంలో ఒంటరితనం అంతర్గతంగా ఉండడమే కాదు పెట్టుబడిదారీ వ్యవస్థ పని విధానంలోనే ఒంటరితనం ఉంది. దయాదాక్షిణ్యాలు లేకుండా ఎదగడం ఫలితంగా ఉత్పత్తిని పెంచుకోవడం దాని ప్రాథమిక స్వరూపం. ఇది దాని సిద్ధాంతంలోనే భాగం అయినందువలన దానిని సవాలు చేసిన వారులేరు. ఫలితంగా మానవ సంబంధాలకన్నా పనికి ప్రాధాన్యత పెరుగుతుంది. పైగా నయా ఉదారవాద విధానాల అమలుతో ఎప్పుడైనా ఊడిపోయే ఉద్యోగాలు, సామాజిక భద్రతా లేకపోవడం, ఏ ప్రయోజనాలైనా తప్పనిసరిగా సమకూర్చబడతాయన్న భరోసా లేకపోవడం, పని గంటలు స్థిరంగా లేకపోవడం, – ఇవన్నీ కలిసి ఒంటరితనాన్ని మరింత పెంచాయి. ఏ రోజు పని ఉంటుందో ఉండదో తెలియక, పని ఉన్నా అలవాటు పడిన జీవితం గడపడానికి అవసరమైన వేతనం వస్తుందో రాదో అనే ఆందోళన, "ఫ్లెక్సిబుల్ "లేబర్ మార్కెట్ పుణ్యమా అని కార్మికుల జీవితాలలో భాగం అయ్యాయి. వ్యక్తులకు సామాజిక సంబంధాలకి కేటాయించే సమయాన్ని తగ్గించుకుని మరిన్ని గంటలు పనిచేయడం మినహా మరో దారి లేకుండా పోయింది.

సాంప్రదాయకంగా వస్తున్న పని విధానాన్ని పనికి ఇస్తున్న ప్రాధాన్యతపెరగడాన్ని గనక పోల్చి చూస్తే మనకీ విషయం అర్థం అవుతుంది. 2007-09 ఆర్థిక సంక్షోభం తర్వాత వారంలో పని గంటలు పెరిగినప్పటికీ అధికార లెక్కలప్రకారం పని గంటలు గత రెండు దశాబ్దాలుగా తగ్గినట్టు చూపబడు తున్నాయి. పాక్షిక ఉద్యోగులు పెరగడమే కాదు, పాక్షిక ఉద్యోగులు చేసే పని గంటలు పెరిగాయి. అంతేకాదు, 2010-2015 మధ్య పూర్తికాలం పని చేసే వారిలో 15 శాతం మంది వారంలో 48 గంటల కన్నా ఎక్కువ పనిచేస్తున్నారు. ఒక సర్వే ప్రకారం 2016 లో 27 శాతం కార్మికులు తమకు ఇష్టమైన దానికన్నా ఎక్కువ గంటలు పనిచేస్తున్నట్టు చెప్పారు. ఇది కార్మికుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుంది. 31 శాతం పని వారి వ్యక్తిగత జీవితానికి ప్రతిబంధకంగా ఉందని చెప్పారు. ఒంటరితనం అన్నది పని ప్రదేశానికి బయటకి సంబంధించిన విషయం మాత్రమే కాదు. పని ప్రదేశానికి సంబంధించిన విషయం కూడా.

2014లో బ్రిటిష్ కార్మికులలో 42 శాతంమంది పని ప్రదేశాలలో తమ తోటి పని చేసే వారిలో తమ దగ్గరి స్నేహితులు లేరని తెలియచేసారు. పని ప్రదేశాలలో కూడా ఒంటరితనాన్ని అనుభవిస్తునట్టు చెప్పుకున్నారు. వ్యక్తిగత సంబంధాలు పెంచుకోవడం కన్నా ఉత్పత్తిలో పాల్గొనడానికి ఎక్కువ సమయం కేటాయించడం "వ్యాపార సంస్కృతి" గా పిలవబడుతుంది. జాకెక్విలాన్ ఓల్డ్స్, రిచర్డ్ షెవార్స్ ఈ ధోరణిని కార్మికులు తామంతా తాము చేసుకున్న ఎంపికగా పరిగణిస్తున్నారు. ఇందువలన పెట్టుబడిదారీ వ్యవస్థను విమర్శించడానికి అవకాశం లేకుండా పోతుంది. నిజానికి ఈ వ్యాపార సంస్కృతి రావడానికి కారణం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ, అందులోని వ్యక్తిగతంగా ఎదగవలసిన అవసరం. ఓల్డ్స్, షెవార్స్ కూడా ఈ ధోరణి, కార్మిక మార్కెట్ నిర్మాణ క్రమంలో మార్పులు జరగడం ప్రతిబింబమని గుర్తించ నిరాకరించారు.

### ఎక్కువ పని చేయడం కార్మికుని ఎంపిక కాదు

పెట్టుబడిదారీ వ్యవస్థే వ్యక్తులు పని ఒత్తిడి తగ్గించుకుని,ఒంటరితనాన్ని దూరంచేసుకోడానికి అవసరమైన, ప్రేమను ఆప్యాయతలను పెంచుకుని మానవ సంబంధాలు మెరుగు పరుచుకునే అవకాశాలను తగ్గిస్తుంది. "ఒంటరిగా మిగిలిపోతామన్న భయం మనుషులను కనీస సామాజిక సంబంధాలను కొనసాగించేందుకు ప్రోత్సహిస్తుంది. ఫలితంగా అది మరింత అసంతృప్తికి దారితీస్తుందని" అంటున్నారు.

### సృజనాత్మకత కోసం వెతుకులాట

గుత్తపెట్టుబడిదారీ విధానానికి వినిమయం అంటే అదనపు విలువను కాజేసే ప్రక్రియ. పోటీ పెట్టుబడిదారీ వ్యవస్థలో పరిమాణం, గుణం ఆర్థికాభివృద్ధికి ఎంత ముఖ్యమో గుర్తించలేదు. ఉత్పత్తులకు మధ్య నున్న తేడాలను చూపే ప్రకటనలు, ప్రణాళిక ప్రకారం వస్తువులను పాతవి చేసే ప్రక్రియ, వినిమయ రుణాలు – ఇవన్నీ సరుకుల గిరాకీని పెంచేవే. అదే సమయంలో వినిమయ సరుకులను కొనే వారికీ కొదవ లేదు. పనిని పెంచుకోడంతోపాటు వినిమయాన్ని పెంచుకోవడం కూడా పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజల జీవితాలలో ముఖ్యమైన భాగం అవుతుంది. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ మానవశక్తి యుక్తులను ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఎలా ఉపయోగించుకుంటుందో చెప్పడానికి ఒక గొప్ప ఉదాహరణ అని ఫ్రామ్ అంటారు.

వినిమయ సరుకుల ఉపయోగం కన్నా వాటిని పొందడం తమ స్థాయి పెరగటానికి సూచనగా చూడడం మొదలయింది. ఇవి వినియోగదారుని స్థాయిని సూచించేవి అయ్యాయి. గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థలో వినిమయం భౌతిక మానసిక అవసరాలను తీర్చడం కంటే ఆ ఆలో చనలను జీర్ణించుకోవడం అయింది. "వినిమయం మనిషి శారీరక, ఇంద్రియ, రసాత్మక తృష్ణను సంతృప్తి పరిచేవిగా ఉండాలి అంటారు ఫ్రామ్. మన సంస్కృతిలో ఇటువంటి విధానం లేదు. వినిమయం అంటే కేవలం కృత్రిమంగా ప్రోత్సహించడం మాత్రమే. వినిమయం సృజనాత్మకత గుర్తింపుల మీద ఆధారపడితే దానికి అంతే ఉండదు. ప్రతిసారి సరుకు కొన్న ప్పుడు అది మరింత మెరుగుగా ఉంటే బాగుం టుందనిపిస్తుంది. ఎందుకంటే మనం వినియో గించినది కృత్రిమంగా మనచేత కొనిపించిన సరుకే. మన అవసరానికి ఆలోచనకు సరిగ్గా లేనప్పుడు మనం కొన్న సరుకులు మనం కావాలనుకున్నవి కావు. ఉత్పత్తిదారుడు తాను అమ్మాలనుకున్న సరుకులను మనకు ఇష్టమైనవిగా లేదా అవసరమైనవిగా అనిపించేట్టు చేస్తాడు. వ్యక్తి తనకు కావాలనుకున్న సరుకు లభ్యం అవ దం గాని తాను తన ఉహల కనుగుణంగాసృష్టిం చిన సరుకు వినిమయం అవడంగాని భ్రమలే.

గుత్త పెట్టుబడి దారుల ధనం సమాజంలో విస్తృత స్థాయిలో అసంతృప్తిని పెంచింది. అధికంగా వినిమయసరుకులను పోగుచేసుకోవడంలోనే మనిషి విలువ ఉండడమే అందుకు కారణం. పెట్టుబడిదారీ సమాజాలలోనే వినిమయం విపరీతంగా ఉంటుంది. బ్రిటన్ లో

అది మరింత ఎక్కువగా ఉంటుంది. అక్కడ అసమానతలు మరింత ఎక్కువ. మరిన్ని వినిమయ సరుకులు పోగుచేసుకోవాలనుకోవడం, వాటి వల్లే సమాజంలో గుర్తింపు వస్తుందను కోవడం వేదనకు కారణం. దాని ఫలితంగానే మిగిలిన అభివృద్ధి చెందిన దేశాలు స్పెయిన్తోనో స్వీడన్ తోనో పోల్చి చూసినప్పుడు బ్రిటన్ లో పిల్లల పట్ల శ్రద్ధ తక్కువగా ఉందని యూనిసెఫ్ 2007 లో జరిపిన పరిశోధనలో తేలింది.

సాంస్కృతిక వినిమయం, ఏ స్థాయి కుటుంబాలల్లోనైనా, ఆ మూడు దేశాలను పోల్చి చూస్తే బ్రిటన్లోనే ఎక్కువ. బ్రిటన్ లో తల్లిదండ్రులు మరింత ఎక్కువ భౌతికవాదులుగా ఉన్నారు. ఖరీదైన వస్తువులు కొనిస్తేనే తమ పిల్లలకు సమాజంలో స్థాయి ఉంటుందని నమ్ముతారు. పిల్లలు కూడా అలాగే అనుకుంటారు. అదే ఆందోళనకు వేదనకు దారితీస్తుంది. ముఖ్యంగా పేద పిల్లలలో ఖరీదైన వస్తువులు పొంద నందున తాము తక్కువన్న భావన కుంగదీస్తుంది. పెద్దల్లో కూడా ఎప్పటికప్పుడు కొత్త వస్తువులు కొని పెట్టడం తాహతను సూచిస్తుంది కానీ కొని ఇవ్వలేక పోతామేమోనన్న ఆందోళనకు తల్లి దండ్రులు కూడా గురవుతారు.

నిజానికి ఈ దేశాలన్నింటిలో కూడా పిల్లలు తమ తల్లి దండ్రులతో స్నేహితులతో సమయం గడపడానికి ఇష్టపడుతున్నారు. కానీ తల్లిదండ్రులు తమ పనుల ఒత్తిడిలో పిల్లలతో సమయం గడపలేక పోతున్నారు. పిల్లలను బయటకుతీసుకుని వెళ్లలేకపోతున్నారు. భద్రతా కారణంగా కనీసం పిల్లలనయినా బయటకు పంపలేకపోతున్నారు. వీటన్నిటికీ బదులుగా పిల్లలకు రకరకాల వస్తువులు కొనిపెడుతున్నారు. అయితే అవి పిల్లలకే మాత్రం సంతృప్తి నివ్వడం లేదు. అందువలన బ్రిటన్లో పిల్లల సృజనాత్మ కత అణచివేయబడుతున్నది. తల్లిదండ్రులల్లో అవసరమైనంత సాన్నిహిత్యం ఉండడం లేదు. వారు కొనిచ్చిన వస్తువులూ సంతృప్తికలిగించడంలేదు.

**వర్గపోరాటంలా ప్రతిఘటన**

మానసిక అనారోగ్యానికి కారణం శరీర నిర్మాణంలో లోపంకాదు, సమాజ నిర్మాణంలో లోపమే అని గుర్తించాము. గుత్తపెట్టుబడిదారీ విధానం మానసిక రుగ్మతలు నివారించడానికి కొన్ని కార్యక్రమాలు చేస్తుంటుంది. కానీ మానసిక రుగ్మతకు అసలు కారణమైన వ్యక్తిగత వాదం కొనసాగుతూనే ఉంటుంది. అందువలన ఇప్పుడున్న ఉత్పత్తి విధానాన్నే వ్యతిరేకించవలసి ఉంది. ఇప్పుడున్న అణచివేతదారులు మానసిక రుగ్మతల వైద్యనిపుణుల సలహాలు సూచనలను తమకు అనుగుణంగా మలచుకునే ప్రయత్నాలు

> **“ పెట్టుబడిదారీ సమాజమే మానసిక రుగ్మతలకు అసలు కారణం అని గుర్తించాలి. సామాజిక అసమానతలను సవాలు గా తీసుకుని ప్రశ్నించాలి. వర్గ ఉద్యమాలలో మానసిక ఆరోగ్య ఉద్యమాలకు ప్రాధాన్యతనివ్వాలి. పెట్టుబడిదారీ వ్యవస్థే మానసిక అనారోగ్యానికి అసలైన కారణమని ప్రజలను చైతన్యపరచాలి. మానసిక రుగ్మతలు సామాజిక సమస్య అని, జాతి వివక్ష, లైంగిక అణచివేత, ఆర్థిక అసమా నతలు “మానసిక వ్యాధి లక్షణాలు” అని అంటున్నారు. ”**

చేస్తున్నారు. వైద్యవిధానాలు కూడా పౌర హక్కులు తగ్గించే విధంగా లేదా తొలగించే విధంగా ఉంటున్నాయి. మానసిక రోగులకు నిర్ణయాలు తీసుకునే హక్కు లేకుండా పోతున్నది. పెట్టుబడి దారీ సమాజంలో మానసిక వేదన అనుభవి స్తున్నవారు మరింత అణచివేతకు వివక్షకు గురవుతారు. ఈ మానసిక వేదన నుండి బయట పడిన వారు ఈనాటి పెట్టుబడిదారీ సమాజం లోని వైద్య విధానాన్ని, పెట్టుబడిదారీ వ్యవస్థ వలన ఏర్పడ్డ మానసిక ఒత్తిడిని సవాలు చేస్తు న్నారు. వారందరు చేరి మార్క్సిస్టుల వలన ఉత్తేజం పొందిన సోషలిస్టు విధానాలను ప్రత్యా మ్నాయంగా అమలు చేయాలనీ ఒత్తిడి చేస్తు న్నారు. మానసిక రుగ్మతలకు కారణం పెట్టుబడి దారీ వ్యవస్థ నిర్మాణంలోనే ఉందనిసోషలిస్టు విధానం నమ్ముతున్నది. ప్రజలను కార్మిక మార్కెట్ నుండి విడదీసినందువలన మానసిక ఒత్తిడులకి గురవుతున్నారని చెపుతున్నది. అందువలన మానసిక ఆరోగ్యం పొందడానికి, భౌతికంగా అనవసరమైన సరుకులు పొంద డానికి తాపత్రయ పడనవసరం లేదని ప్రజలకి వివరించాలి. అణచివేత గురించి తెలియ చేయాలి. రాజకీయ వెలివేత ఒక ముఖ్యమైన కారణంగా కూడా గుర్తింపచేయాలి.

2017 లో బ్రిటన్లోని మానసిక ఆరోగ్య కార్యాచరణ గ్రూప్ అయిన నేషనల్ సర్వైవర్ యూజ ర్ నెట్వర్క్, వైద్య విధాన నమూనాని నిర్ద్వంద్వంగా తిరస్కరించి, సామాజిక న్యా యాన్ని తన ప్రచార కేంద్ర బిందువుగా పెట్టు కుంది. సామాజిక న్యాయం కేంద్రంగా పెట్టుకున్నందు వలన నయా ఉదారవాద విధానాలు మానసిక ఆరోగ్యానికి పనికిరావని తేల్చింది. సామాజిక రక్షణలో కోతలు, పొదుపు చర్యలు పాటించడం వలన సమాజంలో మానసిక రుగ్మతలు పెరిగాయని గుర్తించింది. సమాజంలో అసమానతలు మానసిక రుగ్మతలకు మూల కారణంగా పేర్కొంది. సమాజంలో పెరుగుతున్న అసమానతలను గర్హించింది. “పొదుపు చర్యలు ఆర్థిక విధానాలను చెడగొడ తాయి. సామాజిక వివక్షను పెంచుతాయి. సమాజ నిర్మాణంలో ఏర్పడ్డ అసమానతలు ప్రజలకు నష్టం కలిగిస్తాయి. అందుకని సామాజిక న్యాయం కోసం పనిచేసే క్రమంలో ఈ విధానాలను మనం తిరస్కరించాలి. వర్గ పోరాటంలో మానసిక ఆరోగ్య ఉద్యమం ఒకభాగం కావాలి. పెట్టుబడిదారీ సమాజమే మానసిక రుగ్మతలకు అసలు కారణం అని గుర్తించాలి. సామాజిక అసమానతలను సవాలుగా తీసుకుని ప్రశ్నించాలి. వర్గ ఉ ద్యమాలలో మానసిక ఆరోగ్య ఉద్యమాలకు ప్రాధాన్యతనివ్వాలి. పెట్టుబడిదారీ వ్యవస్థే మానసిక అనారోగ్యానికి అసలైన కారణమని ప్రజలను చైతన్య పరచాలి. మానసిక రుగ్మతలు సామాజిక సమస్య అని, జాతి వివక్ష, లైంగిక అణచివేత, ఆర్థిక అసమా నతలు “మానసిక వ్యాధి లక్షణాలు” అని అంటు న్నారు. మైనారిటీ జాతులు మరింత ఎక్కువగా సామాజిక,ఆర్థిక అసమానతలకు, దురభిమానా లకు గురవుతుంటారన్నది ఆయన వాదన.

పెట్టుబడిదారీ వ్యవస్థ ఎన్నటికీ మానసిక ఆరోగ్యాన్ని అందించలేదు. అణచివేత, దోపిడీ, అసమానతలు మానవత్వం అంటే ఏమిటో తెలియకుండా చేస్తాయి. మానసిక ఆరోగ్యానికై పెట్టుబడిదారీ వ్యవస్థ పాశవిక దాడిని వ్యతిరేకిం చడం, సోషలిజం కోసం, అంటే మానసిక అవసరాలతో సహా తీర్చుకోడానికి జరిగే వర్గ పోరాటాలు కేంద్ర బిందువుగా ఉండాలి. సమాజంలోని మానవులందరు పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావంతో నష్టపోతున్నవారే. నెమ్మది గానైనా పట్టుదలతో అణగారిన, దోపిడీకి గురైన వారు ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడు తున్నారు. అందుకని మానసిక ఆరోగ్యం కోసం జరిగే పోరాటం విస్తృతంగా సామాజిక న్యాయం కోసం సమానత్వం కోసం ఆత్మాభిమానం కోసం, గౌరవం కోసం జరిగే పోరాటాలలో భాగంగా చూడాలి. ఈ సవాలును స్వీకరించి పోరాడాలి.

# కనీస వేతనాలు సామాజిక న్యాయం

టికె రాజాలక్ష్మి



రచయిత
ప్రముఖ పాత్రికేయురాలు

కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ నియామకం జరిగింది. జాతీయ కనీస వేతనం నిర్దేశించడం ఈ కమిటి లక్ష్యం. అయితే 7వ పే కమీషన్ నిర్దేశించిన కనీసం వేతనం కన్నా అతితక్కువ వేతనం నిర్ణయించటం గమనార్హం.

సరిహద్దుల్లో యుద్ధవాతావరణం ముగిసిన మరునాడు, అనగా ఫిబ్రవరి 27న జరిగిన "నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్"నుద్దేశించి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగించారు. ఆ సందర్భంగా యువత "మల్టీ టాస్కింగ్"లో సాధించాల్సిన నైపుణ్యత గూర్చి చెబుతూ యువత అంతా వోటర్లుగా నమోదు చేయించుకోవాలని కోరారు. అంతేగాక గత నాలుగు సంవత్సరాలుగా ఆయన ప్రభుత్వం సాధించిన ఘనతను పదేపదే ప్రస్తావించారు. లోక్‌సభలో తమ పనిని ప్రతిపక్షం అడ్డుకొంటుందని, దిగువ సభలో బిల్లు పాసయినా, తమ ఆలోచనలు ఆచరణలోకి రావడం లేదని ఆయన పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలలో యువతను ఓటు బ్యాంకుగా భావించి, రాజకీయ ప్రసంగం చేశారు తప్ప ఉపాధి కల్పన గూర్చి గానీ, హుందాతనాన్నిచ్చే జీతాల గూర్చి గానీ ప్రస్తావించనే లేదు.

కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ వారు నియమించిన కమిటీ, తమ నివేదికను వెల్లడించింది. కమిటీవారు సూచించిన ప్రతిపాదనలు. శ్రామిక వర్గానికి ఆశనిపాతంగా ఉన్నాయి. ప్రజాసంఘాలు దీనికి కొనసాగింపుగా మనం స్వీకరించాల్సిన మరొక ఆసక్తికర అంశం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మార్చి 5న చేసిన ప్రకటన. అసంఘటిత రంగ కార్మికులకు 'ఫించను పథకం' ప్రకటించిన మోడీ, వారికి గౌరవప్రదమైన కనీస వేతనాన్ని గూర్చి ప్రస్తావించకపోవడం గమనార్హం.

2018వ సంవత్సరం జనవరిలో నియమింపబడిన కమిటీ ప్రధాన కర్తవ్యం న్యాయబద్ధమైన, సహేతుకమైన కనీస వేతన విధివిధానాలను నిర్ణయించడం, తద్వారా సమాజంలో వివిధ రంగాలలో శ్రమ చేస్తున్న శ్రామిక వర్గాల జీవితాలకు కనీస భద్రతను అందించడం. అయితే గత రెండు దశాబ్దాలలో ఎన్నడూ లేనంత తక్కువ వేతనా లను కమిటీ నిర్ణయించింది. వేతన వ్యత్యాసం కూడా చాలా హెచ్చుగా ఉండి, వేతనం పెంచే దిశగా కాకుండా తగ్గించే దిశగా సూచనలు చేయడం శోచనీయం.

7వ వేతన సంఘం సిఫార్సులను కూడా పరిగణనలోకి తీసుకోకుండా, వారు నిర్ణయించిన కనీస వేతనం కన్నా తక్కువ సూచించడం ఆలోచించాల్సిన అంశం. నిరుద్యోగం పెరుగుతున్నా, నూతన ఉపాధి కల్పన దిశగా ప్రత్యామ్నాయం నెలకొల్పకుండా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం.

అన్ని విభాగాలలోనూ వేతనాల మధ్య వ్యత్యాసం ఉందని, ముఖ్యంగా ప్రాంతాల వారీగా, రంగాల వారీగా ఈ అంతరం పెరుగుతుందన్నది నివేదిక పేర్కొన్న అంశాలలో ప్రధానమైనది. అయితే "జాతీయస్థాయిలో కనీస వేతనం ఎంత? అన్నదానిని కమిటీ సూచించకపోవడం ప్రమాదకరం.

1948లో నియమింపబడి, గత 7 దశాబ్దాలుగా కొనసాగుతూ ఉన్న "సెంట్రల్ ఎడ్వైజరీ కౌన్సిల్" కార్మికసంఘాలు నాయకత్వాలను సంప్రదిం చకుండానే, ఏకపక్ష నిర్ణయాలు చేయడం. అయితే, ఈ కమిటీ కొత్తగా మూడు నిర్వచనాలను ఇచ్చింది.

అవి: 1. కనీస వేతనం
2. న్యాయమైన వేతనం
3. జీవన వేతనం

జీవన వేతనమనగా, కార్మికులకు, వారి కుటుంబాలకు ఆహారం, గూడు నీడలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వారి పిల్లల విద్య, ఆరోగ్య, పరిరక్షణలకు ఆదాయం, జీవిత బీమా, వృద్ధాప్యానికి ఆసరాగా ధనం ఇవన్నీ కలిగి ఉండటానికి సరిపడా వేతనం. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, ఏ ప్రభుత్వం కూడా ఈ దిశగా తమ కార్మిక వర్గానికి కనీస వేతనాన్ని నిర్ణయించకపోవడం. కుటుంబం పరిణామాన్ని బట్టి, మనిషి రోజుకు తీసుకోవలసిన కనీస కేలరీలకు సరిపడా ఆదా యాన్నికూడా అందించలేకపోవడం గమనార్హం.

1948 వ సంవత్సరంలో కమిటి కనీస జీతానికి, న్యాయమైన జీతానికి మధ్య స్పష్టమైన గీత గీసి తదనుగుణంగా, కార్మికులకు కనీస వేతనం నిర్ణయించకపోవడం. కనీస వేతనమనేది కార్మికుల శక్తి సామర్థ్యాలను వృద్ధి చేసేదిగా, అతని, ఆమె బిడ్డల విద్యను, వైద్య అవసరాలను, ఇతర కనీస అవసరాలను తీర్చేదిగా ఉండాలి. కానీ వివిధ పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు ఈ విధంగా నిర్ణయించ లేదు. కారణం. కనీస వేతన చట్టం ప్రకారం గానీ, లేదా కార్మికుల అభిప్రాయాలతో గానీ నిమిత్తం లేకుండానే కనీస వేతనాలను నిర్ణయిం చడం జరిగింది.

ఆ రోజునున్న వేతన బోర్డులకు, ఒక స్థిరమైన హోదానివ్వాలని సూచించి, ఆనాటి పార్లమెంట్ ఆమోదం కూడా పొందింది. అయితే, న్యాయమైన వేతనాల బిల్లు మాత్రం పాస్ అవ్వలేదు. అమలులోకి రాలేదు. ఇది మరీ ముఖ్యంగా ఫ్యాక్టరీ కార్మికుల విషయంలో, గని కార్మికుల విషయంలో అమలులోకి రాలేదు. 1978వ 1991 సంవత్సరాలలో ఆనాటి ప్రభుత్వాలు నియమించిన రెండు కమిటీలు కూడా జాతీయ కనీస వేతనాన్ని నిర్ణయించాయి కానీ విధివిధానాల విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి.

ఒక కమిటీ మాత్రం "కనీస వేతన చట్టం కార్మికుల అవసరాలన్నీ తీర్చేదిగా ఉండాలని, ఆఖరి మెట్టుపై నున్న కార్మికుల అవసరాలు సైతం తీర్చే విధంగా ఉండాలని పేర్కొంది.

1991వ సంవత్సరంలో "నేషనల్ కమీషన్ ఆన్ రూరల్ వేజెస్" వారి నిర్వచనం ప్రకారం

కార్మికుల కనీస జీతం కుటుంబంలో ముగ్గురు పెద్దల అవసరాలను తీర్చే విధంగా ఉండాలి. ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎం ఆర్) వారు అందించిన గ్రామీణ ప్రాంత, పట్టణ ప్రాంత ప్రజల కనీస కేలరీల అవసరాల లెక్క ప్రకారం వేతనాలు నిర్ణయిం చారు. "వేతన విధి విధానాలను" రూపొందిం చడంలో ప్లానింగ్ కమీషన్ వారి విధి విధానాలు, పంచ వర్ష ప్రణాళికలు నిర్దేశించిన కనీస అవసరాలు, కార్మికుల హక్కుల పరిరక్షణ నిమిత్తం ఏర్పడిన సంఘాల డిమాండ్లు కూడా ఉన్నాయి.

**"కనీస వేతనాలు నిర్ణయించడానికి అవసరమైన ప్రమాణాలను రూపొందించాలి. వీటిని అమలుపరచడంలో ఎవరైనా విఫలమ య్యినట్లయితే వారి నుండి పరిహారం వసూలు చేయాలి.పైన నిర్దేశించిన కేలరీల ప్రమాణాలను ఆర్థిక విలువలోకి మార్చి వేతన నిర్ధారణ జరగాలి. 2700 కేలరీలు కేవలం కనీస అవ సరం మాత్రమే. శారీరకంగా అధికశ్రమ చేసే కార్మికులకు అధిక కేలరీలు అందే విధంగా వేతన నిర్ణయం జరగాలి."**

ప్రథమ పంచవర్ష ప్రణాళిక నుండి 7వ పంచవర్ష ప్రణాళిక వరకూ, ప్రణాళికా సంఘం, దేశంలో పారిశ్రామిక ఉత్పత్తులు పెరగాలని, కార్మికులశక్తి సామర్థ్యాలు ఉత్పత్తిని పెంచే దిశగా ఉండాలని, కనీస వేతనాలను పెంచటానికి అను కూలంగా నిర్ణయాలు తీసుకుని, సమాన పనికి సమాన వేతనం, మౌలిక వసతుల అభివృద్ధి, కటుంబ అవసరాలకు అనుగుణమైన వసతులు కల్పించింది. 8వ, 9వ పంచవర్ష ప్రణాళికలలో స్పష్టమైన వ్యత్యాసం గోచరించింది. అదే హైర్ అండ్ ఫైర్ విధానంతో కార్మిక అనుకూల విధానాలు పోయి వ్యతిరేక విధానాలు ప్రారంభ మయాయి. కార్మిక సంస్కరణలు, సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి చేయడంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడం జరిగింది. పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యం, కార్మికులకు వేతనాలు చెల్లించడంలో వారి సమర్థత పేరుతో వేతన పెంపుపై పరిమితులను విధిస్తున్నారు.

1948వ సంవత్సరంలో యునైటెడ్ ప్రావిన్స్ లేబర్ ఎంక్వైరీ కమిటీ" తమిళనాడులోని "కూనూర్"ఉన్న "న్యూట్రిషన్ రీసెర్చి లేబొరేటరీ " వారిని అతి తక్కువ శాఖాహార పోషకాహారం" విలువను లెక్కించమని కోరింది. ఒక మనిషికి రోజుకు 2700 కేలరీలుండాలి. వాటిలో పాలు, పంచదార, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు బెల్లం ఉండాలి. కార్మికుల జీతాల నిర్ణయం సమయం లో ఆహార పదార్థాలకు ఎంత, అదనపు అవసరా ల కోసం ఎంత అవసరమన్నది చర్చల్లో నిర్ణయిం చటానికి వారి సలహాలు స్వీకరించడం జరిగింది.

డైరెక్టర్ ఆఫ్ డిపార్టుమెంట్ ఆఫ్ న్యూట్రిషన్ యునైటెడ్ నేషన్స్ ఫుడ్, అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్‌లు ఈ ఆహార ప్రమాణాలను నిర్ణయించాయి. వీటితో పాటుగా ముగ్గురు వ్యక్తులు బతకటానికి అవసరమైనంత మొత్తాన్ని కార్మికుడి జీతంగా నిర్ణయించాలి. ఆహారంతో పాటు ఒక్కో కుటుం బానికి సంవత్సరానికి 65.8 మీటర్ల దుస్తులు, ప్రభుత్వం నిర్ణయించిన కనీస గృహవసతికి అద్దె చెల్లించటం, 20 శాతం జీతం ఇంధనం, ఇంట్లో వెలుగునిచ్చే కరెంటు బిల్లు లాంటివాటి కోసం కేటాయించాలి. కార్మికులు ఈ అవసరాలు తీర్చుకోవటం కోసం ఎలాంటి ఇబ్బందులకు లోనవ్వకుండాఉండేలా వేతన నిర్ణయం జరగాలి.

**వేతన నిర్ణయానికి ప్రమాణాలు**

కనీస వేతనాలు నిర్ణయించడానికి అవసరమైన ప్రమాణాలను రూపొందించాలి. వీటిని అమలుపరచడంలో ఎవరైనా విఫలమ య్యినట్లయితే వారి నుండి పరిహారం వసూలు చేయాలి. పైన నిర్దేశించిన కేలరీల ప్రమాణాలను ఆర్థిక విలువలోకి మార్చి వేతన నిర్ధారణ జరగాలి. 2700 కేలరీలు కేవలం కనీస అవ సరం మాత్రమే. శారీరకంగా అధికశ్రమ చేసే కార్మికులకు అధిక కేలరీలు అందే విధంగా వేతన నిర్ణయం జరగాలి.

1992వ సంవత్సరంలో "ఇంటర్నేషనల్ లేబర్ కాన్ఫరెన్స్" ఓ హెచ్చరిక చేసింది. అదేమనగా వాస్తవ పరిస్థితులకు వ్యతిరేకంగా కనీస వేతనాలు నిర్ణయించడం జరుగుతున్నదని, నయా ఉదారవాద ఆర్థిక విధానాల వలన ఈ పరిస్థితి ఏర్పడిందని తెల్చింది. కార్మికుల పట్ల వ్యతిరేక భావంతో ప్రభుత్వాలుండడటం ఈ పరిస్థితికి ప్రధాన కారణం. 1992వ సంవత్స రంలో కార్మికులు, రాష్ట్రకోస్, బ్రెట్ అండ్ కో మధ్య నడిచిన న్యాయ వివాదంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం 15వ ఇంటర్నేషనల్ లేబర్ కౌన్సిల్ 1951లో నిర్దేశించిన ప్రమాణా లను కనీస వేతన అమలులో ఖచ్చితంగా పాటించి తీరాలి. పిల్లల చదువు, వైద్య అవసరా లు, కనీస వినోదం, పండగలు, ఉత్సవాలు జరుపుకోవడానికి అవసరమైన ఖర్చును, వృద్ధాప్యానికి ఆసరాగా ఫించను పథకాలు, బిడ్డల వివాహాలకయ్యే ఖర్చు లాంటివి కార్మికు లు భరించుకునే దిశలో వేతనాలు నిర్ణయించా లని తీర్పునివ్వడం గమనార్హం.

మరొక కేసు విషయంలో సైతం సుప్రీం కోర్టు తీర్పు కార్మికులకు అనుకూంగానే ప్రకటిం చింది. "కనీస వేతనం కార్మికుల చట్టబద్ధహక్కు అని" ఏ పరిశ్రమ అయినా తనకార్మికులకు చట్టబద్ధమైన కనీస వేతనం చెల్లించాల్సిందేనని, అంతకన్నా తక్కువ చెల్లించడం చట్టవ్యతిరేకమే గాక, కార్మికులను బలవంతంగా పనిచేయిం చడమే అవుతుంది.

6వ, 7వ ప్రణాళికాసంఘాలు, ఇంటర్నేషనల్ లేబర్ కౌన్సిల్ వారి నిర్ధారించిన రీతిగానే కనీస వేతనాలు నిర్ణయించారు. 2015వ సంవత్స రంలో, విడుదలైన 7వ వేతన సంఘం సైతం, 1957సంవత్సరంలో ఐఎల్‌సి నిర్దేశించిన ప్రమాణాలే అత్యుత్తమమైనవని, ఆరోగ్యకరమైన హుందాపూరిత జీవితానికి ఆచరణీయమైన కనీస వేతనం ఉండాలని అందుకే 18000/ -రూ. కనీసం మొత్తంగా నిర్ణయించడం

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**"ఆహార పదార్థాలకు సరిపడా ద్రవ్యవిలువను నిర్ధారించడంపై చర్చ నేటికీ కొనసాగుతూనే ఉంది. 15వ ఐఎల్‌సి నిర్దేశిత సూత్రాల ప్రకారం, పోషకాహార నిపుణులుగా 30 సంవత్సరాల అనుభవమున్నవారు 2700 కేలరీలు నిర్దేశించగా సుప్రీం కోర్టు అంగీకరించింది. చిత్రమైన విషయమేమంటే రెండవ వేతన సంఘం 2,600 కేలరీలు చాలనగా, 2019లో నిపుణుల కమిటీ మరింత దిగజారి కనీస వేతన లెక్కింపుకోసం 2400 కేలరీలు చాలనడం."**



వేతనాల పెంపుదల కోసం పోరాడుతున్న మహిళా కార్మికులు

జరిగింది. ఆహార పదార్థాలకు సరిపడా ద్రవ్యవిలువను నిర్ధారించడంపై చర్చ నేటికీ కొనసాగుతూనే ఉంది. 15వ ఐఎల్‌సి నిర్దేశిత సూత్రాల ప్రకారం, పోషకాహార నిపుణులుగా 30 సంవత్సరాల అనుభవమున్న వారు 2700 కేలరీలు నిర్దేశించగా సుప్రీం కోర్టు అంగీకరించింది. చిత్రమైన విషయమేమంటే రెండవ వేతన సంఘం 2,600 కేలరీలు చాలనగా, 2019లో నిపుణుల కమిటీ మరింత దిగజారి కనీస వేతన లెక్కింపుకోసం 2400 కేలరీలు చాలనడం.

"ది ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ఇండియా" వారి 2018 వార్షిక నివేదిక దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలోనున్న కనీస వేతనాల మధ్యనున్న వ్యత్యాసాలను, స్పష్టంగా సాక్ష్యాలతో సహా వెల్లడించింది. దేశవ్యాప్తంగా చట్టబద్ధంగా చెల్లించాల్సిన కనీస మొత్తాలకన్నా ఎంత తక్కువగా చెల్లింపులు జరుగుతున్నాయో స్పష్టంగా విశదీకరించారు. ఈ విషయంలో ఓ ప్రచారం ప్రజలలో ప్రబలంగా నాటుకుని ఉంది. అదేమనగా భారతీయులు అధికంగా తిండి తింటారని" తినాల్సిన సరైన పోషకాహారం బదులు, అనవసర ఆహారం తీసుకుంటారని, శారీరక శ్రమ తక్కువ చేసేవారికి తక్కువ కాలరీల ఆహారం వారికి అవసరమన్నది.

వివిధ రకాల పండ్లు, పాలు, పప్పు ధాన్యాలు, కాయగూరలు లాంటివి. కార్మికుల ఆహారంలో అధికంగా కనిపించవు. కొనుగోలు చేయగలిగే ఆర్థిక స్థోమత లేకపోవడం, ఆ స్థాయిలో ఖర్చుపెట్టుకోగలిగే జీతాలు కార్మికులకు లభించకపోవడం ప్రధాన కారణం, ప్రధానంగా ఈ అంశాన్నే దృష్టిలో ఉంచుకుని మోల్ కమిటీ తక్కువ కాలరీల ఆహారాన్ని సూచించింది. తద్వారా తక్కువ జీతాలను పరిగణనలోకి తీసుకోవటం కూడా జరిగింది. అంతేగాక ప్రస్తుతమున్న జనాభా లెక్కలు, ముఖ్యంగా కార్మికుల సంఖ్య. వారి కుటుంబ పరిమాణం ఆధారంగా, సమాజంలోని భిన్న వర్గాలను, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని, మరీ ముఖ్యంగా "ఎంప్లాయిమెంట్ ఆండ్ అన్ ఎంప్లాయిమెంట్ సర్వే 2011-12 ఆధారంగా ఒక మనిసికి ఒకరోజుకి 2400 కేలరీల ఆహారం అవసరమని సూచించడం జరిగింది.

"వినియోగదారుల ద్రవ్య వినియోగంపై ఇటీవల కాలంలో ఓ సర్వే జరిగింది. ప్రజలు, కార్మికులు ఎలాంటి పోషకాహారం తీసుకుంటున్నారు? ఆహారంపై ఖర్చు ఎంత? ఆహారేతర అవసరాలపై ఎంత? అన్న రెండు అంశాలను ప్రధానంగా తీసుకుని ఒక వ్యక్తికి రోజుకి 375/- రూ., నెలకు 9750 రూపాయలు గాను నిపుణుల కమిటి నిర్ధారించింది. వీటికి తోడుగా పట్టణ ప్రాంత ప్రజలకు రూ. 1430/- ఇంటి అద్దెగా నిర్ధారించింది.

వీటితోపాటు కమిటీ మరికొన్ని సూచనలు చేసింది. వినియోగ వ్యయం గతంలో ముగ్గురు వ్యక్తులుగా వుండగా దానిని 3.6 వ్యక్తులుగా పెంచడం, కేలరీలు తగ్గించాలని నిర్ణయించడం అంటే మనిషి జీవితానికి ముఖ్యమైన ఆహార పరిమాణం తగ్గించడం. ఇతరత్రా వ్యయాలు పెంచడం అన్నమాట. దీని వీరు చూపిన ఆధారం" జాతీయస్థాయిలో తీసుకునే ఆహార పదార్థాల పరిమాణం కన్నా, పోషకాహార విలువలున్న తక్కువ పరిమాణం ఉన్న ఆహారాన్ని తీసుకోవడం. వాస్తవానికి వర్తమాన భారతంలో 40 శాతం బాలలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఐదేళ్లలోపు బాలలు 21శాతం మంది మరింత తీవ్రస్థాయిలో పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఇలాంటి తరుణంలో వారి చిన్నారులకు పోషకాహార అవసరాలను తీర్చే విధంగా కార్మికులకు వేతనం చెల్లించకపోవడం దేశసమస్యగా పరిణమిస్తుంది. దీనికి ప్రభుత్వమే కారణం అవుతుంది.

సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి "తపన్‌సేన్" కేంద్ర కార్మికశాఖకు రాసిన లేఖలో "నిపుణుల కమిటీ నివేదికలోని సిఫార్సులు కార్మికులను, ట్రేడ్ యూనియన్ ఉద్యమాలను వెర్రివాళ్లను చేసే విధంగా ఉన్నాయని చెప్పారు. ఐఎల్‌సి 1957 మార్గదర్శక సూత్రాలను, 1992లో సుప్రీంకోర్టు "వర్క్‌మెన్ రాపొర్టకోస్, బ్రెట్ అండ్ కో వారి తీర్పును పరిగణనలోకి తీసుకుంది.

"ఎడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ది ఢిల్లీ గవర్నమెంట్ వారు ప్రకటించిన రూ. 14000 లెక్కను పరిగణించలేదని పేర్కొన్నారు.

అంతేగాక కమిటీ సూచనలలో, ప్రతి కుటుంబం 3.6గురు వ్యక్తులుగా పరిగణనలోకి తీసుకున్నప్పుడు సహజంగా కనీస వేతనం వృద్ధి చెందాలని, దానికి భిన్నంగా 1957లోని ముగ్గురు వ్యక్తుల లెక్కనే ఎలా స్వీకరిస్తారని ప్రశ్నించారు. కార్మికులు జీవన ప్రమాణాలు పెరిగే రీతిగా కమిటీ నివేదిక ఉండాలి తప్ప, వ్యాపారస్థుల వ్యాపారం మరింత సులభంగా వృద్ధి చెందేలా ఉండకూడదని. కమిటీ సూచనలను సిఐటియు తిరస్కరిస్తున్నదని కనీస వేతనం రూ. 18000 ఉండాలని పెరుగుతున్న ధరల సూచికనుగుణంగా వేతన నిర్ధారణ జరగాలని పేర్కొన్నారు.

కేరళలాంటి రాష్ట్రాలలో కార్మికుల కనీసవేతనాలు, కమిటి సూచనల కన్నాపై స్థాయిలోనే ఉన్నాయని కమిటీ సూచనలు వాస్తవానికి యజమానులకనుగుణంగా ఉన్నాయని, వాస్తవ పరిస్థితులకు దూరంగా వేతనాలుండగూడదని, 3.6గురు వ్యక్తుల ప్రాతిపదికగా వేతన పరిగణన జరగాలని పేర్కొన్నారు.

**అనువాదం: డాక్టర్ శమంతకమణి.**

# 'రైనిష్ జీటుంగ్' పత్రిక సంపాదకుడుగా కారల్ మార్క్స్

ఎం శివరామకృష్ణన్

తత్వశాస్త్రంలో డాక్టరేట్ సాధించిన కారల్ మార్క్స్ ప్రొఫెసర్ కావాలని ప్రయత్నించాడు. ఫెడరిక్ విలియమ్ IV రాజు పత్రికా స్వేచ్ఛకు వ్యతిరేకమే కాకుండా, ప్రజాస్వామ్య హక్కులను అణిచివేసే క్రూరమైన వ్యక్తి. విమర్శలను సైతం భరించలేడు. ఫెడరిక్ విలియమ్ ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షంగా ఉన్న గ్రూపు సభ్యుల విశ్వాసాన్ని, గౌరవాన్ని అబద్దాలతో పక్కదారి పట్టించాడు.

ఫెడరిక్ విలియమ్ ఆదేశాలతో ఉదార వాద ప్రభుత్వం యంగ్ హెగెలియన్ గ్రూపులో కీలక వ్యక్తిగా ఉన్న బ్రూనో బాయర్న్ తొలగించింది. ప్రష్యా రాజు నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య స్వేచ్ఛ, హక్కులు కావాలని డిమాండ్ చేస్తూ కారల్మార్క్స్ సహా యంగ్ హెగెలియన్ గ్రూప్ సభ్యులందరూ నిరసన గళాన్ని వినిపించారు. ఈ పూర్వరంగం లోనే రైన్ ప్రావిన్స్‌లో ఉన్న పెట్టుబడిదారులు రాజుకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య హక్కుల సాధన కోసం "రైనిష్ జైటుంగ్" పత్రికను ప్రారంభించారు. పత్రిక నిర్వహణకు కావాల్సిన డబ్బును పెట్టుబడుదారులు సమకూర్చారు. పత్రిక రోజు వారీ నడక కోసం యంగ్ హెగెలియన్స్ సహాయం కావాలని పత్రిక యజమానులు కోరారు. "రైనిష్ జైటుంగ్" పత్రికకు క్రమం తప్పకుండా వ్యాసాలను అందించడానికి మార్క్స్ అంగీకరించాడు. రైన్ ప్రావిన్స్ అసెంబ్లీ కార్యకలాపాలపై మార్క్స్ రాసిన మొదటి వ్యాసం మే సంచికలో ప్రచురించబడింది.

1842 అక్టోబరులో రైనిష్ జైటుంగ్ పత్రిక సంపాదకత్వ బాధ్యతలను మార్క్స్ స్వీకరించాడు. పత్రిక ఎడిటర్‌గా నియామకంతో మార్క్స్‌లో ఉన్న ప్రతిభ, పత్రిక నిర్వహణ సామర్థ్యాలు, విప్లవాత్మక ప్రజాస్వామ్య భావాలు, తత్వశాస్త్రంపై అతనికున్న పట్టు బయట ప్రపంచానికి తెలిసింది. ప్రావెన్స్‌లోని వివిధ ప్రాంతాల నుండి పత్రికకు సహాయపడి గలిగే కంట్రిబ్యూటర్లను మార్క్స్ ఏర్పాటు చేశాడు. పత్రికకు సహాయపడే వ్యక్తుల్లో బెర్లిన్‌లో నిర్బంధ సైనిక శిక్షణలో ఉన్న ఫెడరిక్ ఏంగెల్స్ కూడా ఉన్నారు. ప్రారంభంలో ఏంగెల్స్ బెర్లిన్ నుండి కథనాలను పత్రికకు పంపించాడు. ఏంగెల్స్ సైనిక శిక్షణను పూర్తి చేసుకొని బార్మెన్ తిరిగి వచ్చిన తర్వాత కొలెన్లో ఉన్న "రైనిష్ జైటుంగ్" పత్రిక కార్యాలయాన్ని సందర్శించి మార్క్స్‌ను కలుసుకున్నారు. ఉత్సాహపూరితమైన వాతావరణంలో వారిద్దరూ అభిప్రాయాలను పంచుకున్నారు. బార్మెన్ నుండి కొలెన్ వచ్చిన వెంటనే ఏంగెల్స్ పత్రికకు సహాయపడటం ప్రారంభించాడు.

విప్లవాత్మక ప్రజాస్వామ్య భావాలు పత్రికలో ప్రతిబింబించే విధంగా మార్క్స్ పత్రికను తీర్చిదిద్దాడు. మార్క్స్ చాలా ప్రాధాన్యత కల్గిన కథనాలు, వ్యాసాలను పత్రిక కోసం రాసారు. ఎస్టేట్స్ ఆఫ్ అసెంబ్లీలో ప్రజాస్వామ్య చర్చలు, అసెంబ్లీ కార్యకలాపాల ప్రచురణ, స్థానిక ఎన్నికల్లో ప్రాంతీయ అసెంబ్లీకి ప్రతినిధుల ఎంపిక, విడాకుల చట్టం, న్యాయవ్యవస్థలో చరిత్ర సంబంధమైన శాస్త్రీయమైన పత్రము, కోలినిష్ జీటుంగ్ మతతత్వ సంస్కరణలు, ఆగ్స్బర్గ్ పత్రిక వివాదాస్పద ఎత్తుగడలు, న్యాయశాస్త్రంలో ఉన్న లసుగులపై రైన్, మోసెల్ జీటుంగ్ చర్చలు, మోసెల్కి సమాధానాలు అందులో ముఖ్యమైనవి. కోలినిష్ వార్తాపత్రికలో మార్క్స్ మొట్టమొదటి సారిగా తత్వశాస్త్రం గురించి మార్క్స్ తన ఆలోచనను వ్యాసంలో వివరించాడు. మార్క్స్ విప్లవాత్మక ప్రజాతంత్ర ఆలోచనలతో పత్రికకు శ్రీకారం చుట్టారు. మార్క్స్ విప్లవాత్మక ప్రజాతంత్ర ఆలోచనలతో ఈ పత్రికకు శ్రీకారం చుట్టారు. సంస్థానాల చట్టసభలు – పత్రికా స్వాతంత్ర్యం పై చర్చ, ప్రాంతీయ శాసన సభకు ప్రతినిధుల ఎంపిక, విడాకుల చట్టం, న్యాయ శాస్త్రానికి సంబంధించిన చారిత్రక వాదనలు – దాని తాత్విక ప్రణాళిక, కొల్నచ్చే జీటింగ్ లో సామాజిక సంస్కరణలు, ఆగబర్గ్ పత్రికలో వాద ప్రతివాద ఎత్తుగడలు, రైన్, మోజెల్ జీటుంగ్, వంట చెరుకు దొంగతనం నియంత్రణ చట్టం పై చర్చ, మోజెల్ విలేకరి సమర్థింపు వంటి అనేక వ్యాసాలు రాశారు మార్క్స్.

'చెట్ల దొంగతనాల చట్టంపై మార్క్స్ రాసిన వ్యాసం జీవితంలో మలుపు తిప్పిన ముఖ్యమైన వ్యాసం. ఈ వ్యాసాన్ని ఆసరా చేసుకొని 1842 అక్టోబరులో రైన్ ల్యాండ్ అసెంబ్లీలో చెట్ల దొంగతనాల చట్టాన్ని తీసుకువచ్చారు.

సమకాలీన మేధోమధన సారాంశమే తాత్విక చింతన. అందువల్ల ఏ తాత్విక చింతనైనా అంతర్గతంగా వస్తుపరంగానే కాక (విషయపరంగానే కాక) బాహ్య రూపంగా కూడా సమకాలీన ప్రపంచంతో తార్కిక సంబంధం కలిగి ఉండేదుకు తగిన సమయం రావాలి. అప్పుడే తాత్విక చింతన మరో వ్యవస్థతో పోటీ పడే ఓ ( ఆలోచనల పరంగా) వ్యవస్థగా మిగిలి పోకుండా సార్వత్రిక ప్రాపంచిక తాత్విక చింతనగా మారుతుంది. సమకాలీన ప్రపంచానికి ప్రాతినిధ్యం వహించే తాత్విక చింతనగా మారుతుంది.

దుంగల దొంగతనాల చట్టం పై మార్క్స్ రాసిన వ్యాసం జీవితంలో మలుపు తిప్పిన ముఖ్యమైన వ్యాసం. ఈ వ్యాసాన్ని ఆసరా చేసుకొని రైన్ ల్యాండ్ అసెంబ్లీలో 1842 అక్టోబరులో దొంగతనాల చట్టాన్ని తీసుకు వచ్చారు. ఆ సమయంలో రైన్ ల్యాండ్‌లోని అడవులు ఫ్యూడల్ ప్రభువుల ఆధీనంలో ఉండేవి. అడవికి సమీపాన నివసించే పేద ప్రజలు పడిపోయిన చెట్ల దుంగలను, కర్రలను సేకరించి వాడుకొనేవారు. సేకరించిన కర్రలను ఇళ్ళలో ఇంధనంగా వాడుకొనేవారు. వాడుకోగా మిగిలిన దుంగలను అమ్ముకొని డబ్బులు సంపాదించేవారు. ఇది వారి వారసత్వ హక్కుగా కొనసాగింది. అంతేగాకుండా పేద ప్రజల పిల్లలు బిలెబెర్రి, కిరణ్ బెర్రీ చెట్ల నుండి రాలిపడిన పండ్లను సేకరించేవారు, చెట్ల నుండి సేకరించిన కాయలను అమ్మడం ద్వారా వచ్చిన డబ్బులను వారి తల్లిదండ్రులకు కుటుంబ ఖర్చుల కోసం ఇచ్చేవారు.

"రైనిష్ జైటుంగ్ సంపాదకుడిగా కారల్ మార్క్స్‌ని నియమించే నాటికి అతని వయస్సు కేవలం 24 సంవత్సరాలు మాత్రమే. ప్రష్యన్ ప్రభుత్వ దౌర్జన్యాలు, ప్రభుత్వ అధికారుల దుర్మార్గాలు, నేరారోపణలు, జంకర్‌ల క్రూరత్వా లపై మార్క్స్ వ్యాసంలో తీవ్రంగా విమర్శించాడు. సమకాలీన జర్మన్ తాత్విక చింతనలో ఉన్న ప్రష్యన్ ప్రభుత్వ ప్రతీఘాత చర్యలన్నింటినీ సమర్థించే ప్రతికూల కోణాన్ని శాస్త్రీయమైన వివరణలతో, ఆధారాలతో బట్టబయలు చేశారు."

భూస్వాములు ఒత్తిడి చేయడంతో ప్రష్యన్ ప్రభుత్వం అడవుల్లో దుంగలు, పండ్లు సేకరించడాన్ని నిషేధించింది. ప్రష్యన్ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా అడవుల్లో కర్రలు, దుంగలు, పండ్లు సేకరిస్తే దొంగతనం నేరంగా పరిగణించి అరెస్ట్ చేసి జైలుకి పంపుతామని ప్రష్యన్ ప్రభుత్వం ప్రకటించింది. అసెంబ్లీలో నిషేధం బిల్లుపై చర్చ జరిగినప్పుడు అడవుల నుండి కర్రలు, పండ్ల సేకరణ పేద ప్రజల వారసత్వ హక్కుగా ఉందని ఒక సభ్యుడు చెప్పిన వెంటనే దానికి సమాధానంగా భూస్వామ్య వర్గానికి ప్రతినిధిగా ఉన్న మరొక సభ్యుడు మాట్లాడుతూ "మా ప్రాంతంలో పండ్లు సేకరించడం, అమ్మడం నిషేధించాలని డిమాండ్ చేసాడు. పండ్లను సేకరించి పెద్ద పీపాల్లో హాలెండ్ కి ఎగుమతి చేసి పెద్ద వ్యాపారంగా అభివృద్ధి చేయాలని ఆశిస్తున్నామని చెప్పాడు. అసెంబ్లీలో చర్చల అనంతరం భూస్వాములకు అనుకూలంగా బిల్లు ఆమోదం పొందింది.

అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లుపై ప్రష్యన్ ప్రభుత్వం, భూస్వామ్య ప్రభువుల వైఖరిని ఎండగడుతూ వారు సిగ్గుపడే విధంగా మార్క్స్ వ్యాసంలో ఎండగట్టాడు. స్థానికంగా ఉన్న పేదవారి హక్కుల రక్షణ కోసమే కాకుండా, అన్ని దేశాల్లోని పేదవారికి ఉన్న వారసత్వపు హక్కులను కాపాడాలని కోరుతున్నామని మార్క్స్ వ్యాసంలో పొందుపరిచాడు. పేదవారు, ఆస్తి లేని వారికి సాంప్రదాయంగా వస్తున్న వారసత్వపు హక్కులను రక్షించాలి. అది వారి ప్రాథమిక హక్కుగా ఉండాలని మార్క్స్ భావించాడు.

దిక్కులేని పరిస్థితుల్లో పనిచేస్తున్న ప్రజల స్థితిగతుల గురించి, అందుకు గల కారణాలను గుర్తించిన మార్క్స్ తనదైన శైలిలో వ్యాసంలో విశ్లేషణ చేసాడు. ప్రష్యన్ ప్రభుత్వం చెట్ల దొంగతనాలపై చేసిన చట్టం గురించి, మోసెల్ రైతుల దీన పరిస్థితి గురించి మార్క్స్ స్వయంగా అధ్యయనం చేసి కథనాలు రాసినట్లు మార్క్స్ ఎంగెల్స్‌కు చెప్పాడు. రాజకీయాలను అధ్యయనం చేసే క్రమంలో రాజకీయాలకు – ఆర్థిక అంశాలకు మధ్య ఉన్న అవినోవాభావ సంబంధాలను గుర్తించాడు. ఈ రెండింటి మధ్య ఉన్న సంబంధాలను అధ్యయనం చేసే క్రమంలో మార్క్స్ ఆలోచనలు సోషలిజం వైపు వెళ్లాయి. రోజులు గడుస్తున్న కొద్దీ మార్క్స్ రాజకీయ, ఆర్థిక సంబంధాలపై అధ్యయనం చేసిన తర్వాత వాటి ప్రభావం గురించి వివరించాడు. అయిష్టంగానే న్యాయశాస్త్రాన్ని అధ్యయనం చేసినప్పటికీ దాన్ని తత్వశాస్త్రం, చరిత్రకు అన్వయింపు చేసాడు.

1842–43లో రైనిష్ జైటుంగ్ సంపాదకునిగా మార్క్స్ భౌతికవాద దృక్పథంతో వ్యాసాలను రాయడం ప్రారంభించాడు. అటవీ దొంగతనాలపై రైనిష్ ల్యాండ్ టాగ్‌పై జరిగిన చర్చలు, జమీందారుల ఆస్తిగా ఉన్న భూమిని పంచడం, మోస్లే రైతుల దీన పరిస్థితి పై రైనిష్ జైటుంగ్ పత్రికలో వచ్చిన కథనాలకు వ్యతిరేకంగా రైన్ ప్రావిన్స్ లో ధనవంతులకు అధిపతిగా ఉన్న హెర్ వాన్ చాపర్ వ్యతిరేకించాడు. స్వేచ్ఛా వాణిజ్యం, రక్షణాత్మక సుంకాలపై జరిగిన చర్చల సందర్భంగా లేవనెత్తిన ఆర్థికపరమైన ప్రశ్నలు వైపు మొదటిసారిగా మార్క్స్ ఆలోచనలు మళ్ళించబడ్డాయి.

'రైనిష్ జైటుంగ్ సంపాదకుడిగా కారల్ మార్క్స్ ని నియమించే నాటికి అతని వయస్సు కేవలం 24 సంవత్సరాలు మాత్రమే. ప్రష్యన్ ప్రభుత్వ దౌర్జన్యాలు, ప్రభుత్వ అధికారుల దుర్మార్గాలు, నేరారోపణలు, జంకర్‌ల క్రూరత్వాలపై మార్క్స్ వ్యాసంలో తీవ్రంగా విమర్శించాడు. సమకాలీన జర్మన్ తాత్విక చింతనలో ఉన్న ప్రష్యన్ ప్రభుత్వ ప్రతీఘాత చర్యలన్నింటినీ సమర్థించే ప్రతికూల కోణాన్ని శాస్త్రీయమైన వివరణలతో, ఆధారాలతో బట్టబయలు చేశారు. శ్రామిక ప్రజల సామాజిక, రాజకీయ ప్రజాతంత్ర విప్లవ ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించే తత్వవేత్తగా కారల్ మార్క్స్ ఎదిగారు. సామాజిక హక్కులను కాపాడటానికి విప్లవ ప్రజాస్వామ్యవాదిగా, పేద ప్రజల, శ్రామికులకు అండగా నిలిచాడు మార్క్స్.

**లుడ్విగ్ ఫ్యూయర్‌బా**

1839, జెనా విశ్వవిద్యాలయంలో కారల్ మార్క్స్ ప్రాచీన తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేయడం ప్రారంభించి 1841లో పూర్తి చేశాడు. కారల్ మార్క్స్ డాక్టరేట్ పట్టా కోసం సిద్ధాంత

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

> ❝ప్రకృతి స్వతంత్రంగా ఉంది. మనిషి యొక్క మతపరమైన ఊహ ద్వారా దేవుడు సృష్టించ బడ్డాడు. ఎప్పుడైతే మనిషి దేవుడిని సృష్టించాడో అప్పుడే మానవుడు తన కున్న అపారమైన శక్తిని దేవుడికి ఆపాదించాడు. ఫ్యూయర్‌బా మాటల్లో మనిషి ప్రేమలో ఉన్నందువల్ల దైవత్వాన్ని పవిత్రమైనదిగా భావించాడు.ఎందుకంటే మనిషి తనను తానుగా ప్రేమిస్తాడు కాబట్టి. దేవుడు వివేకం కలిగిన విజ్ఞానవంతుడని మనిషి నమ్ము తాడు.❞

వ్యాసాన్ని జేనా విశ్వవిద్యాలయానికి అంద జేశాడు. ఎపిక్యూరియన్ (గ్రీకు తత్వవేత్త) ప్రకృతి తత్వశాస్త్రం, ప్రజాస్వామ్య భావనలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అంగీకరించిన జేనా విశ్వ విద్యాలయం 1841, ఏప్రిల్ 15న కారల్ మార్క్స్‌కు డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేసినది.

అదే సమయంలో లుడ్విగ్ ఫ్యూయర్‌బా రచించిన క్రైస్తవ మత సారాంశం (ఎసెన్స్ అఫ్ క్రిస్టియానిటి) అనే పుస్తకం బయటకొచ్చింది. తత్వవేత్తలు సభ్యులుగా ఉన్న యంగ్ హెగెలియన్ గ్రూపులో లుడ్విగ్ ఫ్యూయర్‌బా కీలకమైన వ్యక్తిగా గుర్తింపు పొందాడు. ఇర్లాంజెన్ విశ్వ విద్యాలయంలో అధ్యాపక వృత్తిలో పని చేస్తున్న ఫ్యూయర్‌బా నాస్తికవాద బోధనల వలన విశ్వవిద్యాలయం నుండి తొలగింపబడినారు. మతానికి తీవ్రమైన వ్యతిరేకి. ప్రకృతే ప్రధాన మైనదని మిగిలిన బావనలు ప్రకృతి తర్వాతనే అనే గాఢమైన అభిప్రాయం కలిగి ఉన్న వ్యక్తి ఫ్యూయర్‌బా. ప్రకృతి, మనిషికి వెలుపల మరే శక్తీ లేదని గాఢంగా నమ్మిన వ్యక్తి ఫ్యూయర్‌బా.

ప్రకృతి స్వతంత్రంగా ఉంది. మనిషి యొక్క మతపరమైన ఊహ ద్వారా దేవుడు సృష్టించ బడ్డాడు. ఎప్పుడైతే మనిషి దేవుడిని సృష్టించాడో అప్పుడే మానవుడు తన కున్న అపారమైన శక్తిని దేవుడికి ఆపాదించాడు. ఫ్యూయర్‌బా మాటల్లో మనిషి ప్రేమలో ఉన్నందువల్ల దైవత్వాన్ని పవిత్రమైనదిగా భావించాడు.ఎందుకంటే మనిషి తనను తానుగా ప్రేమిస్తాడు కాబట్టి. దేవుడు వివేకం కలిగిన విజ్ఞానవంతుడని మనిషి నమ్ముతాడు. మర్యాద, మంచితనం అనే లక్షణాలు మనిషికి ఉంటేనే దేవుడంటే మనిషికి గౌరవం ఉంటుంది. ఈ కారణాల వల్ల దేవుడు మనిషి యొక్క సారాంశంగా మిగిలిపోవడంతో నిజమైన సత్యంగా దేవుడ్ని చూడసాగాడు.

ఫ్యూయర్‌బా హెగెల్ తత్వశాస్త్రంపై దాడి చేశాడు. భావవాద స్వభావం కలిగిన హెగెలియన్ గతితార్కిక భావనల పై హెగెల్ పదునైన విమర్శలు చేశాడు. ఈ విమర్శలు హెగెల్ తత్వశాస్త్రాన్ని విచక్షణతో అర్థం చేసుకునేందుకు ఉపయోగపడతాయి. హెగెల్ తత్వశాస్త్రంలోని హేతుబద్ధమైన సిద్ధాంతాన్ని ఉపయోగించుకో వడానికి మార్గం ఏర్పడింది. మార్క్సిజాన్ని అభివృద్ధి చేయడానికి మార్క్స్ – ఎంగెల్స్‌కు ఈ అంచనాలు దోహదపడ్డాయి. ఒకవైపు దేవుని పట్ల హెగెల్‌కున్న సంపూర్ణ విశ్వాసాలను ఫ్యూయర్‌బా క్రమంగా ధ్వంసం చేస్తూ, మరో వైపు హెగెల్ గతితార్కిక వైరుధ్య బావనలపై సమర్ధవంతంగా దాడి చేశాడు.

ఈ పుస్తకాన్ని మార్క్స్, ఎంగెల్స్, ఇతర యువహెగెలియన్లుఉత్సాహంతో ఆహ్వానిం చారు. నాస్తికవాదులుగా ఉన్న ప్రముఖులు ఈ పుస్తకాన్ని స్వాగతించారు. మతంపై, దేవుడిపై విమర్శనా త్మకంగా చర్చలు చేస్తూ ఉన్న మార్క్స్, ఎంగెల్స్‌లకు ఈ పుస్తకం మందుగుండు సామగ్రిలా మరింత బలాన్ని చేకూర్చింది.

**మతంపై మార్క్స్ విశ్లేషణ**

మనిషే ఉన్నతమైనవాడు అన్నప్పుడే మతంపై చర్చ ముగిసింది. మనిషికి ఉన్న హీనమైన బానిస పరిస్థితి, హేయమైన విధానాలతో అనివార్యమైన పరిస్థితిలో పరాజయం పాలైనాడు.

ఈ సమయంలో బెర్మన్‌లో ఉన్న ఎంగెల్స్ ఫ్యూయర్‌బా పుస్తకాన్ని చదివి అమితంగా ఆనందించాడు. ఫ్యూయర్‌బా సాధించిన ప్రగతిని అభినందించాడు.

**ఎంగెల్స్ మాటల్లో :**

" కొత్తగా ఉషోదయం అయింది. అత్యంత బరువైన పీడకలల నుండి మేము మేల్కొన్నాము. మేము కళ్ళు తుడుచుకొని చుట్టుప్రక్కల చూసే సరికి ఒక్కసారిగా మొత్తం మారిపోయి ఉన్న దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయాము.

ఫ్యూయర్‌బా పుస్తకం చదివిన తరువాత ఎంగెల్స్‌కు పూర్తి స్పష్టత వచ్చింది. దీంతో యువ హెగెలియన్ సిద్ధాంతాన్ని వదులుకొని భౌతిక వాదాన్ని ఆచరించడం మొదలుపెట్టాడు.

ఫ్యూయర్‌బా యొక్క భౌతికవాద, నాస్తిక వాద ఆలోచనలలో ఉన్న బావవాద ఆలోచనలను బద్దలు కొట్టి మార్క్స్ – ఎంగెల్స్‌లు విప్లవకర ప్రజాస్వామిక వాదులుగా మారిపోయారు. ఫ్యూయర్‌బా పుస్తకంలో కొన్ని తప్పుడు నిర్ధారణలు ఉన్నప్పటికి మార్క్స్, ఎంగెల్స్‌లు ఆనాటికున్న స్థితిలో వాటిని సరిదిద్దే చైతన్యస్థాయిలో లేరు. 1844లో మార్క్స్, ఎంగెల్స్‌లు కలిసి పనిచేయడం ప్రారంభించిన తర్వాత కూడా ఫ్యూయర్‌బా పుస్తకంలో ఉన్న తప్పుడు నిర్ధారణలను గుర్తించగలిగే స్థితిలో లేరు.

**అనువాదం : కె. హరికిషోర్**

## ప్రజాభిప్రాయం

మార్క్సిస్టు మాసపత్రిక సంపాదకులకు నమస్కరించి రాయునది మార్చి సంచికపై నా అభిప్రాయం ప్రచురించకోరుతున్నాను. "ఆదివాసీల జీవన స్థితి దిగజారుతున్నది" ఆదివాసీల గురించి ఈ మాసం ప్రత్యేకం బాగుంది. రెండు పేజీలే అయినా చాలా సమాచారం ఉంది. దేశంలో ఆనాడు 8 శాతం ఉన్న గిరిజనులకు రాజ్యాంగంలో అంబేద్కర్ 5,6 షెడ్యూళ్ళను పొందుపరిచారు. ఆదివాసీల సంక్షేమం బాధ్యత రాష్ట్రపతి, గవర్నర్‌లకు అప్పగించారు. కాని వారు ఆ కర్తవ్యం నెరవేర్చలేదు. రిజర్వ్ ఫారెస్టు పేరుతో గిరిజనులను భూమికి దూరం చేస్తున్నారు. అటవీ హక్కుల చట్టం – 2006 సరిగా అమలు జరగలేదు. అమలు చేసే బాధ్యత ఎవరిది? పేర్కొనలేదు. ఈ చట్టం ప్రకారం తమహక్కులను అమలు జరపాలని దేశంలోని గిరిజనులు డిమాండ్ చేసినట్లయితే వారిని అడవి నుండి పంపించి వేయాలని సుప్రీంకోర్టు ధర్మాసనం 13–2–2019న తీర్పు చెప్పింది. అంతేకాక జులై 27వ తేదీలోగా బలవంతంగా నైనా అడవి నుండి ఖాళీ చేయించాలని ఆదేశించింది. మన రెండు తెలుగు రాష్ట్రాలతో కలుపుకుని 16 రాష్ట్రాలలో 11లక్షల 30 వేల మంది ఖాళీ చేయవలసి ఉంది. అడవులలోని జంతువులను రక్షించాలన్న పేరుతో కార్పొరేట్ శక్తులు, మాజీ అటవీ అధికారులు కోర్టులో పిటిషన్ వేశారు. కేసు విచారణ సందర్భంలో గిరిజనుల తరపున ప్రభుత్వం జోక్యం చేసుకోలేదు. గిరిజన సంఘాల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం పిటిషన్ వేస్తే కోర్టు 'స్టే' ఇచ్చింది. పాలకులందరికీ గిరిజనుల విషయంలో చిత్తశుద్ధి లేదు. ఆదివాసీల జీవనానికి సంబంధించిన వ్యాసాలు ప్రచురించాలని కోరుతున్నాను.

– **తుంపాల శ్రీరామమూర్తి**, గాజువాక– విశాఖ, 9440260280

# పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా అస్సాంలో నిరసనలు

సుశాంత్ తాలుక్‌దార్

పౌరసత్వ బిల్లు ఆమోదించబడటం వల్ల వారి భాషా సంస్కృతుల గుర్తింపు మతం వల్ల కనుమరుగువుతుందన్న జాతుల సమూహాల భయం వలన అస్సాం, ఇతర ఈశాన్య రాష్ట్రాలలోనూ నిరసనలు పెల్లుబీకుతున్నాయి. 2019 జనవరి 23న గౌహతిలో పౌరసత్వ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా అస్సాంలోని 70 జాతి బృందాల కార్యకర్తలు కొవ్వొత్తుల ఊరేగింపు జరిపి తమ నిరసన తెలిపారు.

ఈశాన్యరాష్ట్రాలలో పౌరసత్వ (సవరణ) బిల్లు 2019 పట్ల వ్యతిరేకత 'న్యూఢిల్లీ' ఊహించిన దానికంటే విస్తృతమైనట్లు కనిపిస్తున్నది. చట్టవిరుద్ధంగా బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వలసదారులను గుర్తించి బహిష్కరించే బదులు పౌరసత్వం ప్రసాదిస్తే, తాము అప్రాధాన్యులవటమే కాక, భాషా సంస్కృతుల ప్రత్యేకతను కోల్పోతామేమోననే విపరీతమైన భయాందోళనలను పెరుగుతున్న నిరసనలు ప్రతిబింబిస్తున్నాయి. ఇటువంటి అవగాహన, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుంచి చట్టవ్యతిరేక వలసదారులైన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రిస్టియన్లను, పాకిస్తాన్ చట్టబద్ధమైన వలసదారులను భారత పౌరసత్వానికి అభ్యర్థించే అర్హతను ఒనగూర్చే, ఈ బిల్లుకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు, విద్యార్థులు, యువత, పౌర సామాజిక సంస్థలు సంయుక్త నిరసన గళాన్ని వినిపించేందుకు ప్రేరేపించింది. కొంతమంది 'హలో చైనా' 'బైబై ఇండియా' అనే ప్రకటన పత్రాలను ప్రదర్శిస్తుండగా 'ఇజ్వాల్' వీధుల లోను, మిజోరంలోని ఇతర ప్రాంతాలలోను, వేలాదిగా నిరసనకారులు ఊరేగింపు జరిపారు. తదనంతరమిజోరంలో 'గణతంత్రదినోత్సవం' సంపూర్ణంగా బహిష్కరించబడింది.

ఈ బిల్లు ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోడి, భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు అమిత్‌షా ముందు వరుసలో ఉండగా, అస్సాంలో అధికారపార్టీ బిజెపి వాస్తవికతను విస్మరించటానికే నిర్ణయించుకుంది. "మా ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంటులో ఆమోదింపజేసే ప్రయత్నంలో ఉంది" అని జనవరి 4న 'సిల్చార్' లో జరిగిన ఒక సభలో మోడీ వ్యాఖ్యానించారు. బిల్లు జనవరి 8న లోక్‌సభలో ఆమోదించబడింది. ఫిబ్రవరి 2న పశ్చిమ బెంగాల్‌లోని ఠాకూర్‌నగర్‌లో జరిగిన ఒక సభలో పార్లమెంట్‌లో 'బిల్లు' ఆమోదించబడాలన్న తమ నిర్ణయాన్ని పునరుద్ఘాటిస్తూ రాజ్యసభలో 'బిల్లు'ని సమర్థించవలసిందిగా 'తృణమూల్ కాంగ్రెస్'ని కోరారు.

ఈశాన్య ప్రాంతంలో నిరసన ధ్వనులున్నప్పటికీ, బిల్లుకి మద్దతుగా, బిజెపి సంఘ్‌పరివార్‌లు అవలంబిస్తున్న దుందుడుకు పోకడలు, హిందుత్వ కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోయే "పౌరసత్వ చట్టంలో ప్రవేశపెట్టబడిన సవరణలను ఒక అవకాశంగా అవి భావిస్తున్నాయని" సూచిస్తున్నాయి. "భారతదేశంలో హిందువులను అక్రమ వలసదారులుగా భావించకూడదు". అనే వాదనను, కాషాయపార్టీ, 'సంఘ్ పరివార్'లోని ఇతర విభాగాలు ముందుకు తెస్తున్నాయి.

మేఘాలయ ముఖ్యమంత్రి "కాన్‌రాడ్ సంగ్మా" మిజోరం ముఖ్యమంత్రి జొరామ్‌తంగ' అస్సాం గణపరిషత్ నాయకుల చొరవతో, జనవరి 29న 'గౌహతి'లో బిజెపి నేతృత్వంలోని 'ఈశాన్య ప్రజాతంత్ర సంఘటన 'లోని పార్టీలతో సహా, పది పాంత్రీయ పార్టీలు సమావేశమై, ఈ బిల్లుని సంయుక్తంగా ప్రతిఘటించాలని నిర్ణయించాయి. బిజెపికి మిత్రపక్షయిన జనతాదళ్ (యునైటెడ్) ప్రతినిధులు సైతం సమావేశానికి హాజరయ్యారు.

"కాంగ్రెస్ రహిత" ఈశాన్యాన్ని సాధించడానికి 2016లో 'ఎన్ఇడిఎ'ను స్థాపించడానికి బిజెపి నేతృత్వం వహించింది. అయితే, ఈ సంఘటనలో కీలక భాగస్వాములైన, మేఘాలయ అధికార సంఘటనలో ప్రధాన భాగస్వాములైన నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) మిజోరం పాలకపక్షమయిన మిజో నేషనల్ ఫ్రంట్ (ఎమ్ఎన్ఎఫ్), నాగాలాండ్‌లో బిజెపి సంఘటనలో భాగస్వామి అయిన నేషనల్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీలు, ఎజిపి ఇతర ప్రాంతీయ పార్టీలతో కలిసి, ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయనే విషయం "లోక్‌సభ ఎన్నికల సందర్భంగా, 'ఎన్ఇడిఎ' లో బిజెపి పట్టు కోల్పోతున్నదనే విషయాన్ని తేటతెల్లం చేస్తున్నది. లోక్‌సభలో బిల్లు ఆమోదించబడటానికి ఒకరోజు ముందు, అంటే జనవరి 7వ తేదీన ఎజిపి అస్సాంలోని బిజెపి నేతృత్వ ప్రభుత్వం నుంచి వైదొలగి, బిజెపిలో తన సంబంధాన్ని తెగతెంపులు చేసుకొంది. (పార్లమెంటు ఎన్నికల తేదీలు ప్రకటించిన తర్వాత ఉభయ పార్టీలూ అవకాశవాదంతో తిరిగి ఎన్నికలలో పొత్తు పెట్టుకున్నాయి).

ఈ పరిణామాల మధ్య ఎఎఎస్‌యు సహా అనేక విద్యార్థి విభాగాల సమ్మిళితమైన ఈశాన్య విద్యార్థి సంఘటన (ఎన్ఇఎస్ఒ) ప్రతినిధి బృందం కాంగ్రెస్ అధ్యక్షుడైన రాహుల్‌గాంధీని కలిసి, రాజ్యసభలో ఈ బిల్లుని వ్యతిరేకించవలసిందిగా అభ్యర్థించిందనే వార్త అస్సాంలో రాజకీయ పెనుదుమారాన్ని లేపింది. అస్సాం ఉద్యమాన్ని ఎఎఎస్‌యు రగిలించిన తదుపరి ఈనాటి వరకు ఒక విద్యార్థి ప్రతినిధి వర్గం కాంగ్రెస్ నేతృత్వాన్ని మద్దతు కోరటం అపూర్వమైన సంఘటన.

**ఎఎఎస్‌యు కాంగ్రెస్ సహాయాన్ని అర్థిస్తుంది**

కాంగ్రెస్‌కు దగ్గరవుతూ, ప్రతిపక్ష పార్టీ మద్దతు కోరుతున్నందుకు భాజపా రాష్ట్ర శాఖ ఎఎఎస్‌యును తప్పుపట్టింది. 'అస్సాం ఉ

ద్యమంలో 855 మంది ప్రజలను పొట్టనపెట్టుకున్న కాంగ్రెస్‌తో ఎఎఎస్‌యు అంటకాగడం దురదృష్టకరం' అని ఈ పరిణామంపై ముఖ్యమంత్రి సర్బానంద్ సోనోవాల్, భాజపా రాష్ట్ర అధ్యక్షులు రంజిత్ కుమార్ దాస్ ప్రతిస్పందించారు. అస్సాం ఉద్యమంలో అమరులైన వారికి సంబంధించి, 76 కుటుంబాల సభ్యులు 2016 డిసెంబర్‌లో సోనోవాల్ ప్రభుత్వం అందించిన 'జ్ఞాపికలను ఈ 'బిల్లు'కు నిరసనగా జనవరి 30 వ తేదిన తిరిగి ఇచ్చివేశారు. 1979లో ఎఎఎస్‌యు నేతృత్వంలో సాగిన అస్సాం ఉద్యమం 1985లో జరిగిన అస్సాం ఒప్పందంతో ముగిసింది. ప్రతి మృతవీరుని కుటుంబానికి, ఒకసారి మాత్రమే అనే ప్రాతిపదికపై, సోనోవాల్ ప్రభుత్వం జ్ఞాపికను, 5లక్షల నగదు బహుమతిని అందించింది. గౌహతిలో స్వాహిద్ న్యాస్ వద్ద ఉన్న ఎఎఎస్‌యు ప్రధాన కార్యాలయంలో మృత వీరుల కుటుంబాల సభ్యులందరూ సమావేశమై, "సదౌ అస్సాం జాతీయ స్వాహిద్ పరియాళ్" సామాన్వే రాఖీ పరిషద్'' పతాక కింద 'కామరూప్' ఉపకమిషనర్ కార్యలయానికి ప్రదర్శనగా తరలి, అక్కడి అధికారులకు 'జ్ఞాపికలను' ఇచ్చివేశారు. ఇతర అమరుల కుటుంబ సభ్యులు వారి జిల్లా ప్రధాన కార్యలయాలలో జ్ఞాపికలను తిరిగి ఇచ్చివేశారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలసి ఈ నిరసనలను రూపొందించారని భాజపా అభాండాలు వేస్తోంది. ఈ బిల్లును ఉపసంహరించుకోవలసిందిగా డిమాండ్ చేస్తూ, కాంగ్రెస్, వామపక్షాలు సైతం ఉద్యమిస్తున్నారు.

బిల్లుకు వ్యతిరేకంగా జరగుతున్న నిరసనలను భాజపా నిర్లక్ష్యం చేయడం వల్లే, తప్పనిసరిగా కాంగ్రెస్ మద్దతు కోరవలసి వచ్చిందని అస్సాం గణపరిషత్ తేటతెల్లం చేసింది. "రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదాన్ని నిలువరించటానికి కాంగ్రెస్ ఏ విధమైన పాత్ర పోషిస్తుంది? అనే దానిపై అందరి దృష్టి ఉందని అస్సాం గణపరిషత్ అధ్యక్షులు అతుల్ బోరా అభిప్రాయపడ్డారు.

తనపూర్వ అధ్యక్షుడయిన సోనోవాల్‌ను ముఖ్యమంత్రిగా ప్రతిష్టించడంలో ఎఎఎస్‌యు కీలకమైన పాత్ర పోషించింది. చట్టబద్ధులు కాని వలసదారులు (ట్రిబ్యునల్ నిర్ణయం ప్రకారం) చట్టంలో 1983లో పిటిషనర్ అయిన సోనోవాల్‌కు, 2005లో సుప్రీంకోర్టు ఆ చట్టాన్ని రద్దుచేసిన సందర్భంగా 'జాతీయ నాయక్" గౌరవ హోదా లభించింది. అయితే, 2019 జనవరి 7వ తేదీన మోడీ మంత్రివర్గం పౌరసత్వ (సవరణ) బిల్లును ఆమోదించిన తదుపరి, ఎఎఎస్‌యు, ఎన్ఇఎస్ఒ సలహాదారు అయిన సముజ్జల్ భట్టాచార్య, మోడీ, సోనోవాల్,

"ఎఎఎస్‌యు, ఎఇఎస్ఒ ప్రతినిధి బృందాలు ప్రతిపక్ష నాయకులను ఎన్‌డిఎలోని భాజపా సహచర పక్షాలను కలసి, బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయవలసిందిగా అభ్యర్థించాయి. కృషక్ ముక్తి సంగ్రామ సమితి, అస్సాం జాతీయవాది యువ ఛాత్రపరిషత్ నేతృత్వంలోని 70 ఇతర ప్రజాసంఘాలు, ప్రొఫెసర్ హిరేన్ గొహైన్ నేతృత్వంలోని పాత్రికేయులు మేధావుల ప్రతినిధి వర్గం వేరుగా రాహుల్‌గాంధిని కలిసి, బిల్లును వ్యతిరేకించవలసిందిగా అభ్యర్ధించారు."



పౌరసత్వ రిజిస్టర్‌లో పేర్లు చేర్చాలని ఆందోళన చేస్తున్న అస్సామీయులు

భాజపాలను 'ద్రోహులుగా' అభివర్ణించాడు. "వారు 'అస్సాం ఒప్పందాన్ని' తుచ తప్పకుండా అమలు చేస్తామని, బంగ్లాదేశీయులను తరిమివేస్తామని వాగ్దానం చేశారు. అయితే లోక్‌సభలో బిల్లును ఆమోదించడం ద్వారా బంగ్లాదేశీయుల 'వోటు బ్యాంక్‌ను సృష్టించుకోవాలని వారి కోరిక అని నిరూపించుకున్నారు. అని ఆయన అన్నారు. ఎఎఎస్‌యు రాహుల్‌గాంధీని కలవటాన్ని విమర్శించిన సోనోవాల్, భాజపాకు స్పందిస్తూ "మేము రాహుల్‌గాంధీని, యుపిఎలోని ఇతర నాయకులను, బిల్లును తిరస్కరిస్తున్న ఎన్‌డిఎలోని ఇతర నాయకులను రాజ్యసభకు హాజరై, 'బిల్లుకు' వ్యతిరేకంగా 'ఓటు' వేయాలని అభ్యర్థించాము" అని ఆయన చెప్పారు.

"మా వైఖరి చాలా స్పష్టంగా ఉంది. అస్సాం ఒప్పందాన్ని అమలుపరచాలి, 1971 మార్చి 24 తర్వాత వచ్చిన అక్రమ వలసదారులు హిందువులైనా, ముస్లిములైనా గుర్తించబడి, బహిష్కరింపబడాలి. ఈ బిల్లు అస్సాం ఒప్పందాన్ని ఉల్లంఘించడమే కాదు, దేశ లౌకిక పునాదులనే ధ్వంసం చేయాలని కోరుకోంటుంది" అని ఆ విద్యార్థి నాయకుడు వ్యాఖ్యానించ్చారు. 'బిల్లు' వ్యతిరేకులు సోనోవాల్, శర్మ, ఇతర భాజపా నేతలకు నిరసన తెలుపుతూ నల్లజెండాలు ప్రదర్శించారు. వివిధ ప్రాంతాలలో భాజపా కార్యకర్తలకు, నిరసనకారులకు మధ్య ప్రత్యక్ష ఘర్షణ సంఘటనలు సైతం రాష్ట్రంలో అక్కడక్కడా కనిపించాయి.

ఎఎఎస్‌యు, ఎఇఎస్ఒ ప్రతినిధి బృందాలు ప్రతిపక్ష నాయకులను ఎన్‌డిఎలోని భాజపా సహచర పక్షాలను కలసి, బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయవలసిందిగా అభ్యర్ధించాయి. కృషక్ ముక్తి సంగ్రామ సమితి, అస్సాం జాతీయవాది యువ ఛాత్రపరిషత్ నేతృత్వంలోని 70 ఇతర ప్రజాసంఘాలు, ప్రొఫెసర్ హిరేన్ గొహైన్ నేతృత్వంలోని పాత్రికేయులు మేధావుల ప్రతినిధి వర్గం వేరుగా రాహుల్‌గాంధిని కలిసి, బిల్లును వ్యతిరేకించవలసిందిగా అభ్యర్ధించారు.

లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని భాజపా అస్సాం, పశ్చిమబెంగాల్‌లో 'బిల్లుకు అనుకూల ప్రచారాన్ని ఉధృతం చేస్తుంది. లోక్‌సభలో 8 ఈశాన్య రాష్ట్రాలకు 25 సీట్లు పశ్చిమబెంగాల్‌కు 42 సీట్లు ఉన్నాయి. సోనోవాల్, రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి హిమంత విశ్వశర్మ రాష్ట్రంలో బిల్లుకు అనుకూల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు కాని, ఎన్ఇడిఎ సభ్యుల, మేఘాలయ, నాగాలాండ్, మిజోరంలలోని భాజపా శాఖలు 'బిల్లుపట్ల వ్యతిరేకత' గురించి నిశ్శబ్దాన్ని పాటిస్తున్నారు. మణిపూర్ రాష్ట్రాన్ని ఈ బిల్లు పరిధి నుంచి మినహాయించవలసిందిగా భాజపా నేతృత్వం

> **"ఈ బిల్లుకు నిరసనగా 2006లో తనకు ఒసంగ బడిన 'పద్మశ్రీ'ని ప్రముఖ సినీ నిర్మాత అరిబమ్ శ్యామ్ శర్మ తిరిగి ఇచ్చేశారు. బంగ్లాదేశ్ నుంచి చట్టబద్ధంకాని వలసదారుల రాక వలన సంభవించే జనాభాపరమైన మార్పు వలన విభిన్న జాతులు నామమాత్రమైపోయే తీవ్ర ప్రమాదం పొంచి ఉందని భావించడం వలనే 'అస్సాం'లో ఎస్టీ జాతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘాలు ఈ 'బిల్లు'కు వ్యతిరేకంగా నిరసనలను చేస్తున్నాయి."**

లోని మణిపూర్ సంకీర్ణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని అర్థిస్తూ మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించింది. ఈ బిల్లు అస్సాం ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని, అస్సామీయాలు, ఇతర చిన్న జాతుల అస్తిత్వానికీ, ప్రత్యేకతకు తీవ్రహాని కలిగిస్తోందని ప్రచారం జరుగుతున్నది. దీనికి వ్యతిరేకంగా సోనోవాల్, శర్మ,, భాజపానాయకులు "షెడ్యూల్డ్ తెగల పట్టిక విస్తృతీకరణ, అసెంబ్లీ స్థానిక సంస్థలు ఉద్యోగాలలో, అస్సాం ఒప్పందం లోని క్లాజ్ 6లోని రక్షణ నిబంధనల వలన, రిజర్వేషన్ వలన, అస్సాం ఎస్టీ ఆధిక్య రాష్ట్రంగా మారిపోనున్నదని, విభిన్న చిన్న జాతుల 'నిర్భేధ్య దుర్గంగా తయారవుతుందని, కాబట్టి విభిన్న జాతుల ప్రజలు ఈ బిల్లు గురించి భయపడ వలసింది ఏమీ లేదని వాదిస్తున్నారు.

అయితే ఈ వాదనతో 'బిల్లు' వ్యతిరేకులు విభేదిస్తున్నారు. స్థానికులు ('ఇండిజీనస్') అనే పదానికి నిర్వచనాన్ని ప్రభుత్వం నిర్ణయించిందా? అని ఎజిపి శాసనసభ్యులు రామేంద్ర నారాయణ్ కలిత రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి చంద్రమోహన్ పటోవారీని ప్రశ్నించాడు. ఇంకా నిర్ణయించలేదని మంత్రి అసెంబ్లీకి తెలియజేశాడు. పూర్వపు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అప్పటి రెవెన్యూ మంత్రి భూమిదార్ బర్మన్ నేతృత్వంలో ఒక మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది కానీ "నిర్వచనం" మీద ఏకాభిప్రాయం కుదరలేదు.

53 సంఘాలు తనకు విజ్ఞప్తి చేస్తే, పూర్వపు స్పీకర్, ప్రణవ్‌గొగోయ్ మరో ప్రయత్నమయితే చేశారు. ఆయన ఒక నివేదిక తయారు చేసినప్పటికీ, ఏకగ్రీవత రాలేదని పటోవరీ చెప్పారు. నిర్వచనమే నిర్ణయించబడనప్పుడు ప్రభుత్వం ఏ విధంగా "అస్సాం ఒప్పందం"లోని క్లాజ్ 6ను అమలు చేయగలదని కలితా ప్రశ్నించినప్పుడు ప్రభుత్వం త్వరలోనే ఈ విషయంపై ఒక నిర్ణయం గైకొంటుందని మంత్రి సమాధానమిచ్చారు.

కోచ్ రాజవంశస్థులను, తాయ్ అహోమ్, మోరన్, మటక్ చుంబియా, మరో 36 ఆదివాసీ జాతులను ఎస్టీ పట్టికలో కలుపుతూ, జనవరి 9న మోడీ ప్రభుత్వం ఒక రాజ్యాంగ (ఎస్టీ) సవరణ బిల్లు 2019ని ప్రవేశపెట్టింది కానీ, నిరసనకారులు అటువంటి విషయాన్ని కొట్టిపారేస్తున్నారు. 98 శాతం అసెంబ్లీస్థానాలు షెడ్యూల్డ్ తెగలకు కేటాయించబడిన మేఘాలయ, మిజోరం, నాగాలాండ్‌లు ఇప్పటికే ఎస్టీ మెజారిటీ రాష్ట్రాలు. బిల్లును వ్యతిరేకిస్తూ, మంత్రివర్గ తీర్మానాలు ఆమోదించాయి. ఈ బిల్లు పరిధినుంచి మినహాయించవలసిందిగా అర్థిస్తూ, మణిపూర్‌లోని భాజపా నేతృత్వంలోని సంకీర్ణం మంత్రివర్గ తీర్మానం చేసింది. ఈ బిల్లుకు నిరసన 2006లో తనకు ఒసంగ బడిన 'పద్మశ్రీ'ని ప్రముఖ సినీ నిర్మాత అరిబమ్ శ్యామ్ శర్మ తిరిగి ఇచ్చేశారు. బంగ్లాదేశ్ నుంచి చట్టబద్ధంకాని వలసదారుల రాక వలన సంభవించే జనాభాపరమైన మార్పువలన విభిన్న జాతులు నామమాత్రమైపోయే తీవ్ర ప్రమాదం పొంచి ఉందని భావించడం వలనే 'అస్సాం'లో ఎస్టీ జాతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘాలు ఈ 'బిల్లు'కు వ్యతిరేకంగా నిరసనలను చేస్తున్నాయి.

అస్సామీయులకు, ఇతర ప్రాచీన జాతులకు ఒకమతపరమైన ముద్రను రుద్దే విస్తృత ప్రణాళికలో భాగంగానే, సంఘ్‌పరివార్ ముందుకు తెస్తున్న ఈ బిల్లును చూడవలసివస్తుంది. బంగ్లాదేశ్ ముస్లిముల వలన వారు అల్పసంఖ్యాకులుగా మారకుండా ఉండాలంటే అస్సామీయులు బంగ్లాదేశ్ హిందువులలో మమేకమవాలనే ప్రచారాన్ని వారు చేస్తున్నారు. 1971 తర్వాత వచ్చిన బంగ్లాదేశ్ ముస్లిం వలసదారులే కాక, 1951–1971 మధ్యనాటి తూర్పుపాకిస్తాన్ నుంచి తరలివచ్చిన ముస్లిం వలసదారులు సైతం బంగ్లా ముస్లింలు గానే భాజపా రాజకీయ నిఘంటువులో పరిగణింపబడతారు. 2014 డిసెంబర్ 31వరకు అస్సాంకు వలసవచ్చిన బంగ్లాదేశ్ హిందువులకు ఈ బిల్లు పౌరసత్వాన్ని ప్రసాదిస్తుందని, సోనోవాల్ ప్రభుత్వము, భాజపా నాయకులు నొక్కి చెప్తున్నారు. ఈ 'బిల్లు' కొత్త వలసలను ప్రోత్సహిస్తుందని, 'బిల్లు' వ్యతిరేకులు అబద్ధాన్ని ప్రచారం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఈ బిల్లులో ఒక నిర్ణీత ముగింపు తేది పేర్కొనబడక పోవటం వల్లనే, అది చట్టరూపం దాలిస్తే, పెద్ద సంఖ్యలో అస్సాంలోకి బంగ్లాదేశ్ హిందువుల వలసలను ప్రోత్సహిస్తుందనే ఊహగానం పురుడుపోసుకుంది. అస్సామీయులకు భాష సంస్కృతి అతి ప్రాముఖ్యమున్న గుర్తింపు చిహ్నాలు. స్వభావరీత్యా ఈ రెండు అంశాలు భిన్న సంస్కృతుల మేళవింపే. వివిధ ప్రాచీన భాషలు, సంస్కృతుల ఆచరణాత్మకత వలనే అస్సామీయుల భాషా సంస్కృతులు వికసించాయి. వారి స్వంత భాష, విభిన్న ప్రాచీన జాతుల సాంస్కృతిక అస్తిత్వ చిహ్నాలను అభివృద్ధి చేసుకోవాలనే ఆకాంక్షలే అస్సామీయులు రెండు ప్రత్యేకతలను సుదృఢం చేశాయి అని గుర్తించుకోవాలి. అలాగే వినూత్న అంశాలు సైతం అస్సామీయుల ప్రత్యేకతా నిర్మాణాన్ని అస్సామీయుల జాతీయతా నిర్మాణాన్ని మరింత పరిపుష్టం కావించాయి. అందువలనే, ఈ రెండు ప్రత్యేకతా చిహ్నాలకు మతం రంగు పులిమే ప్రయత్నాలే, స్వంత ప్రత్యేక సంస్కృతి కలిగిన భిన్న ప్రాచీన జాతుల ప్రజలలో వారు నామమాత్రమౌతారేమో అన్న భావాలను రగిలించాయి. ఈశాన్య రాష్ట్రాలలోని అన్ని జాతులకూ సంబంధించిన సమస్త ప్రజానీకం ఈ 'బిల్లు వ్యతిరేక నిరసన లలో ఎందుకు పాల్గన్నారనే విషయాన్ని ఇది సూచిస్తుంది.

1985 నుంచి 2018 ఆగస్టు వరకు విదేశీయులపై 6,26,793 అభియోగాలు మోపబడినాయని అస్సాం ప్రభుత్వం అసెంబ్లీలో తెలియజేసింది. వివిధ సంస్థలు వారిలో 1,03,764 మందిని విదేశీయులుగాను, 1,08,815 మందిని భారతీయులుగాను తీర్మానించాయి. 1985 నుంచి 2019 జనవరి 20 వరకు మొత్తం 29,829 మంది విదేశీయులు బహిష్కరింపబడ్డారు. అస్సాంలోను, ఇతర ఈశాన్య రాష్ట్రాలలోను రాజకీయ కుంపట్లు రగులుతూ ఉండడటానికి ఈ సంఖ్యలే సాక్ష్యం. ఈ పరిణమాలను కేవలం "ఎన్నికల సంఖ్యా క్రీడ"గా భాజపా పరిగణించజాలదని, ఈ ప్రాంతంలో ఈ బిల్లు చుట్టూ కేంద్రీకృత మవుతున్న రాజకీయ వాతావరణం హెచ్చరి స్తున్నది. ఈ నిరసన గళాలను విస్మరించడ మంటే వేర్పాటువాద ధోరణులు పాదుకొల్పు కోవటానికి విస్తృత అవకాశాన్ని కల్పించడమే. అవుతుంది.

**అనువాదం : కెఎన్‌వి ప్రసాద్**

# అటవీ హక్కుల చట్టం రద్దుకు కుట్ర

వి వెంకటేశన్

అటవీ భూములకు సంబంధించి ఫిబ్రవరి 13న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో దేశ జనాభాలో 8 శాతం ఉన్న ఆదివాసీలు భయాందోళనల్లో ఉన్నారు. అటవీ భూములను అక్రమంగా వినియోగించుకుంటున్న వారిని, నివాసం ఉంటున్న వారిని అక్కడ నుంచి ఖాళీ చేయించాలని కోర్టు సంబంధిత రాష్ట్రాలు, అధికారులను ఆదేశించింది. దీంతో లక్షలాది మంది అటవీ వాసులపై ప్రస్తుతం ఈ 'ఖాళీ చేయించే' కత్తి వేలాడుతూ ఉంది. సంవత్సరాలుగా సాగుతున్న పట్టణీకరణ, పారిశ్రామికీకరణతో ఇప్పటికే అటవీవాసులకు అందుబాటులో ఉన్న భూములు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం సుప్రీం తీర్పుతో తమను ఇళ్ల నుంచి బయటకు వెళ్లగొడతారన్న భయం వారిని వెంటాడుతోంది. ఆదివాసీల హక్కుల కోసం సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యుల ధర్మాసనం ముందు కేంద్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది.

అంతకుముందు జస్టిస్ అరుణ్ మిశ్రా, నవీన్ సిన్హా, ఇందిరా బెనర్జీలతో కూడిన ధర్మాసనం 16 రాష్ట్రాలలో గల అటవీ భూముల నుండి 11 లక్షల మంది గిరిజనులు, ఇతర అటవీ నివాసుల గృహాలను తొలగించాలని ఆదేశించింది. అయితే ఈ తీర్పుపై అభ్యంతరాలను తెలిపేందుకు కేంద్ర ప్రభుత్వ తరపు న్యాయవాది ఆ సమయంలో అక్కడ లేదు. అనంతరం కేంద్రం వ్యక్తం చేసిన అభ్యంతరాలతో అదే ధర్మాసనం ఫిబ్రవరి 28న తన తీర్పుపై స్టే విధించింది. అయితే భవిష్యత్తులో ఈ స్టే ఎత్తివేస్తే అది గిరిజనుల పాలిట శరాఘాతంగా మారుతుందనడంతో సందేహం లేదు.

అటవీ హక్కు చట్టం లేదా షెడ్యూల్డ్ తెగలు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసులు (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం కింద అటవీ భూములపై హక్కులను గిరిజనులకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు తిరస్కరించడమే సుప్రీం తీర్పుకు గల కారణం. డిసెంబర్ 13, 2005 నాటికి అటవీ భూములను ఆధీనంలో ఉంచుకున్న వారికి మాత్రమే చట్ట ప్రకారం యాజమాన్య హక్కు పొందటానికి అర్హులని అటవీ హక్కుల చట్టం చెబుతోంది. ఇతర సంప్రదాయ అటవీ నివాసుల వర్గానికి చెందినవారు, భూములపై అర్హత కోసం 75 సంవత్సరాల నుంచి భూమి తమ చేతుల్లో ఉందని చూపించాల్సి ఉంటుంది. అటవీ హక్కుల చట్టం అమలు తరువాత, గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ సెప్టెంబరు 2018న విడుదల చేసిన సమాచారం ప్రకారం జాతీయ పార్కులు, అభయారణ్యాలతో సహా అటవీ భూములకు సంబంధించి గిరిజనులు, గిరిజనేతరుల నుంచి దాదాపు 42 లక్షల వినతులు వచ్చాయి. 'పరిరక్షణ భారత్' విడుదల చేసిన సమాచారం ప్రకారం 18,89,835 హక్కు పత్రాలు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు వ్యక్తిగతంగా, సామూహికంగా 72,23,132 హెక్టార్ల అటవీ భూమిని (దాదాపు అస్సాం విస్తీర్ణ పరిమాణం) ఇచ్చారు.

అయితే అటవీ భూములపై విస్తృతంగా హక్కులను ఇవ్వడం వలన అడవి అనేది చిన్నచిన్న ముక్కలుగా విడిపోతుందని, మరికొన్ని విషయాల్లో తీవ్ర ప్రభావం చూపుతుందని పిటిషనర్ కోర్టులో వాదించారు. ఈ విభజన అనేది అడవుల మనుగడ, జీవవైవిధ్యానికి అత్యంత ప్రమాదరకమైనదని పేర్కొన్నారు. భారత్ భూభాగంలో కేవలం 5 శాతమే ఉన్న అడవులు, అభయారణ్యాలను రక్షించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్, ఒడిషా, మహారాష్ట్ర, కర్ణాటక, వైల్డ్‌లైఫ్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, నేచర్ కన్జర్వేషన్ సొసైటీ, టైగర్ రీసెర్చ్ అండ్ కన్జర్వేషన్ ట్రస్ట్, బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ వంటి సంస్థలతో పాటు పదవీ విరమణ చేసిన అటవీ అధికారులు కోర్టులో తొమ్మిది కేసులు దాఖలు చేశారు.

పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు జులై 24లోగా అటవీ భూములలో అక్రమంగా ఉంటున్న వారిని పంపించివేయాలని 16 రాష్ట్రాలను ఫిబ్రవరి 13న ఆదేశించింది. తమ ఆదేశాలను పాటించకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహార్, ఛత్తీస్‌ఘఢ్, గోవా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర రాష్ట్రాలు సంబంధిత హక్కులు లేని వారిని భూముల నుంచి ఎందుకు తొలగించలేదో అఫిడవిట్లు సమర్పించాలని ఆదేశించింది. తొలగింపు తర్వాత శాటిలైట్‌సర్వే చేసి, భూముల వివరాలపై నివేదిక ఇవ్వాలని కోరింది.

అటవీ భూములపై ఫిబ్రవరి 13న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అనంతరం ఆదివాసుల్లో ఆందోళన ప్రారంభమైంది. ఆదివాసులు, వామపక్షాలు, అభ్యుదయ శక్తుల ఆందోళన తీవ్రమవటంతో కోర్టు ఆదేశాలను నిలుపుదల చేయాలని కేంద్రం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సంబంధిత రాష్ట్రాల వాదనల సమీక్షను పెండింగ్‌లో ఉంచాలని కోరింది. అయితే ఇంతకు ముందు కేసు విచారణ సమయంలో తాను నిర్లక్ష్యంగా వ్యవహరించటం, ఆదివాసుల తరపున వాదనలు వినిపించకపోవటం గురించి ఫిబ్రవరి 28న కోర్టుకు కేంద్రం ఎటువంటి సంజాయిషి తెలియజేయలేదు. కేంద్రం తరపున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దశాబ్దాలుగా నివసిస్తున్న ఆదివాసీలకు అడవులతో ఉన్న సంబంధాన్ని గురించి వివరించారు. తమకు ఈ విషయం ఇటీవలే తెలిసిందని అన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై అనేక అనుమానాలు ఉన్నాయి. రానున్న ఎన్నికల నేపథ్యంలో లక్షలాదిగా అడవుల్లో నివసిస్తున్న ఆదివాసీల నుంచి ఈ విషయంలో తమపై వ్యతిరేకత వస్తుందనే భయంతోనే కేంద్రం సుప్రీం తీర్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రం వాదనలు విన్న కోర్టు అటవీ భూములపై గ్రామసభలు, రాష్ట్రానికి సంబంధించిన అధికారిక సంస్థలు అనుసరిస్తున్న వైఖరిని పరిశీలించాల్సి ఉందన్నారు. ఎక్కువ సంఖ్యలో తొలగింపు, తీర్పు వలన బాధితులుగా మారుతున్న వారికి కోర్టు ఆదేశాలకు సంబంధించి సమాచారం చేరకపోవడం, దీనికి సంబంధించి వారికి సరైన అవగాహన లేకపోవడం వంటి అంశాలపై రాష్ట్రాలు స్పందించాలని కోర్టు ఆదేశించింది.

**ఏది సహజ న్యాయం**

> **"అటవీ భూములకు సంబంధించి తిరస్కరణకు గురయిన వారిని ఆ భూముల నుంచి తొలగించాలని 2018, మార్చి 7న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అందోళన వ్యక్తం చేసింది. అయితే దీనికి సంబంధించి తదుపరి పరిణామా లైన పున:సమీక్ష పిటిషన్ వంటి వాటిని పరిగణనలోకి తీసుకోకుండా వివిధ రాష్ట్రాల అటవీ అధికారులు వెంటనే సుప్రీం తీర్పును అమలు చేసే పనిలో పడడం తమ దృష్టికి వచ్చిందని మంత్రిత్వ శాఖ తెలిపింది."**

కేంద్రం మార్గదర్శకాలను అనుసరించి ఆదివాసులు దాఖలు చేసిన దావాలను తిరస్కరించినట్లయితే, అందుకు కారణాలను గురించి హక్కుదారుకు తెలియజేయాలి. అతడికి లేదా ఆమెకు అప్పీల్‌కు 90 రోజుల పాటు సమయం ఇవ్వాలి. అటవీ భూమిని ఖాళీ చేయమని అడిగిన కుటుంబాలకు సహేతుకమైన అవకాశం కల్పించడం సహజ న్యాయంలో భాగం.

ఆటవీ చట్టాన్ని అమలు చేసేది కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ. చట్టం అమలుకు సంబంధించి దాని వెబ్‌సైట్‌లో నెలసరి కొత్త సమాచారాన్ని ఉంచుతుంది. నవంబర్ 30, 2018 నాటికి తాజా గణాంకాల ప్రకారం అందుబాటులో ఉన్న), 42,24,951 కమతాలు 40,76,606 మంది వ్యక్తిగత, 1,48,345 కమ్యూనిటీలవి నమోదయ్యాయి. వీటిలో 18,94,225 మందికి హక్కు పత్రాలు పంపిణీ చేయబడ్డాయి. మొత్తం 19,39,231 మందికి అనుమతులు తిరస్కరించినట్లు మంత్రిత్వశాఖ తెలిపింది. వీటిలో 4,62,403తో ఛత్తీస్‌ఘడ్ అగ్రస్థానంలో నిలిచింది, తర్వాత మధ్యప్రదేశ్ 3,62,024, మహారాష్ట్ర, ఒడిషాలు వరుసగా 2,28,116, 1,46,525 వినతులను తిరస్కరించాయి.

గ్రామసభ, డివిజనల్ కమిటీ, జిల్లా స్థాయి కమిటీల ద్వారా ప్రారంభించిన ఈ తిరస్కరణ ప్రక్రియ వివరాలను ఆయా రాష్ట్రాలు మంత్రిత్వ శాఖకు అందించాయి. ఈ సమాచారాన్ని ఆ శాఖ వెబ్‌సైట్‌లో కూడా ఉంచింది. ఈ మూడు స్థాయిలో ఎక్కడైనా ఆదివాసీల భూములకు సంబంధించి హక్కులు తిరస్కరణకు గురయితే తరువాత స్థాయి కమిటీకి అప్పీల్ చేసుకోవచ్చు. జిల్లా స్థాయి కమిటీలో తిరస్కరణకు గురయిన తర్వాత కోర్టులో ఛాలెంజ్ చేయవచ్చు. అయితే దీనికి సంబంధించి తిరస్కరణకు గురయిన వారిలో ఎక్కువ శాతం మంది అప్పీల్‌కు వెళ్లలేదు. చట్టాలు, సమర్పించాల్సిన పత్రాలకు సంబంధించి బాధితులకు సరైన అవగాహన లేకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ తిరస్కరణలలో ఎక్కువ భాగం గ్రామస్థాయి లోనే జరిగాయి.

అటవీ భూములకు సంబంధించి తిరస్కరణకు గురయిన వారిని ఆ భూముల నుంచి తొలగించాలని 2018, మార్చి 7న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అందోళన వ్యక్తం చేసింది. అయితే దీనికి సంబంధించి తదుపరి పరిణామాలైన పున:సమీక్ష పిటిషన్ వంటి వాటిని పరిగణనలోకి తీసుకోకుండా వివిధ రాష్ట్రాల అటవీ అధికారులు వెంటనే సుప్రీం తీర్పును అమలు చేసే పనిలో పడడం తమ దృష్టికి వచ్చిందని మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో బాధితులు ఆందోళన చెందారని తెలిపింది.

ఎక్కువ సంఖ్యలో జరుగుతున్న ఈ 'తిరస్కరణ'లకు సంబంధించి పరిశీలించాలని అనేక రాష్ట్ర ప్రభుత్వాలు 2014, సెప్టెంబర్ 12, 2015 ఏప్రిల్ 10న మంత్రిత్వ శాఖకు లేఖలు కూడా రాశాయి. తిరస్కరణల్లో ఎక్కువ భాగం గిరిజనేతరులకు సంబంధించినవి ఉన్నాయని, అవి కూడా మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఈ విషయంలో కలుగజేసుకుంటే అటవీ చట్టానికి వ్యతిరేకంగా ఉంటుందనే ఉద్దేశంతో ఫిబ్రవరి 13న కోర్టులో కేసు విచారణ జరుగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం గుమ్మనంగా ఉందని విశ్లేషకులు అంటున్నారు. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ పార్టీల నేతలు అటవీ హక్కుల కోసం ఉద్యమాలు చేస్తున్న వారితో కలిసి గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. చారిత్రాత్మకమైన అటవీ హక్కుల చట్టం అమలుకు సంబంధించి, దానిని కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం, ఆయా మంత్రిత్వ శాఖ విఫలమయ్యాయని పేర్కొన్నాయి.

అయితే అటవీ చట్టం యొక్క రాజ్యాంగ బద్ధత, శాసనం చేయడానికి పార్లమెంట్‌కు గల హక్కును పిటిషన్ దారులు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. భూములకు సంబంధించి ఎవరివైతే తిరస్కరణకు గురయ్యాయో, వారిని భూముల నుంచి తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే దీనికి సంబంధించి కాగ్ లేదా ఏ ఇతర సంస్థతోనైనా విచారణ చేయించుకోవచ్చని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దేశంలోని అటవీ, వన్యప్రాణులను రక్షించడమే తమ ఉద్దేశమని ఈ సందర్భంగా పిటిషన్ దారులు తెలిపారు.

అయితే అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చిన 2006 సంవత్సరంలో ఆ చట్టం అట్టడుగు వర్గాల వారికి అండగా ఉంటుందని భావించారు. సాంప్రదాయకంగాఎన్నోఏళ్లుగా అటవీ వనరులపై ఆధారపడి ఉన్నవారికి అనుకూలంగా ఉంటుందనుకున్నారు. అడవుల పరిరక్షణ, నియంత్రణ బాధ్యతలను రాష్ట్రాలు గ్రామ సంఘాలకు బదిలీ చేశాయి. అయితే దీని ఉద్దేశం బాగున్నప్పటికీ అనుకున్న లక్ష్యాలను సాధించడంతో చట్టం విఫలమైంది. చట్టం యొక్క నిబంధలను గురించి అనేక రాష్ట్రాలకు అవగాహన లేదు. తెలుసుకోవడానికి కూడా ప్రయత్నం చేయలేదు. ప్రముఖమైన వారికి, రాజకీయంగా పలుకుబడి ఉన్నవారికే అటవీ భూములపై తగిన హక్కులు కల్పించడంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిపెట్టాయి. ఆర్థిక అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు అటవీ భూములను మైనింగ్, పారిశ్రామిక కారిడార్లు, మెగా ప్రాజెక్టుల కోసం మళ్లించే పనిలో ఉన్నాయి. దీంతో పరిస్థితి మరింత తీవ్రతరం అవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.

అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చిన నాటి నుంచి దాదాపు 2 లక్షల 4 వేల హెక్టార్ల అటవీ భూమిని అభివృద్ధి పేరుతో ప్రాజెక్టులకు మళ్లించారు. ఈ మళ్లింపుల్లో ఎక్కువ శాతం చట్టంతో పనిలేకుండా, ఆయా గ్రామసభల సమ్మతి లేకుండా జరిగాయి. పర్యావరణ, అటవీ, శీతోష్ణస్థితి మార్పుల మంత్రిత్వశాఖ సంయుక్త కమిటీ నివేదిక, గిరిజను మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. ఈ మళ్లింపులు ఆయా ప్రాంతాల్లో ఘర్షణలకు దారితీశాయి. ఆదివాసీల హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని మేధావులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సఖ్యతగా ఉండే పెద్దపెద్ద కార్పొరేట్ వ్యక్తులకు సంబంధించిన మెగా ప్రాజెక్టుల కోసం అటవీ భూములను మళ్లించకుండా రక్షించేందుకే ఆదివాసీలు, వివిధ సంఘాలు, వామపక్షాలు పోరాడుతున్నారు. ❊

## నిండైన అరుణతార ఎన్ఎస్ఆర్

(2వ పేజీ తరువాయి)

అక్కడ అనేక ప్రాంతాల్లో ఉద్యమాన్ని విస్తరింప చేశారు. పోరాట విరమణ అనంతరం అండర్ గ్రౌండ్ జీవితం గడిపారు. ఆంధ్రా ప్రాంతంలో రక్షణ తీసుకున్నారు. చండ్ర రాజేశ్వర్‌రావు, మాకినేని బసవపున్నయ్య, వై.కృష్ణారావులతో కలిసి అండర్‌గ్రౌండ్ జీవితాన్ని గడిపారు. 1957లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే దాజి శంకర్ ద్వారా లొంగిపోయారు. ఆరు నెలల పాటు జైల్లో ఉన్నారు. ఆ తర్వాత 1957 నుంచి 1962 వరకూ నకిరేకల్ సమితి అధ్యక్షుడిగా, 1962 నుంచి 1967 వరకూ నకిరేకల్ ఎమ్మెల్యేగా పీడీఎఫ్ నుంచి ఎన్నికై ఎంతో నిజాయితీగా, బాధ్యతగా పని చేస్తూ ప్రజలకు ఎనలేని సేవలందించారు. 1964లో పార్టీ చీలిక తర్వాత మనస్థాపానికి గురై నకిరేకల్ ప్రాంతపార్టీ ఉద్యమాన్ని నర్రా రాఘవరెడ్డిని చూడాలని చెప్పి, తమకున్న కొద్దిపాటి ఆస్తులు అమ్ముకొని 1969లో మిర్యాలగూడ మండలం నందిపాడు గ్రామ శివారులో కొన్ని భూములు కొనుక్కొని చిన్న ఇల్లు ఏర్పర్చుకొని కొంతకాలం పార్టీకి, ఉద్యమానికి దూరంగా ఉన్నారు. తిరిగి 1972 నుంచి సీపీఐ(ఎం) మిర్యాలగూడ డివిజన్ కమిటీలో పని చేస్తూ రైతు సంఘంలో చురుకుగా పని చేశారు. మిర్యాలగూడ చుట్టు పక్కల గ్రామాల్లో మిగులు భూములు, ప్రభుత్వ భూములు బయటకు తీసి ఆ గ్రామాల్లోనున్న దళిత, గిరిజన పేదలకు పంపిణీ చేయించి వారందరికీ పట్టాలిప్పించి వారు వ్యవసాయం చేసుకోవడానికి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు కూడా మంజూరు చేయించి నీళ్లందించే ఏర్పాటు చేయించారు. రైల్వేలైన్ కింద భూములు కోల్పోయిన నిర్వాసితులకు రైల్వేశాఖ నుంచి న్యాయమైన నష్టపరిహారం లంబాడ గిరిజన రైతులకందించారు. వందలాది మంది కార్యకర్తలను తయారు చేసి సీపీఐ(ఎం)లో సభ్యులుగా పని చేయడానికి ప్రోత్సహించారు.

**విలువల యోధుడిగా పేరొందిన ఎన్ఎస్ఆర్**

ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మాజీ ఎమ్మెల్యేలకు జూబ్లీహిల్స్‌లో ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించారు. అందుకు దరఖాస్తు చేసుకోవాలనే ప్రతిపాదన ప్రభుత్వం నుంచి వచ్చినా.. శ్రీనివాసరెడ్డి నిరాకరించారు.

**పింఛన్ కూడా ప్రజాసేవకే..**

తనకు వచ్చే పింఛన్ సొమ్మును కూడా పూర్తిగా ప్రజాసేవకు ఉపయోగించారు. తాను చదివిన లక్షల విలువైన కమ్యూనిస్టు అభ్యుదయ, సాహిత్య పుస్తకాలను(2600) సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి విరాళంగా అందించారు. నీతికి, నిజాయితీకి మారుపేరు ఎన్ఎస్ఆర్. చిన్ననాటి నుంచి చనిపోయే వరకూ ఎర్ర జెండాను ఎత్తిపట్టి అనేక ఆటుపోట్లు, దాడులు, నిర్బంధాలూ శిక్షలూ ఎదుర్కొని నూరేండ్లు నిలబడిన కమ్యూనిస్టు ధీరుడు ఎన్ఎస్ఆర్. ఆయనకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. వారు కూడా ఆయన మార్గంలోనే నడుచుకుంటూ తమ శక్తిమేరకు ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. ఆయన మూడో కుమారుడు మధ్యలో వేరే పార్టీకి మారారని తెలిసి అతన్ని పిలిపించి 'నీవు ఎందుకు మారావు' అని మందలించి తిరిగి కమ్యూనిస్టు పార్టీలో చేరిన తర్వాతనే తనకు కన్పించాలని గట్టిగా ఆవేదనతో చెప్పగానే ఆయన తర్వాత వెంటనే వైఖరి మార్చుకొని సీపీఐ(ఎం)లో చేరి యథావిధిగా చురుగ్గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అంత నిక్కచ్చిగా తన కుటుంబ సభ్యుల ఎడల, కార్యకర్తల ఎడల ఉండే గొప్ప నాయకుడు. 90వ ఏట నుంచి ఎన్ఎస్ఆర్ ఆరోగ్యం క్షీణించడం మొదలైనప్పటి నుంచి కుమారులు చాలా జాగ్రత్తగా కంటికి రెప్పలాగా చూసుకుంటూ వచ్చారు. కాబట్టే ఆయన 102ఏండ్లు జీవించగలిగారు. ఆయన పట్ల వారి పిల్లలందరికీ ఎనలేని గౌరవం. ఆయన త్యాగాలు ఏనాటికీ వృథాకావు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన చూపించిన మార్గం, ఎత్తిన ఎర్రజెండా, మహత్తరమైన ఆశయం సాధించడానికి మనమంతా ముందుకు సాగాల్సి ఉంది.

**మెడికల్ కళాశాలకు శ్రీనివాస్‌రెడ్డి మృతదేహం**

తన శరీరం కూడా నలుగురికి ఉపయోగపడాలనే ఆలోచనతో దేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పజెప్పాలని ముందుగానే వీలునామా రాసి తన కుమారులకు ఇచ్చారు. దానికనుగుణంగానే భౌతికకాయాన్ని మహబూబ్‌నగర్ శ్రీ వెంకటేశ్వర వైద్యకళాశాలకు పరిశోధన నిమిత్తం అప్పగించారు. 'ఎన్ఎస్ఆర్ అమర్‌హై...మీ త్యాగాలు ఏనాటికీ మరువలేం..మీ ఆశయాలు సాధించటానికి ముందుకు సాగుతాం' ... మీకివే మా జోహార్లు. ❊

## బిజెపిని ఎందుకు ఓడించాలంటే..?

(17వ పేజీ తరువాయి)

స్థానాలతో పాటు మొత్తం వామపక్షాలు 59 స్థానాలకు తమ బలాన్ని పెంచుకోగలిగాయి. అప్పటి యుపిఎ-1 ప్రభుత్వం తీసుకొచ్చే అనేక సంస్కరణలకు, ప్రజా సంక్షేమ విధానాలలో వామపక్షాలే కీలక పాత్ర పోషించాయి. ఉపాధి హామీ చట్టం, విద్యా హక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రతా చట్టం తీసుకురావడంలో వామపక్షాలు పాత్ర అనిర్వచనీయం. 2009లో సిపిఎంకు 16, మొత్తం వామపక్షాలకు 24 స్థానాలు రాగా, 2014లో సిపిఎంకు 9, సిపిఐకు 1 వచ్చింది. ఇలా గత రెండు ఎన్నికల్లో సిపిఎం, వామపక్షాల సీట్లు తగ్గుతూ వచ్చాయి. అయితే బలమైన సైద్ధాంతిక అవగాహన గల వామపక్ష కార్యకర్తలకు అది తాత్కాలిక నిరుత్సాహమే. కానీ అక్కడే ఆగిపోకుండా ముందడుగు వేస్తూ భవిష్యత్ కోసం ప్రజా ఉద్యమాలను ఉత్సాహంతో నిర్మిస్తున్నారు. అయితే ఎన్నికల్లో సిపిఎం, వామపక్షాలు బలం తగ్గడానికి బలమైన కారణాలు లేకపోలేదు. ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ చాలా సంపన్నమైపోయింది. ఓటుకు నోటు పెట్టే కుసంస్కృతిలోకి దిగజారింది. డబ్బున్నవాడే ఎన్నికల్లో పోటీ చేయాలనే సాంప్రదాయాన్ని తీసుకొచ్చారు. కోట్ల రూపాయలతో రాజకీయాలు చేసే పార్టీలు ఎన్నికలను వ్యాపారంగా మలిచాయి. బలమైన ఉధృత పోరాటాలు జరిగినా వామపక్షాలకు ఓట్లు పడటం లేదని చర్చ జరుగుతుంది. ఉద్యమాల్లో కదిలే ప్రజానీకం వామపక్షాలకు ఓట్లు వేసే స్థితికి చేరలేదు. మరోవైపు 1990 తరువాత దేశంలోని నయా ఉదారవాద విధానాలు అమలు జరిగాయి. ఫలితంగా ప్రతిదీ వ్యాపారమయం అయిపోయింది. అందులో భాగంగానే ఓటును కూడా సరుకుగా తయారు చేశారు. ఈ నేపథ్యంలో సిపిఎం, వామపక్షాల గెలుపనేది సవాలుగా మారింది. హంగులు, ఆర్భాటాలతో హడావిడి చేసే పార్టీలను ఎదుర్కొనేందుకు సిద్ధాంతానికి కట్టుబడి పని చేసే పార్టీలకు సమయం పడుతుంది. ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలవకపోయినా దేశాభివృద్ధి, సమాజాభివృద్ధి కోసం సిపిఎం, వామపక్షాలు నిరంతరం కృషి చేస్తున్నాయి. తక్కువ స్థానాలు గెలిచినా సిపిఎం, వామపక్షాల నేతలు విధానాల ప్రాతిపదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. పార్లమెంట్‌లోపల, బయట నిరంతరం ప్రజల సమస్యలే ఎజెండాగా పోరాడుతున్నాయి. ఈ ఐదేళ్లలో ఒకపక్క సైద్ధాంతిక పోరాటం, మరో వైపు సామాజిక, ఆర్థిక పోరాటాల నిర్మాణంలో సిపిఎం, వామపక్షాలు కీలకపాత్ర పోషించాయి. దేశంలో రైతాంగ, కార్మిక పోరాటాల్లోనూ, వివక్షపై జరిగిన సామాజిక ఉద్యమాల్లోనూ సిపిఎం కీలక పాత్ర పోషించింది. ఇలాంటివి చెప్పుకుంటూ పోతే కోకొల్లలు. ప్రజా సమస్యలపై మాట్లాడే గొంతుకే వామపక్షం...దాని ముందు మరేదీ సాటి రాదు. విధానాల ప్రాతిపదికగా బిజెపి పెంపొందిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సిపిఎం చూపుతున్న మార్గమే దేశ భవిష్యత్‌కు పునాది అవుతుంది. వామపక్షాలు, లౌకికశక్తుల ఐక్యతే భారత ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగరక్షణకు మౌలిక పునాదిగా పనిచేస్తుంది. ❊

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-04-2019 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# ముస్లింలీగ్‌కు సవాలుగా నేషనల్ కాన్ఫరెన్స్



## ఇఎంఎస్ నంబూద్రిపాద్

"**యు**ద్ధానికి ముందూ, యుద్ధంలోనూ వున్న ఈ పరిస్థితి ప్రభావం కాశ్మీర్‌లో యుద్ధానంతర రాజకీయాలపై పడింది. దానితో బాధ్యతాయుత ప్రభుత్వానికై ఆ సంస్థానంలో జరుగుతున్న ఉద్యమానికి బలం చేకూరింది. బ్రిటిష్ ఇండియాలో క్విట్ ఇండియా నినాదాన్ని అనుసరించి కాశ్మీరులో 'క్విట్ కాశ్మీర్' అనే నినాదాన్ని నేషనల్ కాన్ఫరెన్స్ ఇచ్చింది. దాని అర్థం మహారాజు కాశ్మీర్ నుండి వైదొలగి అధికారాన్ని ప్రజలకు బదలాయించాలి.

"అయితే, ఏ యితర స్వదేశీ సంస్థానంలోనూ ప్రజాతంత్ర ఉద్యమాలు ఇంత తీవ్రమైన నినాదాన్ని చేబట్టలేదు. అత్యధిక స్వదేశీ సంస్థానాల్లో ఎన్నికైన శాసనసభ బాధ్యత వహించే ప్రభుత్వం ఉండాలనీ, మహారాజు ఆ సంస్థానానికి లాంఛన ప్రాయంగా అధిపతిగా ఉండటానికి మాత్రమే ఆ ఉద్యమాల డిమాండ్ పరిమితమై ఉంది. ఈ సందర్భంగా కాశ్మీర్‌కు సంబంధించిన ప్రత్యేకత ఏమంటే, బూరువా జాతీయతకు ప్రాతినిధ్యం వహించే ఒక స్థానిక సంస్థ మహారాజు హక్కులను తుదముట్టించాలనే డిమాండ్‌తో ముందుకు రావడం.

"కాశ్మీర్ ఉద్యమానికి సంబంధించి మరొక ప్రత్యేక లక్షణమేమంటే, నేషనల్ కాన్ఫరెన్సు నాయకత్వ మత సంబంధమైన స్వభావం. అదొక ప్రజా సంస్థ. అందులో అన్ని మతాలకు చెందిన వారున్నారు. అన్ని మతాలవారికీ నాయకత్వంలో ప్రాతినిధ్యం వుంది అయితే ముస్లిం మతానికి చెందిన షేక్ అబ్దుల్లా మొత్తంగా నాయకత్వం వహిస్తున్నాడు. అలాంటి సంస్థ ఒకటి ఉండటమే ముస్లింలీగు రెండు జాతుల సిద్ధాంతానికి సవాలుగా పరిణమించింది. దీనికి సమానంగా ఉన్న మరో ఏకైక సంస్థ వాయువ్య సరిహద్దు రాష్ట్రంలో ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ నాయకత్వానగల ప్రజాఉద్యమం మాత్రమే. ఇది ముస్లిం లీగుకు అదేపనిగా కంటకింపుగా పరిణమించింది. బ్రిటిష్ రాయబార సంఘంతో సంభాషణలు జరుగుతున్న సమయంలో కాశ్మీర్ సమస్య విషమించింది. కాంగ్రెసుతోనూ, బ్రిటిష్ రాయబార సంఘంతోనూ తాను జరిపే రాజీబేరాల్లో తన స్థానాన్ని పెంపొందించుకునేందుకు నేషనల్ కాన్ఫరెన్సును విలీనం చేసుకునేందుకు లీగు నాయకత్వం ప్రయత్నించింది, కాని ఆ ప్రయత్నం ఫలించలేదు వాయువ్య సరిహద్దు రాష్ట్రంలో ఖాన్ సోదర్లుబాగానే, దేశం మొత్తంమీద జాతీయ ముస్లింల లాగానే కాశ్మీరులోని నేషనల్ కాన్ఫరెన్సు కూడా ముస్లింలీగు డిమాండ్‌కు వ్యతిరేకంగా ఖచ్చింతంగా నిలబడింది. దాని నినాదం 'క్విట్ కాశ్మీర్'. కాబట్టి మహారాజూ, ఆయన ప్రభుత్వమూ నేషనల్ కాన్ఫరెన్సుపై చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. షేక్ అబ్దుల్లాతో సహా నేషనల్ కాన్ఫరెన్సు నాయకులను ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆనాడు స్వదేశీ సంస్థానాల ప్రజల అఖిల భారత సంఘం అధ్యక్షుడుగా వున్న జవహర్ లాల్ నెహ్రూను కలుసుకొని సంప్రతింపులు జరపడానికి ఢిల్లీ వెళుతూ ఉండగా షేక్ అబ్దుల్లా అరెస్టు చేయబడ్డారు దీనితో నెహ్రూ ఆగ్రహం చెంది, స్వయంగా తానే కాశ్మీరుకు బయలుదేరి వెళ్ళారు. కాశ్మీరులో ప్రవేశించగానే నెహ్రూ కూడా అరెస్టు చేయబడ్డారు. ఒక వైపునుండి వైస్రాయి, భారత ప్రభుత్వమూ, మరోవైపునుండి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ జోక్యం కల్పించుకోవడంతో పరిస్థితి అదుపుతోకి తీసుకొని రాబడింది. స్వదేశీ సంస్థానాల సమస్యలపట్ల బ్రిటిష్ ప్రభుత్వమూ, స్వదేశీ సంస్థానాల పాలకులు, కాంగ్రెసు, ముస్లింలీగు నాయకులు తీసుకున్న వైఖరికి యిది చక్కటి ఉదాహరణగా వుండగలదు. తన రాష్ట్రంలో ప్రజా ఉద్యమాన్ని అణచివేయడానికి మహారాజు ప్రయత్నించాడు. కొద్ది వారాల్లోనే భారతదేశానికి ప్రధానమంత్రి కాబోతున్నాడని అందరూ అనుకొంటున్న జవహర్‌లాల్ నెహ్రూను సైతం కాశ్మీర్ ప్రభుత్వం అరెస్టుచేసింది. ఈ రకమైన చర్య తీసుకోకుండా వైస్రాయిగాని, బ్రిటిష్ ప్రభుత్వంగాని ఏమీ చేయలేకపోయాయి. నెహ్రూను అరెస్టు చేయవద్దనీ, షేక్ అబ్దుల్లా విచారణను వాయిదా వేయమనీ వైస్రాయి కాశ్మీరు ప్రభుత్వానికి సూచించాడు. ఆ సూచనకు జవాబుగా "జవహర్‌లాల్ పై ఎలాంటి చర్యను తీసుకోరాదని ఇండియా ప్రభుత్వం తనపై ఒత్తిడితెచ్చే పక్షంలో తాను రాజ్యాధిరాన్నుండి వైదొలగుతాననీ, తన ప్రధానమంత్రిని రాజీనామా యివ్వవలసిందిగా కోరతానని" మహారాజు వర్తమానం పంపించాడు. ఇంక దీనితో వైస్రాయి తన సూచనను ఉపసంహరించుకున్నాడు. నెహ్రూను అరెస్టు చేసిన తరువాత మాత్రమే షేక్ అబ్దుల్లా విచారణ వాయిదా వేయబడింది. వైస్రాయి' బ్రిటిష్ రాయబార సంఘాల కోర్కెపై నెహ్రూను తిరిగి ఢిల్లీకి తీసుకుని వచ్చారు.

"కాశ్మీర్ సమస్యను గురించి ముస్లిం లీగు ఏమాత్రం పట్టించుకోలేదన్న విషయం గమనించదగినది. మొత్తంమీద కాంగ్రెసు రాజకీయ దృక్పథాన్ని నేషనల్ కాన్ఫరెన్సూ అనుసరించుతున్నది. దానికి నాయకత్వం వహించుతున్నది జాతీయ ముస్లిం. ఆయనకు నెహ్రూతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఇది లీగుకు, దాని నాయకుడు జిన్నాకు తలనొప్పిగా వుంది. అయినా యేమీ చేయలేని నిస్సహాయస్థితిలో పడ్డాడు. నేషనల్ కాన్ఫరెన్సుపైనా, దాని నాయకులపైనా "ఒక హిందూ రాజు" చర్యలను తీసుకొన్నప్పటికీ అందుకు వారు అసమ్మతిని వ్యక్తపరచలేకపోయారు. పైపెచ్చు తాము ఏ కాంగ్రెసు నాయకులనైతే హిందూ నాయకులని లీగు వర్ణించినదో, వారే హిందూ రాజు ముస్లింలపై అనుసరించుతున్న నిర్బంధ విధానాన్ని వ్యతిరేకించడం జరిగింది. ఇది లీగు చెప్పే "రెండు జాతుల సిద్ధాంతాని"కి విరుద్ధంగా వున్నప్పటికీ బ్రిటిష్‌వారితోనూ, కాంగ్రెసుతోనూ రాజకీయాధికారం కోసం రాజీ బేరాల్లో నిమగ్నమైన పరిస్థితులలో లీగు మరో వైఖరిని తీసుకోవడం సాధ్యంకాలేదు."

*(ఇఎంఎస్ నంబూద్రిపాద్ రచించిన 'భారత స్వాతంత్ర్య పోరాటం' గ్రంథంనుండి ఈ భాగం ముద్రించబడింది)*

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490098977. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.13, No.12. Published on April 1, 2019